అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శుక్రవారం 28-7-2023
సంపుటి : 9 సంచిక : 208
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
www.navatelangana.com
12 పేజీలు వెల : 6.50


పార్లమెంటులో నల్ల దుస్తులతో ప్రతిపక్షాల నిరసన

ఇండియా వర్సెస్ మోడీ
11లో






ముంచెత్తుతోంది...

ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు.. తెరుచుకున్న గేట్లు

ఊళ్ళన్నీ నీటిలోనే .. పల్లెలు జలమయం

- ప్రమాదకరంగా కడెం ప్రాజెక్టు...
- భద్రాద్రి గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక
- తెగిన చెరువులు, కుంటలు.. పలువురు గల్లంతు
- ప్రజలను కాపాడిన రెస్క్యూ టీమ్‌లు
- ఏడాది వాన ఒక్కరోజులో కురిసిందన్న అధికార వర్గాలు
- హైదరాబాద్ వాసుల ఆందోళన
- ములుగు జిల్లా వెంకటాపూర్‌లో 65 సెం.మీ వర్షపాతం

సీఎం కేసీఆర్ సమీక్ష
ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం

ఆకాశానికి చిల్లు పడిందా అనేలా వాన కురుస్తోంది.. ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వరదలు ముంచెత్తుతున్నాయి. ఊరు వాడ తేడా లేకుండా ఊళ్లన్నీ చెరువుల్లా మారాయి. చెరువులు, కుంటలు తెగిపోయాయి. ప్రాజెక్టులు ప్రమాదకర స్థాయిలో ఉండటంతో పూర్తి గేట్లను ఎత్తడం వల్ల పరివాహక గ్రామాలను వరద ముంచెత్తింది. జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. 108 గ్రామాలు జలమయ్యాయి. గల్లంతైన వారిలో కొంతమంది జాడ కానరాలేదు. పట్టణాలు, కాలనీలు అస్తవ్యస్తంగా మారాయి. గ్రేటర్ హైదరాబాద్ వాసులు ఆందోళనలో ఉన్నారు. ముంపు ప్రాంత ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.. గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

నవతెలంగాణ- విలేకరులు

తెలంగాణలో ఎక్కడ చూసినా వర్షబీభత్సపు ఛాయలు కనిపిస్తున్నాయి.ఇండ్లు కూలిపోయాయి. పంటలు వరదలకు తుడిచిపెట్టుకుపోయాయి. కల్వర్టులు, రోడ్లు తెగిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితికి చేరుకుంది. ఖమ్మంలో మున్నేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న వారిని రెస్క్యూ టీం సురక్షిత ప్రాంతానికి తరలించింది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నుంచి భారీగా వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలను అధికారులు బంద్ చేశారు. భద్రాద్రి వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్‌లో పట్టాలపైకి వరద చేరడంతో పలు రైళ్లను నిలిపేశారు. జంపన్నవాగు ప్రాంతంలో చిక్కుకున్న చిరు వ్యాపారులు, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన స్థానికులను ఎన్‌డిఆర్‌ఎస్(రెస్క్యూ టీం) బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. వెంకటాపురం మండల కేంద్రంలోని ...12లో

ప్రాణనష్టం జరగకుండా చూడండి : కేటీఆర్



వర్షాలను రాజకీయం చేయడం తగదు
హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి
12లో

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

పార్టీ శ్రేణులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు
వరద బాధితులను ఆదుకోవాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సహాయ కార్యక్రమాల్లో విరి విగా పాల్గొనాలని పార్టీ శ్రేణులను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలు పునిచ్చింది. వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆదుకోవా లని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు, వరదల వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నీటిలో మునిగిపోయాయని ఆందోళన ...11లో

మూడేండ్లలో 20 సార్లు పెరిగిన గ్యాస్ ధర


11లో..

తక్షణ సహాయచర్యలు చేపట్టాలి

మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు సీఎం ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ప్రాణనష్టం జరగకుండా చూడాలి. భారీ వరదల నేపథ్యంలో ప్రాజెక్టుల వద్దే ఉంటూ సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో రక్షణ, పునరావాసం, వైద్యం, ఆహార సరఫరా వెంటనే చేపట్టాలి....' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులను గురువారం ఆదేశించారు. సీఎం ఆదేశాలతో సీఎస్ శాంతికుమారి సచివాలయం నుంచి అధికారులతో సమీక్షించారు. అవసరమైన చోటికి ఎన్డీఆర్ఎఫ్ ...5లో

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

వివరాలు 11లో..

విద్యాసంస్థలకు నేడు సెలవు

ముఖ్యమంత్రి కేసీఆర్

వివరాలు 11లో..

జమిలి ఎన్నికలు కష్టమే నిర్వహణకు అడ్డంకులు

ఐదు రాజ్యాంగ సవరణలు చేయాలి

- వేల కోట్లు ఖర్చు చేయాలి
- భారీగా ఈవీఎం,వీవీప్యాట్‌లు అవసరం
- అదనపు పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు కావాలి : రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

వివరాలు 11లో

స్టాండింగ్ కమిటీ నుండి ప్రతిపక్షాల వాకౌట్

డేటా ప్రొటెక్షన్ బిల్లుపై అభ్యంతరం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లుపై చర్చించి, ఆమోదం తెలిపేందుకు గురువారం జరిగిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం నుండి వాకౌట్ చేశాయి. బిల్లుకు సంబంధించిన నివేదికను ఆమోదించడానికి ...11లో



కుతంత్రమే!

మణిపూర్ హింస వెనుక అసలు కథ

- మైతీల కొమ్ముకాస్తున్న 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం
- సమస్య పరిష్కారంలో ఉదాశీనత
- ఉద్దేశపూర్వకంగానే తాత్సారం
- రాజకీయ లబ్ది కోసం సాగతీత



మణిపూర్ హింసాకాండను అణచివేయడంలో కేంద్రం ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తోంది? ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారు? సమస్యను సత్వరమే పరిష్కరించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారు? హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ ఎందుకు విఫలమవుతోంది? .... ఈ ప్రశ్నలు ఇప్పుడు భారతీయుల మెదళ్లను తొలచివేస్తున్నాయి. వీటికి సమాధానం కోసం జాతి యావత్తూ ఆసక్తిగా ఎదురు చూస్తూనే ఉంది.

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో నిరసన గళాల గొంతు నొక్కడంలోనూ ప్రత్యర్థి పార్టీల ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో ప్రత్యర్థులపై ప్రభుత్వ సంస్థలను ఉసిగొల్పడంలోనూ చురుకుగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం మణిపూర్ విషయంలో మాత్రం అచేతనంగా వ్యవహరిస్తోంది. మణిపూర్ హింసకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను మాత్రమే బలిపశువును చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రాలలో కూడా బీజేపీకి అధికారాన్ని కట్టబెడితే ఆయా రాష్ట్రాల వ్యవహారాలను తాను నేరుగా నియంత్రిస్తానని చెప్పుకుంటున్న పెద్దమనిషి... మణిపూర్‌లో తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ పరిస్థితిని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? అసాధారణ సంఖ్యలో కేంద్ర భద్రతా దళాలను మోహరించినప్పటికీ హింసను అదుపు చేయలేకపోయానని మోడీ ప్రభుత్వం చెబుతుందా? రాష్ట్ర ప్రభుత్వానికి సాయం చేసేందుకు ప్రత్యేక ప్రతినిధులను పంపడం ద్వారా తనకు ...5లో

సెప్టెంబర్ 15 వరకు ఓకే

- ఈడీ చీఫ్ పదవీకాలం పొడగింపునకు సుప్రీం గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: ఈడీ డైరక్టర్ పదవీకాలం పొడిగింపునకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఈడీ చీఫ్ ను సెప్టెంబర్ 15 వరకు కొనసాగించడానికి కేంద్రానికి సుప్రీం కోర్టు అనుమతినిచ్చింది. ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్ట రేట్ చీఫ్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడగించాలని కేంద్రం చేసిన అభ్యర్థనపై సుప్రీం ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. ఈడీ డైరక్టర్‌గా ఉన్న ఎస్‌కే మిశ్రాను సెప్టెంబర్ 15 వరకు ఈడీ చీఫ్ బాధ్యతల్లో కొనసాగేందుకు అను మతినిచ్చింది. ఈ క్రమం లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతం ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సంజయ్ కుమార్ మిశ్రా(63) పదవీ కాలాన్ని అక్టోబర్ 15 వరకు పెంచామని కోరుతూ కేంద్రం ప్రభుత్వం సుప్రీంకోర్టును బుధవారం ఆశ్రయించింది. ఈడీ డైరక్టర్ పదవీ కాలం పొడిగింపు పై సుప్రీం కోర్టులో రెండో రోజు వాదనలు కొనసాగాయి. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ సమీక్ష జరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ను కేంద్రం గడువు కోరింది. వాదనల సందర్భంగా ప్రస్తుత చీఫ్ మినహా మిగతా మొత్తం విభాగం అసమర్థులతో నిండి ఉందా? అని ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. ఎస్‌కే మిశ్రా అనివార్యమైన వ్యక్తి కాదని.. కానీ ఎఫ్‌ఏటీఎఫ్ సమీక్ష కు ఆయన ఉండటం అవసరమని కేంద్రం పేర్కొంది. ఆయన్ను మరికొంత కాలం కొసాగించేందుకు అనుమతి ఇవ్వా లని ధర్మాసనాన్ని కేంద్రం కోరింది. దీంతో సెప్టెంబర్ 15 వరకు ఎస్.కె. మిశ్రా ఆ పదవిలో కొనసాగవచ్చునని ధర్మాసనం తెలిపింది. సెప్టెంబర్ 15 అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన ఎట్టిపరిస్థితుల్లో తప్పుకోవాల్సిందేనంటూ జస్టిస్ బిఆర్ గవై, విక్రమ్ నాథ్, సంజయ్ కరోల్ సభ్యులుగా ఉన్న త్రిసభ్య కమిటీ ఆదేశించింది.

మణిపూర్‌లో సాంఘిక జీవనాన్ని పునరుద్ధరించాలి

అల్లర్లల్లో సమిధలు మహిళలు, పిల్లలే

- అక్కడ వెనుకబాటుకు పలు రుగ్మతలే కారణం
- రెండు మతాల మధ్య గొడవగా చిత్రీకరించే ప్రయత్నం దారుణం : ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ ఇబెంచ చాను



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్ మంటల్లో ఎక్కువగా కాలిపోతున్నది, సమిధలవుతున్నది మహిళలు, పిల్లలేనని బోడో లాండ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇబెంచ చాను ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్రంలో సాంఘిక జీవనాన్ని తిరిగి పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆమె కోరారు. క్రైస్తవాన్ని ఆరాధించేవాళ్లు మైతీల్లోనూ ఉన్నారనీ, హిందూ దేవుళ్లను పూజించే వారు కుకీల్లోనూ ఉన్నారని చెప్పారు. మణిపూర్ అల్లర్లను రెండు మతాల మధ్య గొడవగా చూపుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. మణిపూర్ మంటల్లో మహిళల స్థితి అనే అంశంపై గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వెబినార్‌ను నిర్వహించారు. దీనికి సమన్వయ కర్తగా ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ వహించగా కె.వీరయ్య అనువాదం చేశారు. ఈ సందర్భంగా చాను మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం అంతంత మాత్రమేనన్నారు. అక్కడ మహిళా కార్మికులు అధికంగా ఉంటారనీ, ఇంఫాల్‌లోని ఇమామ్ మార్కెట్‌లో 500 దుకాణాలను మహిళలే నడుపు తారని చెప్పారు. వారందరూ తమ రోజువారీ, అటవీ ఉత్పత్తులను తీసుకొచ్చి అక్కడ అమ్ముకుంటారని వివరించారు. ఇప్పుడు వారంతా జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. పర్వత ప్రాంతాల్లో ఫల, ఉత్పత్తుల సేకరణ ఆగిపోయిందన్నారు. మహిళలపై లైంగిక దాడులతో ఆటవీ ఉత్పత్తులను తీసుకొచ్చి మైదాన ప్రాంతాల్లో అమ్మలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. మణిపూర్ ప్రజల సాంఘిక జీవనంలో నెలకొన్న భయాందోళనలు కొన్ని తరాల పాటు నిలిచిపోయే అనారోగ్యవాతావరణాన్ని కూడా అక్కడ సృష్టించారని విమర్శించారు. ఎక్కడైనా ఓ వ్యక్తి అబద్ధమాడితేనో, లైంగిక దాడి చేస్తేనో ఆ సామాజిక తరగతి, తెగకు మొత్తం దాన్ని అంటగట్టడం సరిగాదన్నారు. ఆ తెగలోని అందర్నీ దోషులుగా చూపెట్టడం తగదని చెప్పారు. ఇంత పెద్ద దేశంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న పాలకులు చిన్న ప్రాంతంలో అల్లర్లను నియంత్రించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ మంటలు నిరంతరం కొనసాగాలనే ఆలోచన పాలకుల్లో ఉంది కాబట్టే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి భద్రతలను నెలకొల్పడం పాలకులకు ఏమాత్రం ఇష్టముండదన్నారు. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అక్రమాయుధాలు, మాదక ద్రవ్యాల సరఫరాను అరికట్టడంలోనూ, ప్రజల ఆర్థిక అసమానతలను తగ్గించడంలోనూ, లైంగిక వ్యాధుల సంక్రమణ నివారణలోనూ, శాంతి భద్రతలను నెలకొల్పడంలోనూ మణిపూర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మొదట అక్కడి ప్రజల వెనుకబాటుకు కారణమేమిటనే విషయాన్ని పాలకులు గుర్తించి వారికి మేలు చేసే చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత తక్కువ

ఇది ఆమోదయోగ్యం కాదు

- శిక్షార్హమైన చర్యగా పరిగణించాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

న్యూఢిల్లీ : ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ ఆమోదయోగ్యం కాదని కేంద్ర గ్రామీణాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన కింద నిర్మించిన అనేక రోడ్ల నాణ్యత తక్కువగా ఉందని విమర్శించింది. పథకం కింద ఉన్న రోడ్ల మందాన్ని ఇప్పటికే ఉన్న 20 ఎంఎం నుంచి 30 ఎంఎం వరకు పెంచాలని సూచించింది. గురువారం లోక్‌సభలో సమర్పించిన నివేదికలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ సంబంధిత స్టాండింగ్ కమిటీ కూడా పథకాన్ని సక్రమంగా అమలు చేయడానికి మెరుగైన కేంద్ర, రాష్ట్ర సహకారం అవసరమని నొక్కి చెప్పింది.

డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలోని కమిటీ "పీఎంజీఎస్‌వై (ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన) కింద రహదారి నిర్మాణ నాణ్యత మొత్తం దేశాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన సమస్య" అని పేర్కొంది. "కేంద్ర ప్రభుత్వం స్కీమ్‌లోని ఈ సమస్య దేశంలోని గ్రామీణ ప్రజల ఆశలపై విస్తృత ప్రభావం చూపుతుంది" అని కమిటీ పేర్కొంది. రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పూర్తిగా ఆమోదయోగ్యం కాదని, శిక్షార్హమైన చర్యగా పరిగణించాలని కూడా తెలిపింది. "చాలా చోట్ల రోడ్ల నిర్మాణంలో ఉపయోగించిన నాసిరకం రోడ్ మెటీరియల్‌ల పట్ల కమిటీ దృష్టిని ఆకర్షించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇవి వాతావరణం (వర్షాలు), ట్రాఫిక్ పరిమాణాన్ని ఒక సీజన్‌లో కూడా తట్టుకోలేక, వాటితో కొట్టుకుపోతున్నాయి" అని పేర్కొంది. "తమ నియోజకవర్గాల్లో గ్రౌండ్ రియాలిటీ అనుభవం ఉన్న కమిటీ సభ్యులు చాలా చోట్ల రోడ్ల నాణ్యత లేని సమస్యను పదే పదే లేవనెత్తారు" అని ప్యానెల్ తెలిపింది.

పీఎంజీఎస్‌వై కింద నిర్మించిన రోడ్ల నాణ్యత నాసిరకం ముడిసరుకుల వినియోగం, ఇతర సంబంధిత కారణాల వల్ల రాజీ పడకుండా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖను కోరింది. గ్రామీణ రహదారులకు అపారమైన నష్టం కలిగించే భారీ టన్నుల వాహనాల రాకపోకలను పరిగణనలోకి తీసుకోకుండా, పీఎంజీఎస్‌వై రోడ్లు అటువంటి మార్గదర్శకాల ప్రకారం నిర్మించబడుతున్నాయని ప్యానెల్ ఎత్తి చూపింది. "భారీ వాహనాలు పీఎంజీఎస్‌వై కింద 20 ఎంఎం మందం కలిగిన గ్రామీణ రహదారులకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయి. పీఎంజీఎస్‌వై కింద రోడ్ల మందాన్ని ప్రస్తుతం ఉన్న 20 మిల్లీమీటర్ల నుంచి 30 మిల్లీమీటర్లకు పెంచాలి" అని ప్యానెల్ సూచించింది. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నిబంధలను పట్టించుకోవడం లేదని, నిర్వహణ నిబంధనను పాటించకపోవడం వల్లే పీఎంజీఎస్‌వై కింద వేసిన రోడ్లు పాడైపోతున్నాయని పేర్కొంది.

81 మంది తహసీల్దార్‌లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు : ట్రెసా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెవెన్యూ శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగుతున్నది. ఇటీవల 19 మందికి పదోన్నతులిచ్చిన ప్రభుత్వం తాజాగా మరో 81 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో 100 మంది తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించినట్టయింది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్‌కు ట్రెసా కతజ్ఞతలు తెలిపింది. తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలంటూ సోమవారం సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మొత్తం వంద మందికి పదోన్నతులు రావడం శుభపరిణామమని ట్రెసా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, గౌతంకుమార్ అన్నారు.

సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరద ప్రాంత వాసులను ఆదుకునేందుకు వీలుగా సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్(ఐఆర్‌సీఎస్) 33 జిల్లాల శాఖలు, రాష్ట్ర కార్యాలయంతో ఆమె వర్చువల్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాధితుల సహాయార్థం చేపట్టిన ఉపశమన, పునరావాస చర్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల శాఖల నుండి రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొని, ఆయా జిల్లాల్లోని ప్రస్తుత పరిస్థితులను గవర్నరుకు వివరించారు.

చదువులు ఆగం...



విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం

- భారీ వర్షాల నేపథ్యంలో వరుసగా సెలవులు
- నష్టపోతున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులు
- టెన్త్, ఇంటర్ చదివే వారిపై తీవ్ర ప్రభావం
- 'ప్రయివేటు'లో ఆన్‌లైన్ తరగతులు
- ప్రీప్రైమరీ విద్యార్థులనూ వదలని యాజమాన్యాలు
- పది, ఇంటర్ పిల్లలకు నేరుగా బోధన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకూ ప్రభుత్వం సెలవులు ప్రకటిస్తున్నది. ఈనెల 20 నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వర్షాలకు విద్యార్థుల చదువులు ఆగమవుతున్నాయి. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. అయితే ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివే విద్యార్థులపైనే ఈ సెలవుల ప్రభావం తీవ్రంగా ఉన్నది. వారి చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులే ఎక్కువగా నష్టపోతున్నారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులపై ఎక్కువ ప్రభావం పడనుంది. ఎందుకంటే వారు మార్చి, ఏప్రిల్‌లో పబ్లిక్ పరీక్షలను రాయాల్సి ఉంటుంది. కాబటి ప్రతిరోజూ ఆ విద్యార్థులకు ఎంతో కీలకం. వరుస సెలవుల నేపథ్యంలో సిలబస్ పూర్తి చేయడంపైనా ప్రభావం పడుతుంది. గతంలో 2020-21, 2021-22 రెండు విద్యాసంవత్సరాలు కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలోనూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులే ఎక్కువగా నష్టపోయారు. ఆ ప్రభావం ఇంకా వెంటాడుతూనే ఉన్నది. విద్యార్థుల సామర్థ్యం రోజురోజుకు పడిపోవడమే అందుకు నిదర్శనం. వివిధ సర్వే సంస్థల నివేదికల ప్రకారం మూడో తరగతి లెక్కలను ఎనిమిదో తరగతి విద్యార్థులు కూడా చేయలేకపోతున్నాయి. ఇలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులే అన్ని రకాలుగా నష్టపోతున్నారు. ఇంకోవైపు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పర్యవేక్షణ అధికారుల పోస్టుల్లో ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరతతో బోధనపై ప్రభావం పడుతున్నది. విద్యావాలంటీర్లను నియమించడం లేదు. ఇప్పుడు వర్షాల నేపథ్యంలో సెలవులతో ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులే మరోసారి నష్టపోవాల్సి వస్తున్నది.



ప్రయివేటులో ప్రత్యామ్నాయ బోధన

వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించినా ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ బోధనపై దృష్టి సారించాయి. ఆన్‌లైన్‌లో పాఠాలను అక్కడి టీచర్లు బోధిస్తున్నారు. ప్రీప్రైమరీ విద్యార్థులనూ వదలడం లేదు. ఇది తల్లిదండ్రులకే తర గతులు నిర్వహిస్తున్నట్టుగా ఉన్నది. చిన్నపిల్లల పక్కన కచ్చితంగా తల్లి లేదా తండ్రి ఉండాల్సి వస్తున్నది. ఇక పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కైతే కొన్ని విద్యాసంస్థలు నేరుగా తరగతులను నిర్వహిస్తున్నాయి. ఈ రకంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులు నష్టపోతుంటే ప్రయివేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులు పాఠాలు వింటున్నారు. దీంతో విద్యారంగంలో అంతరాలు పెరుగుతున్నాయి. ఇంకోవైపు ప్రయివేటులో ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తుండడంతో తల్లిదండ్రులపై భారాలు పడుతున్నాయి. ఒకవైపు ఫీజులు, యూనిఫారాలు, షూ, బ్యాగులు కొనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ తరగతుల కోసం మొబైల్ ఫోన్లులేదంటే ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు కొనాల్సి వస్తున్నది. దీంతో ఆర్థికంగా తల్లిదండ్రులపై భారాలు పడుతున్నాయి. ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న తల్లిదండ్రులు మరింత ఇబ్బంది పడాల్సి వస్తున్నది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి : చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం వరుసగా సెలవులు ప్రకటించింది. ఎక్కడ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారో ఆయా ప్రాంతాల్లో సెలవులిస్తే బాగుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నిర్ణయం తీసుకోవడం వల్ల నష్టం కలుగుతుంది. పనిదినాలు నష్టపోవాల్సి వస్తుంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎక్కువ పనిగంటలు, సెలవు దినాల్లోనూ తరగతులను నిర్వహించే అవకాశముంటుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆ రకమైన పరిస్థితి ఉండదు. సెలవులిచ్చినా ప్రయివేటుతోపాటు గురుకులాల్లోనూ బోధన సాగుతున్నది. ఆన్‌లైన్‌లో పాఠాలను బోధిస్తున్నారు. దాన్ని నియంత్రించడం లేదు. సర్కారు నిర్ణయం వల్ల మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే నష్టపోతున్నారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండవు. అది ఉన్నా చెప్పేందుకు అవకాశముండదు. ఏ కారణాలతో సెలవులిచ్చినా అది సహేతుకమైనా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని చదివే బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. జరిగిన నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

పరీక్ష తర్వాత సవరణలు : ఎంహెచ్‌ఎస్ఆర్‌బీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆగస్టు నెలలో నిర్వహించనున్న స్టాఫ్ నర్సు పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల వివరాల్లో ఏవైనా సవరణలుంటే పరీక్షల అనంతరం చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్టు రాష్ట్ర వైద్యసేవల నియామక మండలి తెలిపింది. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ, సవరణలకు అవకాశమిచ్చామని తెలిపింది. అయినా హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తర్వాత కూడా సవరణల కోసం అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తుండటంతో బోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకుందని తెలిపింది. పుట్టిన తేదీ, ఇంటిపేరు తదితర తప్పులతో పాటు సాంకేతిక లోపం కారణంగానూ తమ హాల్ టికెట్లలో తప్పులొచ్చాయని అభ్యర్థులు వాపోతున్నారు. అయితే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, పరీక్ష అనంతరం సవరించుకోవచ్చని మండలి సూచించింది.

హాల్ టికెట్ల డౌన్‌లోడ్...

హాల్ టికెట్ల డౌన్‌లోడ్, ప్రింట్ తీసుకోవడంలో ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 74169 23578 నెంబర్‌లో గానీ helpdeskstaffnurse2023@gmail.comలోగానీ సంప్రదించవచ్చు.

అన్ని రకాల సెలవులు రద్దు : వైద్యారోగ్యశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో నేపథ్యంలో వైద్యారోగ్యశాఖలో ఉద్యోగులు, సిబ్బందికి అన్ని రకాల సెలవులను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు జిల్లా వైద్యారోగ్య అధికారులను ఆదేశించారు. ఉద్యోగులందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదేశాలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీచ రాజకీయాలు మానుకోవాలి

- రెడ్కో చైర్మెన్ వై.సతీష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నీచ రాజకీయాలు చేయటం మానుకోవాలని తెలంగాణ రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. ప్రజలు కష్టాల్లో ఉంటే.. జీహెచ్ఎంసీ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వటమేంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తీరు శవాల మీద పేలాలు ఏరుకున్నట్టుగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిస్తే.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాత్రం ఆందోళనలకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. దీన్ని బట్టే ఎవరు ప్రజల పక్షాన పనిచేస్తున్నారనేది అర్థమవుతున్నదని తెలిపారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పుత్రశోకం

- ఎమ్మెల్యే పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి
- నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ

నవ తెలంగాణ - పటాన్ చెరు



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పుత్రశోకంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి(35) గురువారం ఉదయం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. కుమారుడి మరణంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు కుటుంబీకుల రోదనలు అందరినీ తీవ్రంగా కలిచి వేశాయి. నిన్నమొన్నటి వరకు అందరితో కలిసి మెలిసి ఉంటూ ఆప్యాయంగా పలకరించిన విష్ణువర్దన్ రెడ్డి మరణ వార్తతో.. సన్నిహితులు, స్నేహితులు, బంధుమిత్రులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మృతునికి భార్య కిరణ్మయితో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రి నుంచి ఎమ్మెల్యే నివాసానికి విష్ణు భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే సొంత స్థలం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ పక్కన విష్ణువర్దన్ రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రాష్ట్ర మంత్రులు మహమ్మద్ అలీ, తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మెన్ సునీతా లక్ష్మారెడ్డి, రాష్ట్ర అటవీ అభివద్ధి సంస్థ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, మదన్ రెడ్డి, మాణిక్ రావు, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కుర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అసమర్థత వల్లే...

- కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదు
- కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అసమర్థ వల్లే నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గతేడాది కూడా గేట్ల సమస్యతోనే ఇబ్బంది ఏర్పడి సాగు భూములన్నీ కోతకు గురయ్యాయని ఒక ప్రకటనలో గుర్తు చేశారు. గేట్ల పని తీరును పర్యవేక్షించి సరి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భేషరతుగా తమ తప్పును ఒప్పుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.

నేడు జీహెచ్ఎంసీ ముట్టడి
టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

వరదలు, భారీ వర్షాలతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడించాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నగర జీవనం అతలాకుతలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

మణిపూర్ తరహాలో తెలంగాణలో బీజేపీ కుట్ర
మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఆరోపించారు. మణిపూర్‌లాగే తెలంగాణను కూడా రావణకాష్టం చేసేందుకు ఆ పార్టీ ఎంపీ సోయంబాపురావు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెండు తెగల మధ్య చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు చేసిన సోయం బాబురావు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గంగాడి సుధీర్ మరిన్ని మంచి రచనలు చేయాలి

- 'కవనం' కవితా సంపుటి ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రముఖ కవి, రచయిత రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన గంగాడి సుధీర్ మరిన్ని రచనలు చేయాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. ఆయన రచించిన 'కవనం' కవితా సంపుటిని కేటీఆర్ ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని టీ సాట్ ప్రాంగణంలో ఓయూ వీసీ రవిందర్ యాదవ్, అంబేద్కర్ యూనివర్శిటీ వీసీ సీతారామారావ్, టీ సాట్ సీఈవో శైలేష్ రెడ్డి, ఇతర విద్యావేత్తల సమక్షంలో మంత్రి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన మొదటి పుస్తకం 'ఇగురం' కథా సంపుటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారంటూ గంగాడి సుధీర్ ఈసందర్భంగా గుర్తు చేశారు.

డిగ్రీలో చేరే గడువు 31 వరకు పొడిగింపు

- వర్షాల నేపథ్యంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల 28 నుంచి 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల నేపథ్యంలో బుధ నుంచి శుక్రవారం వరకు మూడురోజులపాటు అన్ని విద్యాసంస్థలకూ ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని తెలిపారు. అందుకే మొదటి, రెండు, మూడో విడతలో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన వారు కాలేజీల్లో రిపోర్టు చేసే గడువు కూడా ఈనెల 31 వరకు పొడిగించామని పేర్కొన్నారు. అదేరోజు నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

నిమ్స్‌లో కొత్త పరిశోధనలకు శ్రీకారం

- రాయల్ కాలేజ్ గ్లాస్గో భాగస్వామ్యంతో సేవల్లో మెరుగుదల
- నిమ్స్‌ను సందర్శించిన రాయల్ కాలేజ్ అధ్యక్షులు డాక్టర్ మైక్ మెకెర్డీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలో సేవల్ని మరింత మెరుగుపరిచేందుకు కొంత పరిశోధనలకు శ్రీకారం చుట్టేందుకు రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో, నిమ్స్ పరస్పర సహకారం అందించుకోనున్నట్టు ఆ కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ మైక్ మెకెర్డీ తెలిపారు. ఇంగ్లాండ్, స్కాట్లాండ్ దేశాల్లో నాణ్యమైన వైద్యాన్ని, పరిశోధనల్ని అందిస్తున్న ఈ సంస్థ అధ్యక్షులు హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిని గురువారం సందర్శించారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప నేతృత్వంలో వివిధ విభాగాల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ మైక్ మాట్లాడారు. ఆస్పత్రిలో పేదలకు అందుతున్న నాణ్యమైన వైద్యసేవలను కొనియాడారు. యాంటీ బయోటిక్స్, ఇతర మందుల వినియోగం, వివిధ రకాల పరిశోధనల గురించి నిమ్స్ వైద్యులతో చర్చించారు. రెండు సంస్థల మధ్య పరస్పర ఒప్పందం ద్వారా పరిశోధనలు మరింత వేగవంతం చేయొచ్చని అన్నారు. నిమ్స్ ఎండీ, పీజీ, ఎంసీఎచ్ విద్యార్థులు ఇంగ్లాండ్ వెళ్లి వైద్య సేవలు, పరిశోధనలపై తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని, అలాగే అక్కడి వైద్య విద్యార్థులు నిమ్స్‌కొచ్చి తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్య వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అవగాహన చిత్రాలను నిమ్స్ డైరెక్టర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో ఓయస్‌డి డాక్టర్ గంగాధర్, డాక్టర్ పరంజ్యోతి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ తిర్మల్, డాక్టర్ శాంతి వీర్, డాక్టర్ కృష్ణ రెడ్డి, పలు విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఏ (ఫిమేల్) నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- ఖాళీ పోస్టుల్లో కాంట్రాక్టు ఎంపీహెచ్ఏలను రెగ్యులర్ చేయాలి : టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,520 ఎంపీహెచ్ఏ (ఫిమేల్) పోస్టుల భర్తీకి వైద్యారోగ్య సేవల నియామక మండలి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ-సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఫసియుద్దీన్, కె.యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీ పోస్టుల్లో ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (ఫిమేల్) అభ్యర్థులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌లో కాంట్రాక్టు సర్వీస్‌కు 20 మార్కుల వెయిటేజీ ఇచ్చి, 80 మార్కులకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో కాంట్రాక్టు ఏఎన్ఎంలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 20 ఏండ్లుగా సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయకుండా నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదని సూచించారు. విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ గతంలో నోటిఫికేషన్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్, రోస్టర్ ప్రకారంగా డిస్టిక్ సెలక్షన్ కమిటీ (జిల్లా ఎంపిక కమిటీ) ఆధ్వర్యంలో నియమితులయ్యారని గుర్తుచేశారు. అనేక ఏండ్లుగా సేవలందించిన అనుభవం వారికుందని తెలిపారు. అలాంటి వారిని కాదని కొత్త వారికి అవకాశమిస్తే పాత వారికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అతి తక్కువ వేతనంతో ఏండ్ల తరబడి సేవలందించిన వారి సేవలను క్రమబద్ధీకరించకుండా, రాతపరీక్షలో ఉత్తీర్ణులై ఉద్యోగాల్లో చేరాలని చెప్పడం అన్యాయమంటూ వ్యతిరేకించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (ఫిమేల్)లు అందరూ రెగ్యులర్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సెకెండ్ ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు, అర్బన్ సెంటర్ ఏఎన్ఎంలు ఇలా రకరకాల పేర్లతో సేవలందించారని తెలిపారు.

విద్యార్థుల ఆసక్తిని బట్టి వినోదభరిత విద్యా బోధన

- వినూత్న విధానాన్ని ఎంచుకోవాలి
- విద్యాబోధన మార్చేందుకు సంబంధిత శాఖలు సమాయాత్తం కావాలి
- ప్రపంచమంతా టీ-సాట్‌నే ఆదరించాలి
- ఆరో వార్షికోత్సవ సభలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రపంచంలోని తెలుగు విద్యార్థులంతా టీ-సాట్ ప్రసారాలు చూడగలిగే స్థాయికి దాన్ని తీర్చిదిద్దాలి. ఇన్నోవేటివ్, ఇన్ఫర్మేటివ్, ఎంటర్‌టైనింగ్‌తో కూడిన విద్యను అందించగలిగితే మంచి ఫలితాలు వస్తాయి' అని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని టీ-సాట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆ సంస్థ ఆరో వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఆరేండ్ల కాలంలో 40 లక్షల యూజర్లతో టీ-సాట్ ఆశించిన మేర ఫలితాలు సాధించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్ తరాలకు అవసరమైన విద్యను అందించేందుకు గతానికి భిన్నంగా వినూత్న ఆలోచనలు, సమాచారంతో కూడిన వినోదభరితమైన విద్యనందించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తద్వారా ప్రపంచం నలుమూలల్లో ఉండే తెలుగు విద్యార్థుల్లో టీ-సాట్ ప్రసారాలు చూడాలన్న ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. 50 వేల ప్రశ్నలు మాక్ టెస్ట్ ద్వారా అందుబాటులో ఉంటే కొత్త రకమైన విద్యను అందుబాటులోకి తెచ్చిన వారమవుతాయని మంత్రి గుర్తు చేశారు. ఒకటి, రెండు తరాలు ఆ విధంగా ప్రయత్నిస్తే విద్యార్థుల భవిష్యత్ మారిపోతుందన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుకునేందుకు విద్యా ఐటి కమ్యూనికేషన్ల శాఖలతో పాటు అవసరమైన శాఖల అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బోధనా విధానం ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ఎలాంటి విద్యను కోరుకుంటారనే విషయంపై మంత్రి తన స్వీయ అనుభవాలను పంచుకున్నారు. టీ-సాట్ సీఈవో రాంపురం శైలేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంతో పాటు పోటీ పరీక్షలకు, వత్తి నైపుణ్య అంశాలపై పాఠ్యాంశాలను అందించడం ద్వారా దేశంలోనే అగ్రగామి నెట్‌వర్క్‌గా టీ-సాట్ అవతరించిందన్నారు. ఈ సందర్భంగా శైలేష్‌రెడ్డిని మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఓయూ వీసీ డి.రవీందర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాం చిత్ర పటం ఆవిష్కరణ

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని టీ-సాట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కలాం చిత్రపటాన్ని సభా కార్యక్రమానికి ముందు కేటీఆర్ ఆవిష్కరించి, నివాళులర్పించారు. శాటిలైట్ రంగంలో కలాం సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. టెలిజన్ రంగం మరింతగా అభివద్ధి చెందడానికి ఆయన పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడ్డాయని కొనియాడారు.

టీ-సాట్‌తో ఓయూ ఎంఓయూ

ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ పాఠ్యాంశాలు టీ-సాట్ వేదిక ద్వారా ప్రసారం చేసేందుకువీలుగా రెండు సంస్థలు గురువారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయి, సాంకేతిక, దూర విద్యలో పాఠ్యాంశాలు అందిస్తున్న టీ-సాట్ యూనివర్సిటీ స్థాయి విద్యార్థులకూ ఈ ఒప్పందం ద్వారా పాఠ్యాంశాలు అందించనుంది. ఇప్పటికే కాకతీయ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్న టీ-సాట్ తాజాగా మంత్రి కేటీఆర్ సమక్షంలో ఉస్మానియా యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఫలితంగా యూనిర్సిటీ పరిధిలోని 720 అనుబంధ కళాశాలలకు చెందిన సుమారు మూడు లక్షల మంది విద్యార్థులకు 56 కోర్సుల్లో టీ-సాట్ తన నెట్‌వర్క్ ద్వారా పాఠ్యాంశాలు అందించనుంది. ఈ సందర్భంగా ఓయూ రిజిస్ట్రారు లక్ష్మినారాయణ, టీ-సాట్ సీఈవో ఆర్.శైలేష్‌రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఇదే సమయంలో సందర్భంగా టీ-సాట్ మరో కీలక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ఓటీటీ రంగం ప్రారంభమైన అనతి కాలంలోనే ప్రపంచ వీక్షకులను ఆకట్టుకున్న ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ ద్వారా టీ-సాట్ నెట్‌వర్క్ ఛానళ్లను ప్రసారం చేసేందుకు రెండు సంస్థలు అంగీకరించాయి. కార్యక్రమానికి హాజరైన ఆహా టీవీ సీఈవో రవికాంత్ షబ్నవిస్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా టీ-సాట్ ప్రసారాలు వీక్షకులకు అందించేందుకు ఆహాటీవీ మరో వేదికైంది.

మణిపూర్ తరహా కుట్రలకు తెరలేపిన బీజేపీ

- తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని చూడడం ద్వారా మణిపూర్ తరహాలో బీజేపీ కుట్ర చేస్తున్నదని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలనీ, లేదంటే పోరాటం చేస్తామంటూ బీజేపీకి చెందిన ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావు ప్రకటించటాన్ని చూస్తే..గిరిజనుల మధ్య చిచ్చురేపే కుట్రకు పాల్పడుతున్నారని అర్థమవుతున్నదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గిరిజనుల మధ్య మణిపూర్‌లో ఘర్షణలు రగిలించి, మారణహోమం సృష్టించారని తెలిపారు. దేశమంతా బీజేపీ పాలిత మణిపూర్ మారణ హోమంపై స్పందిస్తుంటే.. సోయం బాబురావు అక్కడి తరహా కుట్రలకు తెరలేపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మణిపూర్‌లో గిరిజన తెగలపై దాడులు, హత్యలు, చేసి మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడులకు పాల్పడుతుంటే బాధ్యతగల ఆ ఎంపీ కనీసం స్పందించలేదని గుర్తుచేశారు. మతోన్మాదుల చేతిలో ఆయన కీలుబొమ్మగా సోయం బాబురావు మారాడని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గిరిజన హక్కులకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బుధవారం పార్లంట్‌లో చట్టం చేస్తుంటే ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. కేంద్రం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడకుండా ఆ సమస్యను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని గతంలో ప్రధాని మోడీకి 45 మంది బీజేపీ పార్లమెంట్ సభ్యుల సంతకాలతో వినతి పత్రం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు గిరిజన వ్యవారాల శాఖ మంత్రికి వినతి పత్రం ఇచ్చారని పేర్కొన్నారు. 1976లోనే రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో లంబాడీ గిరిజనులను కలిపారనీ, వారిని ఆ జాబితా నుంచి తొలగించడం సాధ్యం కాదని సోయం బాబు రావు కు తెలిసినా ఆదివాసి గిరిజనులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకే బీజేపీ నాటకం ఆడుతోందని తెలిపారు. బాబురావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో గిరిజనుల మధ్య ఎలాంటి ఘర్షణలు జరిగినా..అందుకు బీజేపీనే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

దేశానికి ఆదర్శంగా కేసీఆర్ పాలన

- సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టటం సంతోషం : భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్
- ఎమ్మెల్సీ కవితతో కలిసి అంబేద్కర్ విగ్రహం సందర్శన
- పార్లమెంటు భవనానికీ అంబేద్కర్‌పేరు పెట్టాలన్న డిమాండ్‌కు తెలంగాణ మద్దతు: కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



హైదరాబాద్ : నూతన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ భవనంగా నామకరణం చేయాలనీ, ఆ భవనంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని భీమ్ ఆర్మీ చంద్రశేఖర్ ఆజాద్ చేస్తున్న డిమాండ్‌కు తెలంగాణ ప్రజల మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ విచ్చేసిన భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్.. కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దాదాపు గంటపాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ తమ రాజకీయ విధానాలు, తెలంగాణలో బహుజనులకు దళితులకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి చర్చించారు. దళిత బంధు పథకాన్ని ఆజాద్ ప్రశంసించారు. అనంతరం వారిద్దరూ కలిసి సచివాలయం వద్ద ఉన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని దర్శించారు. అంబేద్కర్‌కు పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత అమర జ్యోతి వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..... తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని దర్శించడంతో పాటు సీఎం కేసీఆర్ ను కలుసుకోవడానికి ఆహ్వానించామని, ఆహ్వానాన్ని మన్నించి రెండు రోజుల పర్యటనకు వచ్చిన చంద్రశేఖర్ ఆజాద్‌కు కవిత కృతజ్ఞతలు తెలిపారు.

సంపాదకీయం

స్పెయిన్ ఎన్నికల్లో మితవాదులకు అడ్డుకట్ట!

ఐదు కోట్ల జనాభా ఉన్న స్పెయిన్లో గత ఆదివారం నాడు జరిగిన సాధారణ ఎన్నికల్లో మితవాద శక్తులను అడ్డుకోగలిగినప్పటికీ రాజకీయ ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రాంతీయ పార్టీలతో బేరసారాలకు తెరలేచే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న వామపక్ష కూటమి పార్టీలు సంపూర్ణ మెజారిటీ తెచ్చుకోవటంలో విఫలమై స్వల్ప తేడాతో పెద్ద కూటమిగా నిలిచాయి. పార్లమెంటు దిగువ సభలో 350 డిప్యూటీలకు గాను వామపక్షాలకు 172, మితవాద పార్టీలకు 170 వచ్చాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 176 స్థానాలు అవసరం. కాటలాన్ ప్రాంతానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని కోరుతున్న జుంట్స్ పార్టీ ఏడు స్థానాలు తెచ్చుకుంది. దాని షరతులకు అంగీకరించిన కూటమి ఇప్పుడు అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. అధికార కూటమిలోని సోషలిస్టు పార్టీ గతం కంటే రెండు సీట్లు అదనంగా తెచ్చుకొని 122 స్థానాలతో రెండవ పార్టీగా అవతరించింది. అంతకు ముందు 89 స్థానాలతో రెండవ పక్షంగా ఉన్న పాపులర్ పార్టీ 136 స్థానాలతో అతి పెద్ద పక్షంగా ఉంది. అధికార కూటమిలోని కమ్యూనిస్టు, పోడెమాస్ తదితరులతో కూడిన వామపక్ష సంఘటన గతంలో ఉన్న 38లో ఏడు కోల్పోయి 31తెచ్చుకుంది. ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ లేనందున పెద్ద పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అది సభలో మెజారిటీ నిరూపించు కుంటుందా చేతులెత్తేస్తుందా, వచ్చే రోజుల్లో ఏం జరగనుంది అనేదాని కంటే మితవాద భూతాన్ని అధికారంలోకి రాకుండా చేశారనే సంతృప్తి, అభినందనలు అధికార కూటమి పొందింది. అనేక మంది ఈ పరిణామాన్ని స్వాగతించారు. ఐరోపాలో మరో దేశాన్ని మితవాద శక్తుల కౌగిలిలోకి పోకుండా చేశారని పరిశీలకులు భావిస్తున్నారు. మే నెలలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార కూటమిలోని ప్రధాన సోషలిస్టు వర్కర్స్ పార్టీ తన పట్టును కోల్పోయింది. దాంతో సాధారణ ఎన్నికల్లో మితవాద పాపులర్ పార్టీ 150 నుంచి 160 స్థానాల వరకు తెచ్చుకుంటుందని, మరో మితవాద ఓక్స్ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని వివిధ సర్వేలు, విశ్లేషణలు ఎన్నికలకు ముందు వెలువడ్డాయి.నియంత జనరల్ ఫ్రాంకో తరువాత తొలిసారిగా స్పెయిన్లో పచ్చిమితవాద ఓక్స్ పార్టీ చక్రం తిప్పుతుందని భావించారు. పాపులర్ పార్టీ నుంచి విడిపోయిన శక్తులు 2014లో ఓక్స్ పార్టీగా రంగంలోకి వచ్చాయి. గత ఎన్నికల్లో 52 స్థానాలు తెచ్చుకొని ఈ సారి 33కు పరిమితమైంది.

> ప్రస్తుతం ఐరోపా, అనేక దేశాల్లో పచ్చి మితవాద శక్తులు పెరుగుతున్న పూర్వరంగంలో వాటిని అడ్డుకోవటం చిన్నదేమీ కాదు. స్పెయిన్‌లో అడ్డుకున్నప్పటికీ అవి అధికారానికి దగ్గరగా వచ్చినందున వాటి ముప్పును తక్కువగా చూడకూడదు. మితవాదులను అడ్డుకోగలమనే సందేశాన్ని ఇచ్చిన స్పెయిన్ సోషలిస్టు, వామపక్ష శక్తుల తీరు ఒక్క ఐరోపాకే కాదు, ప్రపంచమంతటికీ ఉత్తేజం కలిగించేదిగా ఉంటుంది.



మితవాద శక్తులను అడ్డుకోవటం వామపక్షాలకు ఒక పెద్ద విజయంగా కొందరు వర్ణించారు. సోషలిస్టు పార్టీ నేత పెడ్రో సాంఛెజ్ తొలిసారి 2018 ప్రధాని కాగా రెండవసారి 2019 ఎన్నికల్లో గెలిచి 2020లో తొలిసారిగా స్పెయిన్‌లో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. దీనిలో కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు ఎలోండా డియాజ్ అధినేతగా సుమర్ పేరుతో 15 పార్టీలు, శక్తులతో కూడిన వామపక్ష కూటమి ఉంది. ఆమె కార్మికశాఖ మంత్రిగా కూడా ఉన్నారు. పోడెమాస్ నేత పాబ్లో గ్లెసియాస్ రాజకీయాల నుంచి తప్పుకోవటంతో ఈ కూటమి నేతగా ఎలోండాను ఎన్నుకున్నారు. పాపులర్ పార్టీ, ఓక్స్ కూటమి అధికారంలోకి వస్తే దేశానికి ముప్పని సోషలిస్టు, వామపక్ష కూటమి ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చిన అంశాలు ఫలితాలను ఇచ్చాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్వీడన్, ఫిన్లండ్, ఇటలీ ఎన్నికల్లో పచ్చి మితవాద శక్తులు అధికారానికి వచ్చాయి. ఇక్కడ కూడా మితవాద కూటమి వస్తే ఐరోపా సమాఖ్యలో అనేక అంశాల మీద మితవాద శక్తుల పట్టు బిగిసే అవకాశం ఉందని జర్మనీ, ఫ్రాన్స్ ఆందోళన చెందాయి. ఓక్స్ పార్టీతో తమకెలాంటి సంబంధం లేదని పాపులర్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చెప్పుకోవాల్సి వచ్చింది. కానీ మే నెలలో జరిగిన ప్రాంతీయ, స్థానిక సంస్థల ఎన్నికలలో ఆ రెండు పార్టీలు కలసి అనేక చోట్ల అధికారాన్ని పంచుకోవటాన్ని, తిరోగామి అంశాలపై ఏకాభిప్రాయం వెల్లడించటాన్ని వామపక్షాలు ఎత్తి చూపాయి. అక్కడి రాజ్యాంగం ప్రకారం ఫలితాలు వెలువడిన నెలరోజుల్లో పార్లమెంటు సమావేశం జరుగుతుంది. పెద్ద పార్టీ నేతను రాజు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తాడు. మూడు నెలల్లో మెజారిటీ నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ విఫలమైతే రెండవ పార్టీకి అవకాశం అది కూడా కుదరకపోతే మరోసారి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఐరోపా, అనేక దేశాల్లో పచ్చి మితవాద శక్తులు పెరుగుతున్న పూర్వరంగంలో వాటిని అడ్డుకోవటం చిన్నదేమీ కాదు. స్పెయిన్‌లో అడ్డుకున్నప్పటికీ అవి అధికారానికి దగ్గరగా వచ్చినందున వాటి ముప్పును తక్కువగా చూడకూడదు. మితవాదులను అడ్డుకోగలమనే సందేశాన్ని ఇచ్చిన స్పెయిన్ సోషలిస్టు, వామపక్ష శక్తుల తీరు ఒక్క ఐరోపాకే కాదు, ప్రపంచమంతటికీ ఉత్తేజం కలిగించేదిగా ఉంటుంది.

దేశాన్ని నగ్నంగా నడిపించిన వారు మన పాలకులా?


డాక్టర్ దేవరాజు మహారాజు

గతంలో లాగ మతం వేరు దేశభక్తి వేరు కాదు. ప్రస్తుతం మనదేశంలో ఆరెండూ కలిసిపోయి ప్రజల భావోద్రేకాలతో ఆడుకుంటున్నాయి. ప్రపంచంలో భారతదేశానికి అతిపెద్ద ప్రజాస్వామిక దేశం - అనే గుర్తింపు ఉంది. ప్రపంచంలోని ఓటర్లలో నాలుగోవంతు ఈ దేశంలోనే ఉన్నారు. ప్రపంచ జనాభాలో ఆరోవంతు ఈ దేశంలోనే ఉన్నారు. అందువల్ల ఈ దేశంలో జరుగుతున్న రాజకీయ మార్పుల ప్రభావం దక్షిణ ఆసియాలోనూ, ఇతర ప్రజాస్వామిక ప్రపంచ దేశాల మీదా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 'దేశభక్తి'కి సంబంధించిన సమస్యలు ప్రపంచంలో ఒక్క భారతదేశమే ఎదుర్కోవడం లేదు. ఇతర దేశాల్లో కూడా మతపరమైన దేశభక్తి కొంత బలపడుతూ ఉంది. ఉదాహరణకు టర్కీ, లాటిన్ అమెరికా, పశ్చిమ ఐరోపా, సోవియట్ లోని కొన్ని భాగాలు చెప్పుకోవచ్చు.


2018 నాటి కోస్టారికాన్ అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఒక నినాదం బలంగా వినపడింది. "మనల్ని దైవం పంపించిన ఒక మనిషి (MAN OF GOD) పరిపాలించకపోతే ఇక వేరెవరూ పాలించలేరు" అనేది ఒక మంత్రంగా పనిచేసింది. ఆ మధ్య విజయవంతంగా గెలిచిన రైట్ వింగ్ బ్రెజిల్ అధ్యక్ష అభ్యర్థి జైర్ బొల్సనారో ప్రజల్లోకి ఒక సందేశాన్ని పంపించగలిగాడు. "పైన దేవుడున్నాడు గనకనే బ్రెజిల్ ముంగిట అన్నీ సమకూరాయి." ఇలా క్రిస్టియన్ మతతత్త్వ దేశభక్తులు, ఇస్లాం మతతత్త్వ దేశభక్తులు ఎక్కువైపోతున్నారు. ఈ దైవభక్త దేశభక్తులు ఎక్కడైనా చేసేది ఒక్కటే... ముందు లేని దేవుణ్ణి చూపిస్తారు. తర్వాత సంస్కృతీ సంప్రదాయాలంటారు. గతమెంతో ఘనకీర్తి - గల వాళ్ళమన్నది గుర్తు చేస్తుంటారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి, మనుషుల్ని భావదాస్యంలోకి లాగేస్తారు. ఆ తర్వాత వారి పబ్బం వారు గడుపుకుంటారు. లాభమంతా అధికారం చేజిక్కించుకున్న వాడికే తప్ప, అధికారం అందించే వాడికి ఆకలి, దారిద్ర్యం మినహా మిగిలేది ఏమీ ఉండదు.

భారతదేశంలోనూ జరుగుతున్నది ఇదే. గతంలో జరుగుతూ వచ్చింది కూడా ఇదే. బలవంతులు రాజులైతే వారికి సలహాదారుల స్థానంలో బ్రాహ్మణులుండేవారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత, రాజ్యాంగం రాసుకున్న తరువాత, మెరుగైన సమాజానికి రూపకల్పన జరిగింది. సమాజంలోని మనుషులందరికీ సమానమైన హక్కులు - బాధ్యతలూ వచ్చాయి. స్త్రీ-పురుషులకు సమాన స్థాయి లభించింది. మత ప్రసక్తిలేని విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. 'ప్రజాస్వామ్య పరిరక్షణే మా ధ్యేయం' అని చెప్పుకున్న కాంగ్రెస్, స్వాతంత్ర్యానంతరం చాలాకాలం దేశాన్ని పాలించింది. అయితే అప్పుడప్పుడు కొన్ని తప్పిదాలు కూడా చేసింది. ముఖ్యంగా ఇందిరాగాంధీ సమయంలో సిక్కుల ఊచకోత, గోల్డెన్ టెంపుల్ ఆపరేషన్‌లు జరిగాయి. ప్రతిఫలంగా ఆమె తన ప్రాణాలే కోల్పోవాల్సి వచ్చింది. రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటూ వస్తే, దేశంలో ఎన్నో దుర్ఘటనలు జరగకుండా ఉండేవి. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ రావాలేగాని, తప్పుల మీద తప్పులు, ఇంకా పెద్ద తప్పులు చేసుకుంటూ పోతే, దేశంలో ప్రజాస్వామ్యానికి కాలం చెల్లిపోతుంది.

బీజేపీ పూర్తి మెజార్టీతో అధికారం చేపట్టినప్పటి నుండి దేశంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజాస్వామ్య సంస్కృతిని ధ్వంసం చేస్తూ, హిందుత్వ సంస్కృతిని ప్రాచుర్యంలోకి తేవడంతో - దేశంలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయింది. అంతే కాదు, అధికారంలో ఉన్నవారే అల్లర్లకు ఆజ్యం పోస్తున్నప్పుడు, మెజార్టీగా ఉన్న హిందువులకు కూడా రక్షణ లేకుండా పోయింది. అల్లర్లు మొదలయ్యాయంటే, అవి ఎటునుండి ఏ మలుపు తీసుకుంటాయో తెలియదు. అల్లర్లలో చిక్కుకున్న వారు ఏ మతస్థులైనా కావొచ్చు కదా? కొన్ని నెలలుగా మణిపూర్ మండిపోతుంటే ఈ దేశ ప్రధాని ఒక చిన్న మాట మాట్లాడలేదు. ఈ విషయంపై ప్రముఖ జర్నలిస్ట్ కరన్ థాపర్ ఏమన్నారో చూడండి... "టర్కీ భూకంపానికి మన ప్రధాని స్పందించి ట్వీట్ చేస్తారు. గుజరాత్ తుపాన్ గురించి 'మన్‌కి బాత్'లో ప్రస్తావిస్తారు. కాని, మణిపూర్‌లో కొన్ని నెలలుగా జరుగుతున్న మారణకాండ గురించి ఎక్కడా ఏమీ స్పందించరు. అంటే ఈ దేశం ఏమి అర్థం చేసుకోవాలి? 1. ఆయనకు ఈ విషయం తెలియకపోవచ్చు. 2. విషయమంతా తెలిసినా, దాన్ని గుర్తించడానికి, వాటిపై స్పందించడానికి బాహుశా ఆయనకు ఆసక్తి లేకపోవచ్చు" అని! మణిపూర్‌లో జరుగుతున్న క్రైస్తవ వ్యతిరేక హింసకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మద్దతు ఇస్తున్నాయని ఆరోపిస్తూ మిజోరామ్ బీజేపీ ఉపాధ్యక్షుడు ఆర్. వన్‌రామ్ ఛుఅంగా తన పదవితో పాటు బీజేపీ పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇంపాల్‌ను సందర్శించారు కానీ, రాష్ట్రంలో చర్చ్ భవనాలను తగులబెట్టడాన్ని ఆయన తప్పుపట్టలేదు. చర్చ్‌లను తగలబెడుతూ ఉంటే కేంద్ర ప్రభుత్వం ఖండించకపోవడం - భరించలేని బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడు రాజీనామా చేసి బయటికి వెళ్ళిపోయాడు. పార్టీ ముఖ్యం కాదు, మానవత్వానికి ప్రాధాన్యమివ్వడం ముఖ్యం! అని అనుకుని ఉంటారు, వన్‌రామ్ ఛూఅంగా.

ఉత్తర భారతదేశం వరదల్లో కొట్టుకుపోతూ ఉంటే, ఢిల్లీ ఎర్రకోట చుట్టూ నీళ్ళు నిలిస్తే, గాంధీ సమాధి సైతం నీట మునిగితే - దగ్గరుండి కాపలాదారు చూస్కోవాలి కదా? దేనికి ముందు ప్రాధాన్యత ఇవ్వాలి? దేనికి తరువాత ఇవ్వొచ్చు అనేది చూస్కోవాలి కదా? ఏదో అర్జంటు పని ఉన్నట్టు భారత ప్రధాని ఫ్రాన్స్‌కు వెళ్ళిపోతాడా? ఎక్కడికి వెళ్ళినా కొనుగోళ్ళకే కదా? అవి తరువాతైనా చేసుకోవచ్చు కదా? సరే ఇది అలా ఉండనిద్దాం! ఈ హిందుత్వ వాదులు ఏం కోరుకుంటున్నారూ? అంటే... భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలవారు సమానమే కానీ, అధిక సంఖ్యాకులుగా ఉన్న హిందువులకు సమాజంలో అగ్రస్థానం దక్కాలి. వారే మొదటిస్థాయి పౌరులు. ఇక మిగతావారంతా నోరెత్తకుండా రెండోస్థాయి పౌరులుగా పడి ఉండాలి. అంతే! ఆ కుట్రలో భాగంగానే, మిగతావారిని హిందువుల నుండి విడగొట్టి - చూపడానికే వారసత్వ చట్టాలు తెచ్చారు. దేశవ్యాప్తంగా వందల షహీన్‌బాగ్‌లు వెలిసి కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిరసించాయి. రైతు వ్యతిరేక చట్టాల్ని రైతులు తిప్పికొట్టిన విషయం కూడా మనం మరవకూడదు. ఎన్ని పరాభవాలు, పరాజయాలు ఎదురైనా మూర్ఖులు తమ పట్టుదలను వదలరు. అందుకు తాజా ఉదాహరణ యూనిఫాం సివిల్‌కోడ్. మతము - సంస్కృతి- దేశభక్తి అన్నింటినీ కలిపి దేశాన్ని 'హిందూ రాష్ట్ర'గా మార్చేయాలని ప్రభుత్వానికి వెనక ఉన్న ఆర్ఎస్ఎస్ పథకాలు రచిస్తోంది.

అరవై ఏళ్ళుగా గత ప్రభుత్వం చేసిందీ? అని మోడీ తరచూ తన ప్రసంగాల్లో ప్రశ్నిస్తుంటారు. గత ప్రభుత్వాలు అరవైయేండ్లుగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ వస్తున్నాయని చెప్పడానికి మోడీజీయే ఒక పెద్ద ఉదాహరణ! ఒక రుజువు!! చదువుకోకపోయినా, రైల్వేస్టేషన్‌లో చాయ్ అమ్ముకుని బతికినా, భిన్నమైన ఆలోచనా ధోరణి గలవాడైనా... ఈ దేశ ప్రజలు అతన్ని ప్రధానిని చేశారు కదా? ప్రజాస్వామ్యంటే అదే... గత పాలకులు నిరంకుశులైతే మోడీ ప్రధాని అయ్యేవాడే కాదు. ముందు ఆ విషయం గ్రహించుకుంటే బావుండేది. అయినా ఆ స్థానానికి ఉన్న విలువను కాపాడలేక, ప్రపంచ దేశాల ముందు నవ్వులపాలు కావడం ఆయన తప్పిదం!! అధికారంలో ఉన్నవారు ఎప్పుడైనా తామేం చేస్తున్నామని ఆత్మావలోకనం చేసుకోవడం మంచిది. ఏ ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేయలేదూ? అన్నది ప్రజలు బేరీజు వేసుకుంటారు. అది వారి పని - నాయకులు వారి బాధ్యతల్ని వారు నిర్వహించుకుంటూ ఉంటే, ఇతరులను ప్రశ్నించొచ్చు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలు (జులై 2023) ఎగ్గొట్టి కేంద్ర సహాయమంత్రి వచ్చి హైదరాబాదులో రోడ్డుమీద భైఠాయిస్తాడు. తను వెంటనే బాటసింగారం డబుల్ బెడ్‌రూంలు చూడాలంటాడు. పార్లమెంట్ సమావేశాలు ఎగ్గొట్టి రావడం గొప్ప బాధ్యతగల పనా? ఎప్పుడు ఎక్కడ ఏ పని చేయాలో కనీస పరిజ్ఞానం కేంద్ర మంత్రులకే లేకపోతే ఎలా?



> కొన్ని నెలలుగా మణిపూర్ మండిపోతుంటే ఈ దేశ ప్రధాని ఒక చిన్న మాట మాట్లాడలేదు. ఈ విషయంపై ప్రముఖ జర్నలిస్ట్ కరన్ థాపర్ ఏమన్నారో చూడండి... "టర్కీ భూకంపానికి మన ప్రధాని స్పందించి ట్వీట్ చేస్తారు. గుజరాత్ తుపాన్ గురించి 'మన్‌కి బాత్'లో ప్రస్తావిస్తారు. కాని, మణిపూర్‌లో కొన్ని నెలలుగా జరుగుతున్న మారణకాండ గురించి ఎక్కడా ఏమీ స్పందించరు. అంటే ఈ దేశం ఏమి అర్థం చేసుకోవాలి? 1. ఆయనకు ఈ విషయం తెలియకపోవచ్చు. 2. విషయమంతా తెలిసినా, దాన్ని గుర్తించడానికి, వాటిపై స్పందించడానికి బాహుశా ఆయనకు ఆసక్తి లేకపోవచ్చు" అని!

ఇది రాస్తున్న సమయానికి 2023 జులై 20న అన్ని టెలివిజన్ చానళ్ళలో ముగ్గురు మణిపూర్ కుక్కీ జాతి స్త్రీలను నగ్నంగా వీధుల్లో నడిపించిన వీడియో కనిపించింది. కలవరపడ్డ దేశ ప్రజలు తలదించుకున్నారు. మతోన్మాదం నీడన జరిగిన రాజకీయాన్ని ఈసడించుకున్నారు. జాతీయపతాకం అవనతమైనట్లయ్యింది. దేశం ప్రాభవం కోల్పోయింది. అంతకు ముందు రెండున్నర నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండకు ఈ పరేడ్ ఒక కొనసాగింపు. నగ్నంగా నడిపించిన ఆ ముగ్గురు స్త్రీలలో ఒక స్త్రీ భర్త సైనికుడు. దేశాన్ని రక్షించిన తను, తన భార్యను, తన గ్రామస్తుల్ని రక్షించుకోలేక పోయానని వాపోయాడు. భోరున విలపించాడు. ఆ ఏడుపు అతనొక్కడిదే కాదు, ఈ దేశంలో మనసున్న మనుషులందరిదీ... ఆ విషయాన్ని సుప్రీంకోర్టు వెంటనే సుమోటాగా స్వీకరించింది. మతాలవారిగా కులాల వారిగా ప్రజల్ని విభజించి, స్త్రీ శరీరాలను పావులుగా వాడుకునే దుష్ట రాజకీయాల్ని కేంద్ర ప్రభుత్వం అదుపులో పెట్టుకోలేకపోయింది. దేశ ప్రజల ముందు నిస్సిగ్గుగా బయటపడింది. 'ఇండియా'గా ఐక్యమైన విపక్షాలన్నీ మణిపూర్ వైఫల్యానికి దేశ ప్రధాని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. పార్లమెంటు సమావేశాల తొలిరోజునే మణిపూర్ మారణహోమం గురించి చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి.

కుక్కీ మహిళల్ని నగ్నంగా ఊరేగించి అమానుష సంఘటన 2023 మే 4న జరిగితే, జులై 20న 78రోజుల తర్వాత ఒకరిని అరెస్టు చేశారు. దేశ పరిపాలనా వ్యవస్థ పనితీరును ఇది ప్రతిఫలిస్తుంది. నిజానికి సీన్‌లో కనిపించేవారు దోషులే అయినా, వారిని ఉసిగొల్పిన పెద్దదోషులు వేరే ఉన్నారు. నోర్లు విప్పకుండా, నిర్లిప్తంగా ఘోరాలు జరగడానికి సహకరించిన రాష్ట్ర - కేంద్ర నాయకులే అసలు దోషులు! స్వతంత్ర భారతదేశంలో తొలిసారి జరిగిన ఈ సంఘటన, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని అంటే డబుల్ ఇంజన్ సర్కార్‌ని ప్రశ్నించింది. వారి మెదళ్ళలోని అనాగరికతకు అద్దం పట్టింది. మణిపూర్ జనాభాలో 54శాతానికి పైగా ఉన్న మైతీలకు కుకీ, నాగ గిరిజన తెగలకూ మధ్య బీజేపీ తన రాజకీయ లబ్ధికోసం చిచ్చుపెట్టింది. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతీలను గిరిజనులుగా మార్చడానికి బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి. కుక్కీ, నాగ తెగలు ప్రతిఘటించాయి. ఈ గిరిజన తెగల వారు క్రిస్టియన్లు. అందువల్ల మతోన్మాదులు ప్రభుత్వాల అండతో వారి ఇండ్లు, చర్చ్‌లు ధ్వంసం చేశారు. వందల మందిని చంపేశారు. స్త్రీలపై అత్యాచారాలు చేశారు. రెండున్న నెలలుగా అక్కడ మారణహోమం జరుగుతున్నా, రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి అందరికందరూ మౌనం వహించారు. అదుపు చేయడానికి ప్రయత్నించలేదు. అంతా అయిపోయాక దేశ ప్రధాని విభ్రాంతిని వ్యక్తం చేశారు. తన తన ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చి, ఒక రాజకీయ ప్రకటన చేశారు. దాన్ని మించిన అవివేకపు ప్రకటన మరొకటి ఉండదని దేశ ప్రజలు ఉడికిపోయారు. నిజాయితీ గల మనుషులైతే నాయకులంతా రాజీనామాలిచ్చి, రాష్ట్రపతి పాలన తేవాలి. దానితో పరిస్థితి అదుపులోకి రావొచ్చు. మోడీజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ గాయమైంది. ప్రధానిగా ఉన్నప్పుడు మణిపూర్ మండిపోయింది. ఎన్ని తప్పులు క్షమించినా, దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వం చేసిన ఈ రెండు తప్పుల్ని ఎప్పటికీ క్షమించరు. మణిపూర్‌లో మహిళల శరీరాలు రాజకీయ రణాలకు యుద్ధభూములయ్యాయి. అయినా అధికార పార్టీలో ఉన్న మహిళలు ఎవరూ గొంతెత్తలేదు. అన్యాయాన్ని నిరసించలేదు. మానవీయ విలువల్ని తొక్కిపెట్టే రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా?

చివరగా- మనుషులుగా ఎదగని వారిని నాయకులుగా ఎన్నుకున్న ఈ దేశ ప్రజల మూర్ఖత్వంపై కూడా మనం జాలిపడక తప్పదు. వీళ్ళెప్పుడు ఎదుగుతారూ? తమలో నుంచి మానవత్వం, నిజాయితీగల నాయకుల్ని ఎప్పుడు తయారు చేసుకుంటారూ? ఈ చీకటిపాలనను ఎప్పుడు అంతం చేసుకుంటారూ?

- వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

ప్రకృతి శాసనం

ఎవడి రహస్య ఎజెండాలు
వాడికి ఉన్నాయి.

ఎన్నికల ఓట్ల కళ్ళద్దాలు తప్ప
వాడికేం కన్పించదు.

మనిషిగా జీవించడం
ఎప్పుడో మానేసాడు

ఈక్షణం నాబతుక్కి
రక్షణ కావాలి
దిక్కులు పిక్కటిల్లే
ఆక్రందన నాది
నరకప్రాయమైన
గుండెలోతుల్లో నుండి
వస్తున్న ఆత్మఘోష ఇది.

పేరుకే ప్రజాస్వామ్యం!
నాపై మూకాసురల రాజ్య దండయాత్ర

ఈ అసురుల ప్రాణ ప్రతిష్ట ఎవరిది?
నీది కాదా..?

నన్ను చంపినోళ్ళనో
నన్ను చెరచినోళ్ళనో
చంపేస్తే సరా? అదే
సమస్యాంతమా?

యుగయుగాలుగా
ఇవేగా ఘోరాలు - నేరాలు
మారణ హోమాలు - యుద్ధాలు
ఊచకోతలు - ప్రతీకారాలు

అసలు మనిషిపై
అంత కక్షెందుకు నీకు

నాలాగా నీవు
తల్లికడుపున పుట్టలేదా?
మరినీలాగానాకు
బతికే హక్కులేదా ఇదేం ధర్మం?
... ...
రక్షణ రక్షణ రక్షణ
రక్షణ స్థాపించే
శాంతిని శోధించండి
సాధించండి, బోధించండి

మనిషి రక్షణ పట్టని
మనిషెందుకు? పాలనెందుకు?

మళ్ళీ మళ్ళీ చెప్తున్నా...
నా రక్షణకై నేనే
నా మనుషులతో కలసి
జన్మ జన్మలు పోరాడుతా
ఇదే మానవ ధర్మం
ప్రకృతి శాసనం.

- కె శాంతారావు
9959745723

మెయిల్ @ నవతెలంగాణ

ప్రతిపక్షాల ఆఖరి అస్త్రం... అవిశ్వాసం!

ప్రజాస్వామ్య దేశంలో అన్ని అంశాలపై చర్చించేందుకు వేదికగా పార్లమెంట్ ఉండాలి. ప్రజలకు అవసరమైన వివిధ చట్టాలను ప్రవేశపెట్టడం, సమగ్రమైన చర్చ జరిగి, అధికార, విపక్ష పార్టీల సభ్యులు సూచించిన ఆమోదయోగ్యమైన సలహాలు పరిగణనలోకి తీసుకోవడం అధికారపక్షం బాధ్యత. కానీ ఇటీవల కాలంలో అలా జరగటం లేదు. బీజేపీ సొంత అజెండాలకు, పట్టింపులకుపోయి, సభా సమయాన్ని వృథాచేస్తోంది. గత పార్లమెంటు సమావేశాల్లో "అదానీ" ఆర్థిక వ్యవహారాలపై జేపిసి వేయాలని విపక్షాలు పట్టుబట్టినా ఏమాత్రం లెక్కచేయకుండా కాలం వెళ్లదీసింది. ఇప్పుడు కూడా అదేతీరున వ్యవహరిస్తోంది. మణిపూర్ అమానుష సంఘటనపై ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లో దేశ ప్రధాని మాట్లాడాలని విపక్షాలు పట్టుబడుతున్నా నేటికీ ప్రధాని మాట్లాడకపోవడం శోచనీయం. ఎలాగైనా ప్రధాని చేత మాట్లాడించాలని ప్రతిపక్షాలు ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. దీంతో విపక్షాలకు బలం లేకపోయినా, ప్రధాని చేత నోరు విప్పించాలని, వాస్తవాలు వెలుగులోకి రప్పించాలని ఒకే ఒక్క ఉద్దేశంతో అవిశ్వాస తీర్మాన నోటీసును ప్రవేశపెట్టాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 28వ అవిశ్వాస తీర్మానం నోటీసు, ప్రస్తుత మోడీ ప్రభుత్వానికి 2వ అవిశ్వాస తీర్మానమిది. స్పీకర్ ఆమోదం పొందడంతో త్వరలో చర్చ, ఓటింగ్ జరగనుంది. 1962లో చైనా చేతిలో భారత్ ఓడిన సందర్భంగా ఆచార్య కృపలాని, అప్పటి ప్రధాని నెహ్రూపై 1963లో అవిశ్వాస తీర్మానం మొదటి సారిగా ప్రవేశపెట్టారు. లాల్ బహదూర్ శాస్త్రిపై మూడుసార్లు, అత్యధికంగా ఇందిరాగాంధీ పై 15సార్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. కేవలం ఒకే ఒక ఓటు తేడాతో వాజ్‌పాయ్ ప్రభుత్వం పడిపోయిన సందర్భం కూడా దేశానికి తెలిసిందే.

ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో అనేక హింసాత్మక ఘటనలు జరుగుతున్నా, గత మూడు నెలలుగా మంటల్లో కాలిపోతున్నా అధికారంలో ఉన్న ప్రధాని కనీసం ఒకసారైనా ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోవడం బాధాకరం. కనీసం వాస్తవ పరిస్థితులు దేశ ప్రజలకు పార్లమెంటు వేదికగా తెలపకపోవడం శోచనీయం. ప్రతిపక్షాల ఒత్తిడి చేసినా నోరువిప్పకపోవడంతో, ఇక ఆఖరి అస్త్రంగా అవిశ్వాస తీర్మానం ద్వారా, ప్రధాని చేత మాట్లాడించాలని నిర్ణయించారు. గెలుపోటములు ఎలాగున్నా, దేశంలో జరిగే వివిధ సమకాలీన సమస్యల్ని ఉద్దేశించి పాలకులు ప్రజలకు వివరించాలి. అనుమానాలను, భయభ్రాంతులను పటాపంచలు చేయాలి. అన్యాయం జరిగినవారికి ధైర్యం, భరోసా ఇవ్వాలి. ఎంతో ప్రజాధనాన్ని వెచ్చించి నడుపుతున్న పార్లమెంటు, వివిధ రాష్ట్రాల శాసనసభల, శాసనమండలి సమావేశాలు ప్రజా సమస్యలు చర్చించేందుకు, అభివృద్ధికి వేదికలుగా ఉపయోగించుకుంటేనే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరు ఉంటుంది. అంతే తప్ప ఊకదంపుడు మాటల వల్ల, ఉత్తుత్తి ప్రసంగాల వల్ల కాదనే విషయాన్ని కేంద్ర పాలకులు గ్రహించాలి.


- ఐ.పి.రావు

నాటో సదస్సు : ప్రపంచంపై ఆధిపత్యానికి కుతంత్రాలు!

లిథుయేనియా రాజధాని విల్నియస్‌లో ఇటీవల జరిగిన నాటో సదస్సు, అమెరికా నేతృత్వంలో పశ్చిమ దేశాల సైనిక కూటమి సరి కొత్తదాడి ప్రారంభించింది. ఉక్రెయిన్ యుద్ధం ఈ సదస్సులో కీలకాంశం అయినప్పటికీ, చివరగా జారీ చేసిన డిక్లరేషన్ మాత్రం ఆ అంశాన్ని మించి, యూరప్‌కు వెలుపల ఇతర ప్రాంతాల్లో తన ప్రయోజనాల గురించి పేర్కొంది. తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని ఎలాగైనా కొనసాగించాలనే తన ఉద్దేశ్యాన్ని అది స్పష్టం చేసింది. గతేడాది మాడ్రిడ్‌లో జరిగిన సదస్సు డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా, భూ, వాయు, సముద్ర జలాల, సైబర్ స్పేస్ రంగాల్లో ఎదురయ్యే భద్రతాపరమైన ముప్పులకు సంబంధించి '360 డిగ్రీల వైఖరి' గురించి డాక్యుమెంట్ పేర్కొంటోంది. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించినంత వరకు నాటో వినిపించిన గళం, దూకుడును పెంచేలా, పోరాటానికి సుముఖంగా వున్నామనేలా ఉంది. అంతేకానీ శాంతి చర్చలకు గల అవకాశాల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఉక్రెయిన్ భూభాగాల నుండి రష్యా పూర్తిగా, బేషరతుగా వైదొలగాలన్నది శాంతికి ముందస్తు షరతుగా పేర్కొంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు, యుద్ధ పరికరాల సరఫరాలను పెద్దఎత్తున పెంచేందుకు నాటో సదస్సు విడిగా ఒక ఒప్పందంలో అంగీకరించింది.

తక్షణమే నాటో సభ్యత్వం కావాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేస్తున్న డిమాండ్‌ను నాటో నేతలు అంగీకరించలేదు. దీనికి కూడా వ్యూహాత్మక ఎత్తుగడలు వున్నాయి. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇచ్చినట్లైతే నాటో ఒప్పందంలోని ఆర్టికల్ 5 అమల్లోకి వస్తుంది. అంటే అమెరికా, ఇతర నాటో సభ్య దేశాలు ప్రత్యక్షంగా రష్యాతో యుద్ధానికి దిగినట్లే అవుతుంది. ప్రస్తుతం నాటో కూటమిలోకి పరోక్షంగా వచ్చినట్లే నంటూ డిక్లరేషన్ ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చింది. "నాటో కూటమితో రాజకీయంగా విలీనమైనట్లేనని, పరస్పరం సహకరించుకోవడం మరింత పెరుగుతోందని" డిక్లరేషన్ పేర్కొంది. ఒకపక్క నాటో దేశాలు అందించే అత్యంత అధునాతనమైన ఆయుధాల సాయంతో నిలకడగా అలా పోరు సల్పుతూనే, మరోపక్క యుద్ధం కారణంగా జరిగే విధ్వంసం, వినాశనం భారాన్ని మాత్రం ఉక్రెయిన్ భరించే పరిస్థితి నెలకొనాలని అమెరికా కోరుకుంటోంది. ఫిన్లాండ్‌ను కొత్త సభ్యురాలిగా తీసుకున్నారు. టర్కీ తన అభ్యంతరాన్ని ఉపసంహరించుకోవడంతో స్వీడన్ చేరికకు మార్గం సుగమమైంది. ఈ రెండు దేశాల చేరికతో, రష్యాతో భూ సరిహద్దులు రెట్టింపు కన్నా పెరిగాయి. తూర్పు యూరప్ అంతటా మోహరించిన బలగాలు, ఆయుధాల వివరాలను పేర్కొంటూ ఒక డాక్యుమెంట్‌ను నాటో సదస్సు ఆమోదించింది. అలాగే నాటో సత్వర ప్రతిస్పందనా బలగాల సంఖ్యను 40వేల నుండి మూడు లక్షల మంది సైనికులకు పెంచాలన్న ప్రణాళికకు కూడా ఆమోదముద్ర వేసింది. ఆ రకంగా, రష్యా చుట్టుపక్కల సరిహద్దులను నాటో బలగాలతో చుట్టుముట్టడం చాలా వేగంగా పెరిగింది. ఇలా నాటో తూర్పు దిశగా విస్తరించడమే ఉక్రెయిన్‌లో యుద్ధానికి మొదటి కారణంగా వుంది. జర్మనీ ఏకీకరణ తర్వాత నాటోను తూర్పు దిశగా విస్తరించబోమని ఇచ్చిన హామీ నుండి అమెరికా, పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళాయి. మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఇండో-పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచంలో ప్రతి భాగంలోనూ తమ వ్యూహాత్మక ప్రయోజనాల గురించి విల్నియస్ డిక్లరేషన్ మాట్లాడింది. ఆ రకంగా, గుత్తాధిపత్యం కోసం... తన ప్రపంచ ప్రణాళికకు ద్రోహం చేసింది.

డిక్లరేషన్‌లో కీలకంగా దృష్టి పెట్టిన మరో అంశం చైనా. "అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని, అధికారాన్ని పెంచుకు నేందుకు, విస్తృత స్థాయిలో రాజకీయ, ఆర్థిక, సైనిక సాధనాలు ఉపయోగిస్తోందంటూ" చైనాపై ఆరోపణలు చేసింది. "హానికరమైన హైబ్రిడ్, సైబర్ కార్యకలాపాలతో నాటో భద్రతను దెబ్బతీస్తోందని, కీలకమైన సాంకేతిక రంగాలను, ముఖ్యమైన మౌలిక సదుపాయాలను, వ్యూహాత్మక పరికరాలను, సరఫరా మార్పులను నియంత్రించడానికి ప్రయత్నిస్తోందంటూ ఆరోపణలు చేసింది. ప్రపంచ దేశాలపై అమెరికా గుత్తాధిపత్యాన్ని కొనసాగిం చేందుకు రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటు చేసుకున్న యంత్రాంగాలు-నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను ఉల్లంఘిస్తోందంటూ చైనాపై ఆరోపణలు చేసింది. విల్నియస్ సదస్సులో క్వాడ్, అకస్ దేశాల రాజకీయ నేతల భాగస్వామ్యాన్ని చూసిన చైనాను ఈ రకంగా లక్ష్యంగా చేసుకుంది. ఈ సదస్సుకు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రధానులు, దక్షిణ కొరియా అధ్యక్షుడు హాజరయ్యారు. చైనాను ఎదుర్కొనడానికి, ఏకాకిని చేయడానికి తూర్పు ప్రాంతంలో నాటోను సృష్టించాలని అమెరికా ఆశిస్తోంది. క్వాడ్ సభ్యురాలై నప్పటికీ భారత్ ఈ సదస్సులో పాల్గొనలేదు.



ప్రాథమికంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని, రష్యాను విల్నియస్ సదస్సు ఎదుర్కొనాల్సి ఉన్నందున, తన తటస్థ వైఖరిని దృష్టిలో ఉంచుకుని భారత్ ఈ సదస్సుకు హాజరు కాలేకపోయింది. అయితే, పశ్చిమ దేశాల కూటమి అనుసరిస్తున్న ఇండో-పసిఫిక్ వ్యూహాన్ని నాటో సదస్సు అంచనా వేస్తోంది. ఈ ఇండో పసిఫిక్ వ్యూహంలో ఇప్పటికే భారత్ పూర్తిగా రంగంలోకి దిగింది.

పెరుగుతున్న సైనికీకరణను, అమెరికా, దాని మిత్రపక్షాల దూకుడును నాటో సదస్సు స్పష్టంగా తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సైన్యం ఉపసంహరణకు దిగిన జర్మనీ, జపాన్‌లు రెండూ తిరిగి ఆయుధాలను సమకూర్చుకునే పంథాను ఇప్పుడు అనుసరిస్తున్నాయి. సైనిక పాటవాన్ని సమకూర్చు కుంటున్నాయి.

> పెరుగుతున్న సైనికీకరణను, అమెరికా, దాని మిత్రపక్షాల దూకుడును నాటో సదస్సు స్పష్టంగా తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సైన్యం ఉపసంహరణకు దిగిన జర్మనీ, జపాన్‌లు రెండూ తిరిగి ఆయుధాలను సమకూర్చుకునే పంథాను ఇప్పుడు అనుసరిస్తున్నాయి. సైనిక పాటవాన్ని సమకూర్చు కుంటున్నాయి. ఉక్రెయిన్ సాయుధ బలగాల ప్రతి దాడిలో పెద్దగా పురోగతి లేకపోయినప్పటికీ ఉక్రెయిన్‌లో యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశిస్తున్నారు.

ఉక్రెయిన్ సాయుధ బలగాల ప్రతి దాడిలో పెద్దగా పురోగతి లేకపోయినప్పటికీ ఉక్రెయిన్‌లో యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశిస్తున్నారు. యూరప్‌పై తన గుత్తాధిపత్యాన్ని మరింత సంఘటితం చేసుకోవాలన్న అమెరికా ఆకాంక్షకు, చైనాతో జరగబోయే పోరాటంలో వారందరినీ కూడగట్టేందుకు ఈ సుదీర్ఘ యుద్ధం, అనుగుణంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే, అమెరికా దుందుడుకు ప్రణాళికలను మోడీ ప్రభుత్వం మరింతగా అంగీకరించడాన్ని చూడాల్సి ఉంటుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

- ప్రణయ్, సాత్విక్-చిరాగ్ జోడీ సైతం
- జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్



టోక్యో (జపాన్) : భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు జపాన్ ఓపెన్‌లో సత్తా చాటుతున్నారు. రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు తొలి రౌండ్లోనే నిరాశపరిచినా.. మెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్స్ విభాగాల్లో భారత షట్లర్లు టైటిల్ వేటలో దూకుడుగా దూసుకెళ్తున్నారు. సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్, యువ షట్లర్ లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకోగా.. పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి సైతం క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపారు.

మెన్స్ సింగిల్స్‌లో అన్‌సీడెడ్, కెనడా ఓపెన్ విజేత లక్ష్యసేన్ వరుసగా రెండో రౌండ్లో రాణించాడు. జపాన్ ఆటగాడు కంటా సునేయమపై వరుస గేముల్లో గెలుపొందాడు. 50 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్స్ పోరులో లక్ష్యసేన్ 21-14, 21-16తో అలవోక విజయం నమోదు చేశాడు. తొలి గేమ్‌లో లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. 11-5తో విరామ సమయానికి భారీ ముందంజలో నిలిచాడు. 16-14తో ఉండగా వరుసగా ఐదు పాయింట్లు గెల్చుకుని తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ లక్ష్యసేన్ విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ ద్వితీయార్థంలో జపాన్ కుర్రాడు పుంజుకున్నాడు. 13-13తో స్కోరు సమం చేసి 16-15తో ముందంజ వేశాడు. ఈ సమయంలో లక్ష్యసేన్ మరోసారి అత్యుత్తమ ప్రదర్శన చూపించాడు.



వరుసగా ఏడు పాయింట్లు కొల్లగొట్టిన లక్ష్యసేన్ 21-16తో రెండో గేమ్‌ను, క్వార్టర్‌ఫైనల్స్ బెర్త్‌ను కైవసం చేసుకున్నాడు. మూడు గేముల పాటు హోరాహోరీగా సాగిన ఆల్ ఇండియన్ ప్రీ క్వార్టర్స్‌లో సహచర షట్లర్, మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్‌పై హెచ్.ఎస్ ప్రణయ్ పైచేయి సాధించాడు. 57 నిమిషాల మ్యాచ్‌లో ప్రణయ్ 19-21, 21-9, 21-9తో శ్రీకాంత్‌పై గెలుపొందాడు. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో శ్రీకాంత్ గెలుపొందాడు. 10-10 నుంచి 18-18 వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ చివర్లో వరుస పాయింట్లతో ముందంజ వేశాడు. కానీ తర్వాతి రెండు గేముల్లో ప్రణయ్ చెలరేగాడు. శ్రీకాంత్‌ను చిత్తుగా ఓడించాడు. చివరి గేముల్లో ఏమాత్రం పోటీ ఇవ్వలేని శ్రీకాంత్ చేతులెత్తేశాడు. క్వార్టర్స్ బెర్త్‌ను ప్రణయ్‌కి అప్పగించాడు.

పురుషుల డబుల్స్‌లో కొరియా ఓపెన్ చాంపియన్స్ సాత్విక్, చిరాగ్ జోడీ క్వార్టర్స్‌కు చేరుకుంది. డెన్మార్క్ జోడీ జెప్పే, లాసెలపై 21-17, 21-11తో వరుస గేముల్లో సాధికారిక విజయం సాధించారు. తొలి గేమ్‌లో డెన్మార్క్ షట్లర్ల నుంచి ప్రతిఘటన కనిపించింది. 11-9తో విరామ సమయానికి ముందంజలో నిలిచిన సాత్విక్, చిరాగ్.. అదే దూకుడు కొనసాగించారు. రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్ దూకుడు ముందు డెన్మార్క్ జోడీ నిలువలేదు. ఏకపక్షంగా సాగిన గేమ్‌ను 21-11తో సొంతం చేసుకున్న సాత్విక్, చిరాగ్ నేడు క్వార్టర్‌ఫైనల్లో చైనీస్ తైపీ జోడీతో తలపడనున్నారు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ నిరాశపరిచింది. లోకల్ షట్లర్లు నమి, చిహరుల చేతిలో 21-23, 19-21తో వరుస గేముల్లో పోరాడి ఓడింది.

కుల్దీప్, జడేజా మాయాజాలం

- 114కు కుప్పకూలిన కరీబియన్లు
- ఛేదనలో మెరిసిన ఇషాన్ కిషన్

తొలి వన్డేలో భారత్ ఘన విజయం

పేసర్లు ప్రతాపం చూపించే కెన్సింగ్టన్ ఓవల్‌లో టీమ్ ఇండియా స్పిన్నర్లు మాయ చేశారు. చైనామన్ కుల్దీప్ యాదవ్, లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజాలు సంయుక్తంగా ఏడు వికెట్లు పడగొట్టారు. 88/3తో మెరుగ్గానే కనిపించిన కరీబియన్లు.. స్పిన్ ఆడలేక 114 పరుగులకే కుప్పకూలారు. ఛేదనలో ఇషాన్ కిషన్ (52) అర్థ సెంచరీతో మెరవటంతో భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది.

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్



స్పిన్ మ్యాజిక్‌తో విండీస్ తొలుత విలవిల్లాడగా.. ఓపెనర్ ఇషాన్ కిషన్ (52, 46 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో మెరవటంతో వెస్టిండీస్‌తో తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. కెన్సింగ్టన్ ఓవల్‌లో స్పిన్ మాయాజాలం. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 18 బంతుల్లోనే నాలుగు వికెట్లు పడగొట్టగా.. లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా ఆరు ఓవర్లలోనే మూడు వికెట్లతో మాయ చేశాడు. ఇటు కుల్దీప్, అటు జడేజా మ్యాజిక్‌తో చివరి ఏడు వికెట్లను 26 పరుగులకే చేజార్చుకున్న వెస్టిండీస్ 114 పరుగులకే కుప్పకూలింది. కుల్దీప్ యాదవ్ (4/6), రవీంద్ర జడేజా (3/37) కండ్లుచెదిరే ప్రదర్శనతో చెలరేగారు. విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (43, 45 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటంతో జట్టుకు మూడంకెల స్కోరు అందించాడు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత్, వెస్టిండీస్ రెండో వన్డే శనివారం కెన్సింగ్టన్ ఓవల్‌లోనే జరుగనుంది. కుల్దీప్ యాదవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

కిషన్ మెరుపుల్ : 115 పరుగుల ఛేదనలో భారత్‌కు ధనాధన్ ఆరంభమేమీ లభించలేదు. కుర్రాళ్లకు అవకాశం ఇచ్చిన మేనేజ్‌మెంట్.. రోహిత్ శర్మ విరాట్ కోహ్లిలను బ్యాటింగ్ ఆర్డర్‌లో వెనక్కి నెట్టింది. రోహిత్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన ఇషాన్ కిషన్ (52) అర్థ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (7), హార్దిక్ పాండ్య (5), శార్దుల్ ఠాకూర్ (1) నిరాశపరిచారు. సూర్యకుమార్ యాదవ్ (19, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. రవీంద్ర జడేజా (16 నాటౌట్, 21 బంతుల్లో 1 ఫోర్), కెప్టెన్ రోహిత్ శర్మ (12 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు) లాంఛనం ముగించారు. 22.5 ఓవర్లలో భారత్ 118 పరుగులు సాధించింది.

కుల్దీప్, జడేజా షో : భారత్‌తో వన్డేల్లో వెస్టిండీస్ రెండో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. 2018లో తిరువనంతపురం వన్డేలో 31.5 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలిన కరీబియన్లు.. తాజాగా వారి సొంతగడ్డపై 114 పరుగులకే చేతులెత్తేశారు. తొలుత టాస్ నెగ్గిన భారత్ ఛేదనకు మొగ్గుచూపింది. దీంతో తొలి వన్డేలో ఆతిథ్య విండీస్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. ఓపెనర్ కైల్ మేయర్స్ (2)ను హార్దిక్ పాండ్య వెనక్కి పంపి శుభారంభం అందించగా.. అరంగేట్ర పేసర్ ముకేశ్ కుమార్‌కు అలిక్ అతానేజ్ (22) వికెట్ కోల్పోయాడు. బ్రాండన్ కింగ్ (17)ను శార్దుల్ ఠాకూర్ సాగనంపాడు. టాప్ ఆర్డర్‌లో ముగ్గురు బ్యాటర్లు నిష్క్రమించినా.. వెస్టిండీస్ కుదురుగానే కనిపించింది. కెప్టెన్ హోప్ (43) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆ జట్టు డ్రెస్సింగ్‌రూమ్‌లో ఆశలు నింపే ప్రయత్నం చేశాడు. షిమ్రాన్ హెట్‌మయర్ (11)తో కలిసి కీలక భాగస్వామ్యం నమోదు చేసిన హోప్.. ఆ జట్టును మంచి స్కోరు దిశగా నడిపించాడు. కానీ బంతి స్పిన్నర్ల చేతికి అందగానే సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. 15.3 ఓవర్లలో 88/3తో మెరుగైన స్థితిలో నిలిచిన వెస్టిండీస్.. స్పిన్నర్ల మాయాజాలంతో 23 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. 26 పరుగులకే చివరి ఏడు వికెట్లు చేజార్చుకున్న వెస్టిండీస్ స్వదేశంలో మూడో అత్యల్ప స్కోరు చేసిన చెత్త రికార్డును మూటగట్టుకుంది.

చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాయ ఆకాశమే హద్దుగా సాగింది. 18 బంతుల్లో 6 పరుగులే ఇచ్చిన కుల్దీప్ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా సైతం ఆరు ఓవర్లలో 37 పరుగులకే 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. రోవ్‌మాన్ పావెల్ (4), రోమారియో షెఫర్డ్ (0), డొమినిక్ డ్రాక్స్ (3), యానిక్ (3), మోతె (0), జేడెన్ (0) దారుణంగా విఫలమయ్యారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

వెస్టిండీస్ ఇన్నింగ్స్ : 114/0 (హోప్ 43, అతానేజ్ 22, కుల్దీప్ 4/6, జడేజా 3/36)

భారత్ ఇన్నింగ్స్ : 118/5 (ఇషాన్ కిషన్ 52, సూర్యకుమార్ 19, రోహిత్ 12, మోతీ 2/26)

ఆగస్టు 27 నుంచి ఎంఎస్‌డీసీఏ స్కూల్ క్రికెట్ లీగ్

- టీ20 లీగ్‌కు ట్రయల్స్‌తో ఆటగాళ్ల ఎంపిక
- మొదలైన ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ



నవతెలంగాణ-హైదరాబాద్ : ఎంఎస్ ధోని క్రికెట్ అకాడమీ (ఎంఎస్‌డీసీఏ) స్కూల్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తుంది. ఆగస్టు 27 నుంచి 8 జట్లతో కూడిన టీ20 లీగ్ ఆరంభం కానుండగా.. ఆగస్టు 20 హైదరాబాద్‌లోని ఎంఎస్‌డీసీఏ శిక్షణ కేంద్రాల్లో సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు లీగ్ నిర్వాహకులు బ్రైనియాక్స్ బీ డైరెక్టర్ రషీద్ బాషా, డీపీఎస్ (నాచారం) విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వి, 7హెచ్ స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్ గురువారం జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు. 'స్కూల్ స్థాయిలో క్రికెట్ లీగ్ నిర్వహణ హర్షనీయం. ప్రతిభావంతులైన క్రికెటర్లు ట్రయల్స్‌లో పోటీపడి అద్భుత అవకాశాన్ని దక్కించుకోవాలి. లీగ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఐదుగురు క్రికెటర్లకు పల్లవి ఫౌండేషన్ రూ.5 లక్షల స్కాలర్‌షిప్ అందించనుందని' అని యశస్వి తెలిపారు.

ఓపెన్ సెలక్షన్స్ : స్కూల్ క్రికెట్ లీగ్‌ను ఎంఎస్‌డీసీఏ వినూత్నంగా ముందుకు తీసుకురానుంది. 8 జట్లు పోటీపడే లీగ్‌లో.. ఆటగాళ్లను పూర్తిగా ఎంఎస్‌డీసీఏ అకాడమీ కోచ్‌లే ఎంపిక చేస్తారు. సెలక్షన్ ట్రయల్స్ కోసం క్రికెటర్లు ఆగస్టు 17 వరకు దరఖాస్తు చేయవచ్చు. ఆగస్టు 25న జట్ల పేర్లు, ట్రోఫీ, జెర్సీ ఆవిష్కరించనున్నారు. ఆగస్టు 27న లీగ్ మ్యాచ్‌లో మొదలై, సెప్టెంబర్ 3న టైటిల్ పోరుతో లీగ్ ముగియనుంది. ' ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చి ప్రోత్సహించటమే ఎంఎస్‌డీసీఏ ఉద్దేశం. బాలురు అండర్-14, బాలికలు అండర్-16 విభాగాల్లో టీ20 లీగ్‌ను స్కూల్ లెవల్‌లో నిర్వహిస్తున్నాం. లీగ్‌లో సత్తా చాటిన నాణ్యమైన క్రికెటర్లకు మా అకాడమీలో ఆరు నెలలు ఉచిత శిక్షణ అందించనున్నామని' రషీద్ బాషా తెలిపారు. స్కూల్ క్రికెట్ లీగ్ రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాల కొరకు 7396386214, 7618703508 నంబర్లను సంప్రదించవచ్చు.

ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు షురూ

- యూత్, జూనియర్ పోటీలకు తొలిసారి భారత్ ఆతిథ్యం



న్యూఢిల్లీ : ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్ గ్రేటర్ నోయిడాలో గురువారం ఆరంభమయ్యాయి. ఆసియాలోని 15కు పైగా దేశాలు, 200 మంది అథ్లెట్లు, 50కి పైగా సాంకేతిక సిబ్బంది, కోచ్‌లు ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో భాగస్వామ్యం అవుతున్నారు. తొలిసారి భారత్ ఆతిథ్యం ఇస్తున్న ఈ ఈవెంట్‌ను భారత, ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ ఆఫీస్ బేరర్లతో కలిసి కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రారంభించారు. భారత్ నుంచి 30 మంది వెయిట్‌లిఫ్టర్లు పోటీల్లో బరువులు ఎత్తేందుకు సిద్ధమవుతున్నారు. టోర్నీలో ఓవరాల్‌గా 61 మెడల్స్ అందుబాటులో ఉన్నాయి. శుక్రవారం నుంచి పోటీలు షురూ కానుండగా, ఆగస్టు 5న పోటీలు ముగియనున్నాయి.

స్వదేశానికి సిరాజ్

విండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరం



బ్రిడ్జ్‌టౌన్ : టీమ్ ఇండియా నయా పేస్ దళపతి, హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి లేని వేళ భారత పేస్ విభాగానికి సారథ్యం వహిస్తున్న సిరాజ్.. చీలమండ గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. గాయం తీవ్రత చిన్నదే అయినా.. బీసీసీఐ వైద్య బృందం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సిరాజ్‌కు విశ్రాంతి సూచించింది. దీంతో వెస్టిండీస్‌తో తొలి వన్డేకు ముందు మహ్మద్ సిరాజ్ ఫిట్‌నెస్ సమస్యలతో జట్టు నుంచి తప్పుకున్నాడు. ఎన్‌సీఏలో తదుపరి రిహాబిలిటేషన్ కోసం మహ్మద్ సిరాజ్ తక్షణమే భారత్‌కు పయనం అవుతున్నట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. మహ్మద్ సిరాజ్ స్థానంలో మరో పేసర్‌ను వన్డే జట్టుకు ఎంపిక చేయలేదు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు 17 మందితో కూడిన జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఎంపిక చేయగా.. ప్రస్తుతం జట్టుతో 16 మంది క్రికెటర్లు ఉన్నారు.

ఐర్లాండ్‌తో సిరీస్‌కు బుమ్రా!

- వేగంగా సిద్ధమవుతున్న పేస్ దళపతి



న్యూఢిల్లీ : భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం ఎన్‌సీఏ షెడ్యూల్‌కు ముందే జరుగనుంది!. ఈ ఏడాది మార్చిలో వెన్నునొప్పి శస్త్రచికిత్స చేయించుకున్న బుమ్రా.. ఏప్రిల్ నుంచి రిహాబిలిటేషన్‌లో ఉన్నాడు. ఆసియా కప్‌కు బుమ్రా అందుబాటులోకి వస్తాడని నేషనల్ క్రికెట్ అకాడమీ వర్గాలు అంచనా వేశాయి. కానీ నెట్స్‌లో బుమ్రా పూర్తి స్థాయిలో బౌలింగ్ సాధన చేస్తున్నాడని గత వారం బీసీసీఐ మెడికల్ అప్‌డేట్‌లో తెలిపింది. దీంతో ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో బుమ్రా ఆడే అవకాశం కనిపిస్తోంది. ఆగస్టు 18, 20, 23న మూడు టీ20ల కోసం భారత జట్టు ఐర్లాండ్‌కు వెళ్లనుంది. ఐర్లాండ్ సిరీస్‌కు భారత జట్టును ఈ వారంలో ఎంపిక చేయనున్నారు. బుమ్రాతో పాటు మహ్మద్ షమి సైతం విరామం ముగించుకుని ఆసియా కప్‌కు అందుబాటులోకి రానున్నాడు. దీంతో బుమ్రా, షమి, సిరాజ్‌లతో కూడిన భారత పేస్ దళం వన్డే వరల్డ్‌కప్‌కు ఫిట్‌గా సిద్ధమవుతుందని బీసీసీఐ ఆశిస్తోంది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,490	▲ 330
22 క్యారెట్లు	- 55,450	▲ 300
కిలో వెండి	- 81,500	▲ 1,100



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 91
రిటైల్ (లైవ్)	రూ. 113
స్కిన్‌తో	రూ. 164
స్కిన్‌లెస్	రూ. 186

తక్షణ సహాయ చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

బృందాలను వెంటనే తరలించారు. రాష్ట్ర స్థాయిలో వరదల పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన డీజీపీ, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తరలించేందుకు పోలీసులను పురమాయించారు.

ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఆదేశాలు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరి, దాని ఉపనదులు, వాగులు, వంకలు ప్రమాద హెచ్చరికలు దాటి ఉప్పొంగి ప్రవహిస్తున్న పరిస్థితుల్లో, వరద ముంపును తగ్గించేటందుకు చర్యలు చేపట్టాలని సీఎం కోరారు. ఈ మేరకు ఇన్‌ఫ్లోను ముందస్తుగా అంచనా వేసి, గేట్లు ఎత్తివేస్తూ, వరద నీటిని కిందికి వదలాలని చీఫ్ ఇంజనీర్లకు సీఎం ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం, కడెం ప్రాజెక్టు, మిడ్ మానేరు, లోయర్ మానేరు తదితర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లకు సీఎం స్వయంగా ఫోన్లు చేసి, పరిస్థితులను పర్యవేక్షించారు.

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ జీహెచ్‌ఎంసీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు.మూసీ పరివాహక ప్రాంతాల్లో సహాయ చర్యలను చేపట్టేలా అధికారులను ఆదేశించారు. మంత్రి సత్యవతి రాథోడ్‌కు సీఎం ఫోన్ చేసి గోదావరి పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన మోరంపల్లి గ్రామంలో ప్రజలను రక్షించేలా పరిస్థితిని సమీక్షించారు. ములుగు ముంపు ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలను సత్యవతి రాథోడ్ స్వయంగా పర్యవేక్షించి, అక్కడే బస చేస్తున్నారు. మరోవైపు మంత్రి హరీశ్‌రావు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లాల్లో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి ఎక్కడ అవసరమైతే అక్కడ అత్యవసర వైద్య సదుపాయాలు అందించేలా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

ప్రజలకు ఇబ్బందుల తలెత్తకుండా ఉండేందుకు వీలుగా ప్రభుత్వ యంత్రాం గాన్ని అప్రమత్తం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలి పారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితుల ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు వెల్లడించారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఫైర్ తదితర శాఖల ఎమర్జెన్సీ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సచి వాలయంలో వర్షాలు, వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ అధికారులను నియమించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.7997950008, 79979597 82 ,040-23450779 అనే నెంబర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగూడెం , హైదరాబాద్ లలో రెండు చొప్పున ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, ములుగు, వరంగల్‌లో ఒక్కొక్క బృందం ఉందని సీఎస్ తెలిపారు.

కు'తంత్ర'మే!

(మొదటిపేజీ తరువాయి)

విశేష అధికారాలు సంక్రమించినప్పటికీ పరిస్థితిని చక్కదిద్దలేకపోతున్నానని చెబుతుందా? అది వైఫల్యమా లేక హింసను ఆపడం ఇష్టం లేదా?

ఉద్దేశపూర్వక 'నిస్సహాయత'

ఏ ప్రాంతంలో అయినా మతపరమైన హింస 24 గంటలకు పైగా కొనసాగితే అధికారులకు ఆ హింసను అడ్డుకోవడం ఇష్టం లేదని లేదా దానిలో వారికీ భాగముందని అర్థం చేసుకోవాలని సీనియర్ పోలీస్ అధికారులు అంటున్నారు. మరి మణిపూర్‌లో సుమారు మూడు నెలలుగా హింసాకాండ కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్న చేదునిజం మొదటి రోజే తెలిసిపోయింది. అంతర్గత భద్రత పేరిట తాను తీసుకుంటున్న చర్యలన్నింటినీ సమర్థించుకుంటున్న ప్రభుత్వం... ఇతర దేశాలతో సరిహద్దులు కలిగిన రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో భద్రతను తన అధీనంలోకి తీసుకుంటున్న ప్రభుత్వం...సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్ తగలబడిపోతుంటే చూస్తూ కూర్చుంది. ఈ ఉద్దేశపూర్వక 'నిస్సహాయత' వెనుక ఓ కుతంత్రం ఉందని చెప్పక తప్పదు.

మైతీలకు అండదండలు

ముందుగా మణిపూర్‌లో కొనసాగుతున్న హింస స్వభావమేమిటో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మెజారిటీ తెగ అయిన మైతీకి రాష్ట్ర పోలీసుల మద్దతు ఉన్నదని, ఆ తెగ వారు లోయలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పెత్తనం చెలాయిస్తున్నారని పరిశీలకులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. పైగా మైతీలకు ముఖ్యమంత్రి రక్షణ ఉన్న విషయం బహిరంగ రహస్యమే. కుకీ జనాభాను అంతం చేయాలన్న తమ ఉద్దేశాన్ని మైతీ నేతలు బాహాటంగానే బయటపెడుతున్నారు. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మైతీల అరాచకాలకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కొమ్ముకాస్తున్నారని అనుకుంటే మోడీ ప్రభుత్వం కానీ, మణిపూర్‌లోనే ఉన్న ప్రధాని ప్రత్యేక ప్రతినిధులు కానీ ముఖ్యమంత్రిని రాజీనామా చేయాలని ఎందుకు కోరడం లేదు? దీనిని బట్టి చూస్తే మైతీలను నియంత్రించడం కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కానీ, రాష్ట్రంలోని బీరేన్ ప్రభుత్వానికి కానీ న ఎ త రా వ ఎ ా ఇష్టం లేదని తేలిపోతుంది. రాష్ట్రాన్ని జా తులపరంగా నిట్ట నిలువునా చీల్చి, రాజకీయ లబ్ది పొందడమే దీని వెనుక దాగిన కుట్ర అని అర్థమవుతుంది.

> **పక్కదారి పట్టింది...**
>
> మౌనంగా ఉండడం కాదు. మణిపూర్ హింస ను అడ్డుకోవడానికి నిరాకరించడం ప్రధానిలోని సంకీర్ణతకు నిదర్శనం. 78 రోజుల మౌనం తర్వాత మోడీ పెదవి విప్పినప్పటికీ అది మణిపూర్ గురించి కాదు...వెలుగు చూసిన వీడియో గురించి. అప్పటి నుండి బీజేపీ మంత్రులు, టీవీ వ్యాఖ్యాతలు అసలు సమస్యను పక్కనపెట్టి అదే పనిగా మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై మాట్లాడడం మొదలు పెట్టారు. ఏతా వాతా తేలేదేమంటే మణి పూర్ హింస మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టదు. దాని మౌనం, చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చూస్తుంటే జరుగుతున్న గందరగోళం బీజేపీకి ఎన్నికల ప్రయోజనం చేకూర్చేదిగా ఉంది.

ఇతర రాష్ట్రాలలోనూ...

మణిపూర్ పరిణామాలు ఇతర రాష్ట్రాల పైన కూడా ప్రభావం చూపడం మొదలు పెట్టాయి. మణిపూర్‌లో కుకీలపై జరుగుతున్న దాడులతో మిజోరంలో అశాంతి చెలరేగింది. అక్కడ నివసిస్తున్న మైతీలకు బెదిరింపులు వస్తున్నాయి. దీనిపై తక్షణమే స్పందించిన బీరేన్ సింగ్, మిజోరంలోని మైతీలను తరలించేందుకు ప్రత్యేక ఛార్టర్డ్ విమానాలు పంపుతామని ప్రకటించారు. అంతేకానీ హింసను అరికట్టి, కుకీలలో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్రం కానీ, రాష్ట్రం కానీ చెప్పడం లేదు. అస్సాంలోని బారక్ లోయలో నివసిస్తున్న మిజోలకు మైతీ గ్రూపులు హెచ్చరికలు పంపడం మొదలు పెట్టాయి. ఇక మేఘాలయలోని స్థానిక ముఠాలు మణిపూర్ నుండి ఆశ్రయం కోరి వచ్చే వారిని అనుమతించబోమని తెగేసి చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే దశాబ్దాల తరబడి ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో ఇప్పుడు అస్థిరత కన్పిస్తోంది. అదను కోసం వేచిచూస్తున్న ఉగ్రవాద గ్రూపులు బలాన్ని పుంజుకొని తమ తెగల మద్దతుతో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు సిద్ధపడుతున్నాయి. ఆ గ్రూపులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఏ మాత్రం నమ్మకం లేదు.

'బయటి వ్యక్తుల' ప్రస్తావనతో...

సాయుధ దళాల సామాజిక అధికారాల చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పీఏ) విధించాలంటూ కొందరు మణిపూర్ ప్రజలు చేస్తున్న డిమాండ్ హాస్యాస్పదం గా ఉంది. ఎందుకంటే మెజారిటీ ప్రజలు దశాబ్దాలుగా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మోడీ ప్రభుత్వ జోక్యం లేకుండా ఇదంతా జరుగుతోందంటే నమ్మశక్యంగా లేదు. ఏ ప్రభుత్వమైనా దేశంలోనూ, సమాజంలోనూ శాంతి స్థాపనకు కట్టుబడి ఉంటుంది. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం ఎప్పు డూ గందరగోళం సృష్టించడానికే ప్రయత్నిస్తుంది. గందరగోళం, అనిశ్చితి, అస్థిరత వంటివి ప్రభుత్వాలకు ఎంతగానో ఉపయోగ పడతాయి. ఎందుకంటే అవి ప్రజల మనసులో అయోమయాన్ని సృష్టిస్తాయి. మణిపూర్ లో అస్థిరత, హింసను మోడీ ప్రభుత్వం ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయో గించుకునే అవకాశం ఉంది. ఓ హెచ్చరిక, ఓ హామీతో ఆ పార్టీ హిందీ ప్రాంతాలకు ఓట్ల కోసం వెళుతుంది. బయటి వ్యక్తులు ఈశాన్య ప్రాంతంపై ఆధిపత్యం చెలాయిస్తారని హెచ్చరిస్తూ దానిని తాను నియంత్రిస్తానని హామీ ఇస్తుంది. ఈ 'బయటి వ్యక్తుల' ప్రస్తావన ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భం లోనూ బీజేపీ తీసుకొస్తూనే ఉంటుంది. దానిని సజీవంగా ఉంచేందుకు ప్రయత్నిస్తుంది.

సుభాష్ ముండా హంతకులను తక్షణమే అరెస్టు చేయండి

- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : జార్ఖండ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రముఖ గిరిజన నాయకులు సుభాష్ ముండా దారుణ హత్యను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో రాంచీ జిల్లాలోని దళదల్లిలోని అతని కార్యాలయంలోనే కొందరు దుండగులు దారుణంగా కాల్చి చంపారు. రాంచీ జిల్లాలోని నగ్రి ప్రాంతంలో 34 ఏండ్ల సుభాష్ ముండా ఒక ప్రముఖ నాయకుడని, గిరిజన, పేద, అట్టడుగు వర్గాల ప్రజల హక్కులను పరిరక్షిం చే పోరాటాల్లో కీలకంగా ఉన్నారని పొలిట్ బ్యూరో తెలిపింది. సామాన్య ప్రజల్లో సుభాష్‌కు ఉన్న ఆదరణ, ఆకర్షణ కారంగానే హతియా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు సార్లు, మందార్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం) తన అభ్యర్థిగా నిలబెట్టిందని గుర్తు చేసింది. ముండా హత్య కేసుపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేయాలని, హంతకులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

సరిహద్దు ప్రతిష్టంభనపై బాలిలో చర్చించిన మోడీ, జిన్‌పింగ్

- వెల్లడించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ : గతేడాది బాలిలో జరిగిన జీ 20 సమావేశాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు సరిహద్దుల్లో నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలియచేసింది. ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారని తెలిపింది. చైనా అధ్యక్షుడు ఈ విషయాన్ని వెల్లడించిన కొద్ది రోజుల తర్వాత భారత విదేశాంగ శాఖ ఈ ప్రకటన చేసింది. విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా ఆనాడు బాలిలో మీడియాతో మాట్లాడుతూ, ఇరువురు నేతలు కేవలం మర్యాదపూర్వకంగా మాట్లాడుకున్నారని మాత్రమే చెప్పారు.

అయితే ఇటీవల జోహాన్నెస్‌బర్గ్‌లో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం నేపథ్యంలో భారత్ జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ డోవల్, చైనా విదేశాంగ వ్యవహారాల కమిషన్ డైరెక్టర్ వాంగ్ యి మధ్య సమావేశం జరిగింది. ఆ సమావేశంపై ప్రకటన చేస్తూ చైనా విదేశాంగ శాఖ పై విషయాన్ని వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా దీనిపై ప్రకటన చేసింది.

నేడూ పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు మోస్తరు వానలు, ఆయా జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరా బాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. శుక్రవారం నాడు ఆదిలాబాద్, కొమ్రం భీమ్ అసిఫాబాద్, నిర్మల్, నిజామా బాద్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించారు. ఈ మేరకు ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. శని, ఆదివారాల్లో మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయి. గురువారం నాడు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లో కుండపోత, అత్యంత భారీ, భారీ వర్షాలు ఎక్కువ ప్రాంతాల్లో పడ్డాయి. ఆ జిల్లాల్లో 40 ప్రాంతాల్లో 11.56 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి 10 గంటల వరకు నిర్మల్ జిల్లా కడెం పెద్దూరు మండలం లింగాపూర్‌లో అత్యధికంగా 23.18 సెంటీమీటర్ల కుండపోత వర్షం పడింది. మొత్తం 674 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అందులో 100కి పైగా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

వరద సహాయక చర్యలు చేపట్టండి

- మంత్రి కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి లేఖ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో వరద సహాయ చర్యలు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.ఇంకా లోతట్టు ప్రాంతాల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ఈమేరకు గురువారం మంత్రి కేటీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతయుతమైన పదవిలో ఉండి ప్రజల గోసను పట్టించుకోకుండా పత్తా లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. పుట్టిన రోజులు చేసుకుంటూ ప్రజలను 'మీ చావు మీరు చావండి' అని వదిలేయడమేంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దామంటూ సెల్ఫ్ డబ్బాలు కొట్టుకోవడానికి తండ్రీ, కొడుకులు పోటీ పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్టుగా అన్నీ జరిగితే, ఐటీ కారిడార్ నుంచి హయత్‌నగర్ దాకా ట్రాఫిక్ జామ్‌లు ఎందుకవుతున్నాయని నిలదీశారు. పది నిమిషాల ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతున్నదని తెలిపారు. నాలాలు, చెరువులు కబ్జా. హైదరాబాద్ పరిధిలో టీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు యథేచ్ఛగా భూములు, చెరువులు కబ్జా చేస్తూ... అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన మీరు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వరదల సమయంలో మీడియా ముందుకు వచ్చికేసీఆర్ చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఈ పరిస్థితి కారణం ఎవరనే దానిపై ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకున్నా పాపాన పోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలల ప్రపంచం నుంచి బయటికి వచ్చి ప్రజల కష్టాలను తీర్చే ప్రయత్నం చేయాలని కేటీఆర్‌ను కోరారు. ప్రభావిత ప్రజలకు రూ. 10 వేల సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని దినసరి కూలీలను ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదిన మరమత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వరద సాయం అందేలా చూడాలి
జూమ్ మీడింగ్‌లో రేవంత్‌రెడ్డి డిమాండ్

రాష్ట్రంలో వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేయాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వరద సాయం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో తన నివాసం నుంచి పార్టీ నేతలతో రేవంత్ జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ, పీఈసీ సభ్యులు, ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు సీనియర్ నాయకులతో మాట్లాడారు.

ఎంటెక్ విద్యార్థి రోహిత్ రాజ్‌కు అభినందనలు



నవతెలంగాణ- బడంగ్ పేట్

నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్యతోనే మంచి గుర్తింపు వస్తుందని మహేశ్వరం నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పార్టీ బాలాపూర్ బూత్ అధ్యక్షురాలు జిల్లా అనితా బాలరాజుల కుమారుడు జే.బీ.రోహిత్ రాజ్.. మద్రాస్ ఐఐటీ నుండి ఎంటెక్ పట్టాను పొందారు. ఈ మేరకు గురువారం మహిళా కన్వీనర్ ఇందుమతితో కలిసి గుడ్ల శ్రీనివాస్..రోహిత్ రాజ్‌ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రిష్ణ, మైలారం జగన్, అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ డివిజన్ ఏసీపీగా వెంకన్న నాయక్



నవతెలంగాణ- సంతోష్ నగర్

సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని సైదాబాద్ పోలీస్ డివిజన్‌కు తొలి ఏసీపీగా డి.వెంకన్న నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా సైదాబాద్, మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో కలుపుతూ కొత్త డివిజన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. (ట్రాఫిక్), డబీర్ పురా, మహేశ్వరం, ఎల్బీనగర్ (ట్రాఫిక్) పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. రాచకొండ ఎస్ఓటీ ఏసీపీగా బాధ్యతల్లో కొనసాగుతున్న ఆయనను సైదాబాద్ ఏసీపీగా బదిలీ చేస్తూ ఈ నెల 21న తెలంగాణ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకన్న నాయక్‌కు ఇటీవల ఏసీపీగా పదోన్నతి పొందిన (సైదాబాద్ పోలీస్ ఇంచార్జి ఇన్‌స్పెక్టర్) కె. సుబ్బరామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఇన్‌స్పెక్టర్ బండారు చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళులు



నవతెలంగాణ-వనస్థలిపురం

భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని గురువారం వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ శాఖలో శాస్త్రవేత్తగా దేశానికి ఎంతో సేవచేశారని కొనియాడారు. 2002 నుండి 2007 వరకు భారత 11వ రాష్ట్రపతిగా పనిచేశారని గుర్తుచేశారు. నివాళి అర్పించిన వారిలో స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు కొలిశెట్టి సంజయ్ కుమార్, బీరం శ్రీధర్, స్ఫూర్తి సేవాసమితి ప్రతినిధులు పెండ్యాల యాదగిరి, భాస్కర్, దేవదాస్, శ్రీనివాస్, అంజయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

'అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి'



నవతెలంగాణ-వనస్థలిపురం

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ కోరింది. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వనస్థలిపురం గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, ఆర్ఎం ఓ డాక్టర్ కృష్ణలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వ ఖజానా నుంచి వేసేలాగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. డాక్టర్ హరిప్రియ, ఆర్ ఎం ఓ డాక్టర్ కృష్ణలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకం భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ శాంతి కుమార్, తెలంగాణ వెల్నెస్ సెంటర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రిజ్వాన్ మహమ్మద్, తెలంగాణ వెల్నెస్ సెంటర్ వనస్థలిపురం ఉద్యోగులు, గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ, బడంగ్ పేట్

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని.. మున్సిపల్ కార్పొరేషన్, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. దీంట్లో భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగు, మలేరియా, కంటికి సంబంధించిన వ్యాధులు సంక్రమించకుండా దగ్గరలోని పీహెచ్‌సీ కేంద్రంలో డాక్టర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది సరైన విధంగా స్పందించడం లేదని కార్పొరేటర్లు తెలుపగా.. డీఈలు, ఏఈలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశాలు జారి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కమిషనర్ బి. సుమన్ రావు, డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఏఈఈ వినీల్ గౌడ్, హెల్త్ ఆఫీసర్ నర్సింగ్ రావు, మేనేజర్ నగేష్ బాబు, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శశికళ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధావులు, డాటా సైన్స్ బ్రోచర్ విడుదల



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కాలేజీలో కృత్రిమ మేధావులు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డేటా సైన్స్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ హృదయ్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 29, 30 తేదీల్లో కృత్రిమ మేధావులు, డేటా సైన్స్ (ఐసిఎఐడిఎస్) పై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవెంట్స్‌లో పాల్గొనే వారి నుంచి వివిధ రంగాల్లో వారి ఆలోచన విధానాలు, పరిశోధన ఫలితాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం పంచుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, డీన్‌లు, హెచ్ఓడీలు ఫ్యాకల్టీ, ఏవో రాజు తదితరులు పాల్గొన్నారు.

30మందిపై ఈ పెట్టి కేసులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళలో సమయానికి మించి నిర్వహిస్తున్న హోటల్స్, దాబాలు, షాపుల యాజమాన్యాలపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 30 మందిపై అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం..రాత్రి సమయాల్లో సమయానికి మించి హోటల్స్, దాబాలు, షాపులు నడిపినా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించినా, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవరించిన 30 మంది పై ఈ పెట్టి కేసులు నమోదు చేసి హయత్ నగర్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఒకటి, రెండు సార్లు తిరిగి పట్టుబడితే వారిపై కేసు నమోదు చేసి, జైల్‌కు పంపిస్తామని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పలు చోట్ల ముంపు ప్రాంతాల పరిశీలన



నవతెలంగాణ - మీర్ పేట్

భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని కోరారు. వర్షపు నీరు నాళాలు, కాల్వల్లోంచి సజావుగా వెళ్లేందుకు వాటిల్లో ఉన్న చెత్తను తొందరగా తొగించాలని అధికారులను ఆదేశించారు. చెరువు దిగువ ప్రాంతాల్లో ఉన్న కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికులకు కోరారు. చందన చెరువు ఎదురుగా ఆర్సీఐ రోడ్డు పైన ఉన్న వర్షపు నీరు సజావుగా వెళ్ళేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కమిషనర్ ఎ.వాణి రెడ్డి, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

ఎల్బీనగర్ :



సరూర్ నగర్‌లో ముంపునకు గురైన ప్రాంతాలను గురువారం మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని సరూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుళ్ళ శివప్రసాద్ ఆధ్వర్యంలో సరూర్ నగర్ డివిజన్ భగత్ సింగ్ నగర్ కాలనీ, జేబీ కాలనీ, డాక్టర్స్ కాలనీలు ఈ భారీ వర్షాలకు జలమయం అయ్యాయని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చామని గొప్పలు చెప్తున్న బీఆర్ఎస్ నాయకులు..ఒకసారి ఈ ప్రాంతంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పరిస్థితిని చూసి సిగ్గు తెచ్చుకోవాలని విమర్శించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధు సూదన్ రావు,రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, పంతంగి రాము గౌడ్, ఇమ్రాన్ అలీ, తాండ్ర భాస్కర్, ఖలీల్, సంతోష్ కుమార్, ఆంజనేయులు, శ్రీనివాసు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మీర్ పేట్ :



అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు, మంత్రాల చెరువు, చందన చెరువు, ట్రంక్ లైన్‌లను గురువారం డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కమిషనర్ ఎ.వాణి రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీరు సజావుగా వెళ్లేవిధంగా చర్యలు చేపట్టాలని..ట్రంకులైన్, నాళాలు, కాల్వలను శుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. శ్రీలత- 9640491615, రాత్రి 8 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు ఎ.సుమన్ గౌడ్- 9182137107 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి,నాయకులు దీప్ లాల్ చౌహన్ పాల్గొన్నారు.

హయత్‌నగర్ / వనస్థలిపురం :



హయత్ నగర్ డివిజన్‌లోని హైకోర్టు కాలనీ, భాగ్యలత, బీడీఎల్ కాలనీల నుంచి భారీగా వచ్చే వర్షపు నీటితో రోడ్లు జలమయం అయ్యాయి. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజతో కలిసి డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి గురువారం ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జేసీబీ, మాన్ సూన్ టీమ్ సహాయంతో దిగువ ప్రాంతానికి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కనీసం నిత్యవసర సరుకుల కోసం బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఉమా, డీఈ దామోదర్ రావు, ఈఈ రమేష్, ఏఈ నరేంద్ర తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ :



ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్ నుండి జల్ పల్లి వెళ్లే దారిలో నిలిచిపోయిన నీటిని, 13,15 డివిజన్లలోని పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, డీఈఈ జ్యోతి రెడ్డి, ఎర్ర జైహింద్, పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



యాకత్‌పురా నియోజకవర్గ ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని పరిశ్రమల ప్రాంతాల్లో కార్పొరేటర్ జనగాం శ్వేతా మధుకర్ గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, కృష్ణానగర్ కాలనీ, పలు కాలనీలో పర్యటించినట్లు తెలిపారు. ఎస్ఎన్ డిపి కాంట్రాక్ట్, జీహెచ్ఎంసీ మాన్సూన్ అత్యవసర బృందంతో, డీఆర్ఎఫ్ సిబ్బందితో రోడ్డుపై నిలిచిన నీటిని, విరిగిన చెట్లను తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ :

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాగోల్ డివిజన్‌లోని పలు కాలనీల రోడ్లన్నీ జలమయంగా మారాయి. జైపూర్ కాలనీ, వెంకటరమణ కాలనీ, బండ్లగూడ చౌరస్తా, ఆనంద్ నగర్ చౌరస్తాలతో పాటు పలు కాలనీలలోని రోడ్లపై నీరు నిల్వడంతో పాటు



డ్రైనేజీ మురుగు పొంగి పొర్లుతుంది. ఇంకా కృషినగర్ కాలనీ, రాజలక్ష్మి నగర్, మమతా నగర్ కాలనీలతో పాటు పలు కాలనీల్లో రోడ్లు వర్షం నీటితో నిండడంతో ఇంటి నుండి బయటకు వెళ్లాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆనంద్ నగర్ చౌరస్తా నుండి మన్సురాబాద్ వెళ్లే రహదారిలో గోపాలపురం కాలనీ వద్ద వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు నిలవడంతో చెరువును తలపిస్తుంది. బండ్లగూడ చౌరస్తా, ఆనంద్ నగర్ చౌరస్తాలలో రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బండ్లగూడ చెరువు నుండి నాగోలు చెరువుకు..నాగోల్ చెరువు నుండి మూసికి వెళ్లేందుకుగాను ఎస్ఎన్‌డీపీ కింద బాక్స్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినా సకాలంలో పూర్తి కాకపోవడంతో వరద నీరంతా నాగోలు చెరువు దిగువ ప్రాంతమైన వెంకటరమణ కాలనీ, మమతా నగర్ కాలనీల గుండా మూసికి వెళుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. ముంపు ప్రాంతాలకు వరద రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నాగోల్ డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

చైతన్యపురి :



భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ అన్నారు. గురువారం ఆర్కేపురం డివిజన్ ఈస్ట్ యాదవనగర్ కాలనీలో వర్ష ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ గౌడ్, కాలనీ ప్రధాన కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

ఘనంగా టీఎన్జీవోస్ నాయకుల జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం సహ అధ్యక్షుడు ఎం.ఏ.ముజీబ్ జన్మదిన వేడుకలు గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్, వివిధ యూనిట్ల అధ్యక్షా, కార్యదర్శులు.. జిల్లా కార్యదర్శి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఒమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు వైదిక్ శస్త్ర, శంకర్, ముఖీమ్, శ్రీధర్, సీఆర్వో యూనిట్ కార్యదర్శి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పోస్ట్ కార్డు ఉద్యమం



నవతెలంగాణ- చైతన్యపురి

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా కార్డులను అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయూ ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఎల్బీనగర్‌లో పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు రాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం అనేక పర్యాయాలు బహిరంగ ప్రకటన చేసినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. సొంత నివాసాలు లేక వేలాదిమంది జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య బీమా కార్డులను అందజేసి ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను వివరిస్తూ రాసిన పోస్ట్ కార్డులను ప్రగతి భవనంలో ఉన్న సీఎం కేసీఆర్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. శ్రీనివాసరావు, బానాల మధుసూదన్, శ్రీకాకోల్ల రాజు, గట్ల రవీంద్ర, మట్టా అశోక్ గౌడ్, భగవంతురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మలక్ పేటలోని ఎమ్మెల్యే నివాసంలో మన్సూరాబాద్ బీఆంఎస్ యువజన నాయకుడు జక్కిడి రఘువీరా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను భారీ గజమాల, శాలువాలతో సత్కరించారు. అనంతరం సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే కలిసి ఉన్న ఫోటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లా రెడ్డి, నర్రి వెంకన్న, జగదీష్ గౌడ్, బాలరాజు, రాంకోటి, నగేష్ యాదవ్, నవీన్, అఖిల్, శంకర్ రెడ్డి, రాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను టంగుటూరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట ప్రవీణ్, ధన్ పాల్ గౌడ్, శ్రీధర్, శివాజీ కృష్ణ, అమర్నాథ్, జడ్జిస్ కాలనీ అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జనార్దన్ రావు, వీరాచారీ, ప్రసాద్, భూపాల్ రెడ్డి, కల్కీ వర్ధన్ రెడ్డి, అనిల్, రాజు పాల్గొన్నారు.



హస్తినాపురం :



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భుపేష్ గుప్త నగర్ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారగోని శ్రీని వాస్ యాదవ్, శేషగిరిరావు, సాయి యాదవ్, మహేష్ యాదవ్, నారాయణ చారి, విజయ్ కుమార్, సంగిపేట నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్యపురి :



ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కృషి వలనే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు అన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం వారు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ మంచుకొండ సురేందర్ గుప్తా, డాక్టర్ రాజయ్య, హరినాథ్, ఓరుగంటి సుధాకర్, వెంకటేశ్వర్లు, శ్యామ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ :



హస్తినాపురంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో గురువారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్‌లు హాజరై ఎమ్మెల్యేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు నోటు పుస్తకాలను జ్ఞాపికంగా అందజేశారు. విషెస్ చెప్పిన వారిలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు యాదిరెడ్డి, రమేష్, సతీష్, యాదిలాలు, శంకర్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'మణిపూర్‌లో శాంతి నెలకొల్పండి'



నవతెలంగాణ-హయత్ నగర్

మణిపూర్‌లో జరిగే మారణకాండను అరికట్టి, ప్రజల మధ్య నెలకొన్న మతాల పోరును నిలువరించి.. శాంతిని నెలకొల్పాలని ఎల్బీనగర్ క్రిస్టియన్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కాగడాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ వింగ్ నాయకులు విప్పర్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా వెలుగొందే మన దేశంలో ఈ మధ్య కొన్ని దుష్ట శక్తుల ప్రమేయంతో మణిపూర్‌లో అశాంతి నెలకొందని, వెంటనే రాష్ట్రపతి జోక్యం చేసుకొని..మణిపూర్ మంటలను ఆర్పడానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దారుణాలపై కేంద్రం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిరసనలో ఎల్బీనగర్ క్రిస్టియన్ సంఘం సభ్యులు, కొంగరి నర్సింహ రావు, జైపాల్, నరేష్, శ్యామ్, సన్నీ రాజ్ కుమార్, సత్యం, జాన్, మేరీ, రెచెల్, వందన తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలపై వినతి పత్రం అందజేస్తాం'



నవతెలంగాణ - ఎల్బీనగర్

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని వరద నీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు గురువారం ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రేపు ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ సమీపంలోని అమరవీరుల స్తూపం దగ్గర సమావేశం కావాలన్నారు. కురుస్తున్న వర్షాల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టీనట్లు వ్యవహరిస్తుందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



అలుగు పారుతున్న చెన్నాపురం చెరువు నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదలకు ఆహారం ప్యాకెట్లు పంపిణీ



నవతెలంగాణ-మేడ్చల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలో ఆహారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు, గుడిసెలల్లోని వారికి గురువారం మంత్రి మల్లారెడ్డి యువసేన ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బాసురాది భాస్కర్ యాదవ్ ఆహారం ప్యాకెట్లను అందజేశారు. ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను గుర్తించి ఆదుకోవాలని ఉద్దేశంతోనే ఆహారం ప్యాకెట్లను అందజేసినట్టుగా తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీర్ల దయానంద్ యాదవ్, కౌన్సిలర్లు కౌడే మహేష్,బత్తుల శివ కుమార్ యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ,నాయకులు ఒగ్గు శంకర్,దుర్గం వెంకటేష్ ముదిరాజ్,రవీందర్ గౌడ్ లు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

- నాగారం మున్సిపాల్టీలో మునిగిన కాలనీలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- కాలనీల్లో పర్యటించిన ప్రజాప్రతినిధులు





నవతెలంగాణ-కీసర

వర్షాలు దంచి కొడుతుండడంతో నాగారం మున్సిపాల్టీలో కాలనీలు పూర్తిగా జలమయంగా మారాయి. ఇండ్లలోకి నీరు చేరుకోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాగారం కుషాయిగూడ ప్రధాన రోడ్డు పై నీరు నిలిచి పోవడంతో రాక పోకలు సరిగ్గా లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాంపల్లి చర్లపల్లి రహదారి లో ఎర్రిమల్లే వాగు పెద్ద ఎత్తున్న పొంగి పొర్లడంతో వాహనదారుల రాక పోకలు స్తంభించిపోయాయి. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సహాయక చర్యల్లో భాగంగా నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ,కౌన్సిలర్ లు పంగ హరిబాబు , గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ లు ప్రజలను అప్రమత్తం చేసి వసతులు కల్పించారు.





ఎక్కడ చూసినా నీరే

నవతెలంగాణ-బోడుప్పల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బోడుప్పల్ ,పీర్జాదిగూడ కార్పొరేషన్ల పరిధిలో ఎక్కడ చూసినా వర్షం నీరు



వచ్చి చేరింది. జంట కార్పొరేషన్ల పరిధిలోని వివిధ డివిజన్లు పూర్తి స్థాయిలో నీట మునిగి పోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కార్పొరేషన్లలో వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు గాను మేయర్లు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి కార్పొరేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.





రౌండ్ ది క్లాక్ పనిచేస్తున్న కంట్రోల్ రూమ్

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూమ్ రౌండ్ ది క్లాక్ పని చేస్తున్నదని మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ కార్యాలయంలో మాట్లాడుతూ కంట్రోల్ రూమ్‌కు గాని డీఆర్ఎఫ్ కంట్రోల్ రూం కు సమస్యల పై వచ్చిన ఫిర్యాదులు అదే రోజు క్లియర్ వేస్తున్నట్టు చెప్పారు. నగరంలో 11 సెంటి మీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదయ్యిందని కంట్రోల్ రూమ్ కూడా రౌండ్ ది క్లాక్ పని చేస్తున్నాయన్నారు. అనం తరం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో 450 టీమ్స్ పనిచేస్తున్నాయని అందులో 39 మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నీటిని తొలగించేందుకు 1097 పంప్ సెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. నగర పరిధిలో 185 చెరువులు ఉండగా ఏడు చెరువులలో సర్ ప్లస్ నీరు వెళుతున్నాయని, మరో 35 చెరువులలో ఎఫ్.టీ.ఎల్ కలిగి ఉన్నట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 339 వాటర్ లాగిన్ పాయింట్ ఉన్నాయని, జూలై మాసంలో 60 శాతం ఎక్కువగా వర్షం కురిశాయన్నారు. వర్షా కాలంలో సెల్లార్ నిర్మాణాలను చేపట్టకుండా చర్యలు తీసుకున్నట్లు, ఇంతకు ముందు నిర్మించిన సెల్లార్‌ల వద్ద అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేశామన్నారు.

చెరువులో కలుషిత వ్యర్థాలు.. వేల చేపలు మృత్యువాత..!



- ఘట్కేసర్ మండలం ఎదులాబాద్‌లో ఘటన
- రూ. లక్షల నష్టం వాటిల్లిందని మత్స్యకారులు ఆవేదన

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువులో కలుషిత వ్యర్థాలు కలవడంతో వేలసంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జవహర్ నగర్ లోని డంపింగ్ యార్డు నుంచి వ్యర్థరసాయనాలు రాంపల్లిచెరువులో పడి అక్కడి నుండి ఎరిమల్లేవాగు ద్వారా నేరుగా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కలుస్తున్నాయి. దీంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు మాట్లాడుతూ మూసీనది నీళ్ళతో ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే ప్రస్తుతం జవహర్ నగర్ డంపింగార్డు వ్యర్థ రసాయనాలు కలుస్తున్నాయని తెలిపారు. మూసీనది నీళ్ళకంటే జవహర్‌నగర్ డంపింగార్డు వ్యర్థాలే చాలా ప్రమాదకరంగా ఉన్నాయని మత్యకారులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో దాదాపు 400 కుటుంబాలు చెరువులో చేపలు పట్టుకోని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వ్యర్థాలు ఇలాగే కలిస్తే రెండు సంవత్సరాలలో చెరువు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు డంపింగ్ వ్యర్థాలు కలవకుండ తగిన చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని ఎదులాబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగరావు. మాజీ అధ్యక్షకార్యదర్శులు మెంగ బాలకృష్ణ, పూస బాలయ్య, మత్స్యకారులు కోరుతున్నారు.

జవహర్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం

- పునరావాస కేంద్రాలకు 8 కుటుంబాలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE AT :: SECUNDERABAD
OS NO 570 OF 2023

BETWEEN :-
DS PURENDRA NATH & OTHERS .....PLAINTIFFS
AND
THE THASHILDAR, SECUNDERABAD & OTHERS .....RESPONDANTS

TO
ALL CONCERNED (DEFENDANT NO. 2)

Whereas the above named plaintiffs have filed the above suit for declaration of legal heirs. You are hereby summoned to appear in this court in person or by a pleader on **27-09-2023** at 10.30 'O' Clock, failing which the matter will be heard and determined in your absence as exparte.

(BY ORDER OF THE COURT)
Dr. Anand Raju
+91 9640671501
Advocate
M/s. KVR LAW FIRM
H.No. 8-3-318/A-6/2, 3rd Floor, Abdullah Khan Building, Pillar No. C-1482, Yousufguda, Hyd-73. (TS)
Call: +91 9581199667

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT : AT : HAYATHNAGAR
O.S.No. 439 of 2023

Between :
Jakka Aparna Laxmi Kanaka Durga W/o. J.Venkateshwarlu, D/o. late Patthi Vinod Kumar,Aged about 47 years, Occ: Housewife,R/o. H.No. 10-10-170/601, Sri Sai Nagar,Peerzadiguda Village, Uppal Mandal,Medchal Malkajgiri District - 500094. ...Plaintiff

AND
1. Patthi Vedavathi W/o. late Patthi Vinod Kumar,Aged about 69 years, Occ: Housewife,C/o. Vanta Shala, SV Complex, 1-4-180/87,SBO Colony, H.T.Lane, Sainikpuri,Secunderabad - 500094.
2. Chilankuthi Swarna Laxmi W/o. C.Jayanth MohanD/o. late Patthi Vinod Kumar,Aged about 45 years, Occ: Housewife,C/o. Vanta Shala, SV Complex, 1-4-180/87,SBO Colony, H.T.Lane, Sainikpuri,Secunderabad - 500094.
3. Duggala Prasanna Laxmi W/o. D.Narayana Swamy D/o. late Patthi Vinod Kumar,Aged about 42 years, Occ: Housewife,R/o. III Floor, Manoj Mansion, H.No.16-11-20/4/11/68,Plot No.68, Malakpet, Hyderabad
4. The Tahsildar Hayathnagar Mandal, R.R.District.
5. All Concerned ...Defendants

To
All concerned

NOTICE

Whereas the above named plaintiff and Defendant No.1 to 3 as Legal Heirs of Late Patthi Vinod Kumar S/o. late Patthi Siddha Murthy, who died on 09-01-2022 in the above suit and in respect of the suit schedule properties i.e

SCHEDULE 'A'PROPERTY

All that piece and parcel of the House bearing No.127 in Category LIG in Phase I of Vanasthalipuram Residential Complex in Survey No.201 of Sahebnagar Kalan Village, Hayathnagar Mandal, Ranga Reddy Districtadmeasuring total 125.00 Sq.Mtrs., equivalent to 150.00 Sq. Yards,is bounded by:North : House No.B.126 LIG
South : House No.B.128 LIG
East : House No.B.112 LIG
West : 6 Mtrs., Wide Road

SCHEDULE 'B'PROPERTY

All that the undivided 1/28th share, out of land admeasuring 1000 Sq.Yards equivalent to 836 Sq.Mtrs., situated at Plot No.20, Survey No.167 of Kukatpally Village, Ranga Reddy District,is bounded by:North : Plot Nos.27 and 28
South : 30' wide road, East : Plot No.19
West : Plot No.21

and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 09.08.2023 at 10.30 AM, either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
(J.V. RAMANA MURTHY)
Advocate
1-5-652/A, Road No.7, New Maruthi Nagar, Kothapet Hyderabad-500035
Mobile No.9642221152

ఓయూ ఏసీపీగా ఎస్.సైదయ్య



నవతెలంగాణ-ఓయూ

ఓయూ నూతన ఏసీపీగా సుందరి సైదయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాచకొండ సీసీఎస్‌లో పనిచేస్తున్న ఆయన గతంలో యదాద్రి ఇన్‌స్పెక్టర్‌గా, చైతన్యపూరి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేశారు. ఓయూలో శాంతి భద్రతల పరిరక్షణకు సంరక్షణ కోసం కృషి చేస్తానని, విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు ఇస్తూ ఓయూలో ప్రశాంతత వాతావరణం కోసం పాటుపడతనన్నారు. శాంతిభద్రతల సంరక్షణ కోసం అందరూ కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సైదయ్యను సత్కరించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మారావును మర్యాద పూర్వకంగా కలిశారు.

అభివృద్ధి పనులకు చర్చ.. పలు కీలక నిర్ణయాలు ఆమోదం

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ బోర్డ్ పాలకమండ సాధారణ సమావేశం గురువారం బోర్డు కార్యాలయంలో బ్రిగేడియర్ ఏ.సోమశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈవో మధుకర్‌నాయక్, బోర్డు నామినేటెడ్ సభ్యులు జె.రామకృష్ణ పాల్గొని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. రోడ్లు తాగునీరు ఆస్పత్రుల అభివృద్ధితో పాటు చేపట్టి ఇతర అభివృద్ధి పనులపై వాడి వేడిగా చర్చించారు. ప్రస్తుతం వర్షాకాలంలో చేపట్టి చర్యలపై కూడా చర్చించినట్లు తెలిపారు.

కేటీఆర్ ద్విచక్ర వాహనంపై టెస్ట్ రైడ్ చేయండి..!

హైదరాబాద్ రోడ్లను పరిశీలించండి

- భయంకరమైన జీవన పరిస్థితులు ఎదుర్కొంటున్న హైదరాబాద్ వాసులు
- సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

విశ్వనగరం అని చెప్పుకుంటున్న హైదరాబాద్ నగరంలోని రోడ్లపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఒకసారి ద్విచక్ర వాహనంపై టెస్ట్ రైడ్‌చేసి అధ్వానంగా మారిన రోడ్లను పరీక్షించి, తర్వాత నగరం గురించి చెప్పాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి గురువారంఒక ప్రకటనలో మంత్రిని ప్రశ్నించారు. హైదరాబాద్ మహానగరం సమ స్యలకు నిలయంగా మారిందని, ముఖ్యంగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిన రోడ్లు, నాలాల వరదలు, బస్తీలు, కాలనీలలో ఉప్పొంగుతున్న డ్రయినేజీలతో హైద రాబాద్ వాసులు భయంకరమైన జీవన పరిస్థితులు ఎదు ర్కుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో సురక్షితమైన రోడ్లు ప్రాథమిక సౌకర్యాల కోసం ప్రజలు ఇప్పటికీ వేచి ఉండడం దారుణమన్నారు. టాక్స్‌ల రూపంలో ప్రజలు జీహెచ్‌ఎంసికి భారీ ఆదాయాన్ని అందిస్తున్న, దానికి ప్రతిఫలంగా మన కు దుమ్ము, గుం తలతో నిండిన రోడ్ల సౌకర్యం కల్పించడం దుర్మార్గమన్నా రు. పటిష్టమైన భూగర్భ డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో జీహెచ్ ఎంసి ఇంజనీరింగ్ వ్యవస్థ పుర్తిగా విఫలమైందని, నాలాల నిర్వహణలో జీహెచ్ ఎంసి అధికా రుల నిర్లక్ష్యం వల్ల నగరంలోని రోడ్లు వర్షపు, వరద నీరుతో వాగుల్లా, బురదమయంగా మారుతున్నా యని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, ప్రమాదాలకు గురవ్వడంతో పాటు గాయాలు, ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. యుద్ధప్రాతి పదికన నాలాలలో పుడీక తీయి ంచాలని, చాలా చోట్ల ఓపెన్ మ్యాన్ హెూల్ ఉన్నాయని, వాటిపై వెంటనే కప్పులు ఏర్పాటు చేయాలని అలాగే తవ్విన రోడ్ల పునరుద్ధరణ చేసి అధిక సాంద్రత గల సురక్షితమైన సిమెంట్ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. హైదరా బాద్ పౌరుల ప్రాథమిక హక్కు లకు భంగం కలిగిస్తే ఉరుకునేది లేదని, వారి హక్కుల రక్షణకై సీపీఐ ఉద్యమి స్తుందని ఆమె హెచ్చరించా రు. వర్షంలో అవసరమైతే తప్ప ఇంట్లో నుండి బయటకు రావద్దని ప్రభుత్వ అధికారుల హెచ్చరికలను పాటిస్తూ ఉపాధికి వెళ్లలేక ఇంట్లోనే ఉంటున్న దినసరి కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి

- డిప్యూటీ డాక్టర్ మంజునాథ్

నవతెలంగాణ-కంటోన్మెంట్



కేంద్రీయ విద్యాల యంలో విద్యార్థులను ఉన్నత ప్రమాణాలతో ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తు న్నట్లు డిప్యూటీ కమిషనర్ డాక్టర్.మంజు నాథ్ తెలిపారు. మూడేండ్ల జాతీయ విద్యా విధానం-2020లో విజయాలను తెలిపేందుకు గురువారం కేంద్రీయ విద్యా లయ సంఘట హైదరాబాద్ రీజియన్, పికెట్ కేంద్రీయ విద్యాలయంలో మీడి యా సమావేశం నిర్వహించారు. రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యా విధానం ప్రవేశపెట్టి మూడు సంవత్సరాలు పూర్తయ్యిందని, చిన్నపిల్లల నుంచి అప్పర్ ప్రైమరీస్కూల్ వరకు ఇంటర్ వరకు విద్యార్థులను ఉన్నత విద్యారంగంలో జాతీయ విద్యా విధానం రూపొందించామని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధి స్తున్నామన్నారు. వృత్తివిద్య డిస్టెన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ తదితరాం శాలలో నూతన విద్యార్థులకు విద్యా ప్రమాణాలు నేటి ఆధునిక సమాజానికి దీటుగా వెళ్లేవిధా నాన్ని వివరించారు. హైదరాబాద్, డైరెక్టర్ ఏ అనిల్ కుమార్, విద్యాశాఖాధి కారి విజయ కుమారి, సునీత రావు, సీబీఎస్ఈ, సిటీ సీబీఎస్ఈ సిటీ కోఆరి నేటర్, సునీతరావు, ఆర్మీపబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ అర్చనరావు పాల్గొన్నారు.

పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- గోల్నాక కార్ఖానా గల్లీలో ఘటన
- గంటల తరబడి నిలిచిన కరెంట్ సరఫరా
- సంఘటన స్థలాన్ని సందర్శించిన కార్పొరేటర్ అమృత



నవతెలంగాణ-అంబర్‌పేట

భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఒత్తిడి పెరిగి ఒక్కసారిగా పేలిపోయిన ఘటన నల్లకుంట డివిజన్‌లోని గోల్నాక కూరగాయల మార్కెట్ కార్ఖానా గల్లీలో జరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానా గల్లీలోని గత కొంతకాలంగా కరెంటు సమస్యలు తలెత్తుతున్నాయని, అదే విధంగా గురువారం వర్షం కురుస్తున్న సమయంలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఈ ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదుతో సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరిం చారు. సిబ్బంది మరమ్మతులు చేసి వెళ్లిపోయిన అనంతరం ఒక్కసారిగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పేలిపోయింది. ఈ మేరకు సమాచారం అనంతరం కార్పొరేటర్ వై.అమృత సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి బిగించి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, కనీసం పాత ఇనుప స్తంభాలు మార్చమని చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ కేపాసిటీ మార్చమని చెప్పినా అధికారులు 315 కెపాసిటీ ట్రాన్స్‌పార్మర్‌ని ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్పొరేటర్ వెంట బీజేపీ నాయకులు కేజే బాబు, గోపి, కిషన్, కోమటి శీను తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలలో ఊడిపడ్డ పెచ్చులు

- భయబ్రాంతులకు గురవుతున్న విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉస్మానియా యూనివర్సిటీలోని పలు హాస్టళ్ల దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. కురుస్తున్న వర్షాలకు గురువారం ఏన్ఆర్ఎస్ హెచ్ వసతి గృహంలో హాస్టల్‌లో బాత్రూం పైకప్పు పెచ్చులు ఊడికింద పడిన ఘటనలు ఓయూ పరిధిలో చోటు చేసుకున్నాయి. దీంతో విద్యార్థులు భయబ్రాంతులకు గురవు తున్నారు. ఓయూ అధికారులు నిర్లక్ష్యమే దీనికి కారణమని, మరమ్మతులు చేయించలేక పోవడం వల్ల ఇటువంటి ఇబ్బ ందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు మండిపడు తు న్నారు. పరిశోధక విద్యార్థులు భవనంపై కప్పు నుండి నీరు కురుస్తుందని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకో వడంలేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపి స్తు న్నారు. బుధవారం విద్యార్థులు కురుస్తున్న నీటిలోనే అన్నం తిం టూ నిరసన తెలిపారు. అదే హాస్టల్లో పలుచోట్ల పైకప్పు పెచ్చులు ఊడిపడడంతో పాటు ఓ బాత్రూంపై కప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. వర్సిటీ పరిశోధక విద్యార్థి, ఏఐఎస్ ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ ఓయూలో సమ స్యల గుప్పిట్లో బతకాల్సి వస్తుందని, పరిశోధక విద్యార్థులు ఉంటున్న హాస్టల్ పరిస్థితే ఇలా ఉంటే మిగితా వాటి పరిస్థి అర్థం చేసుకోవచ్చున్నారు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వం నియంత వైఖరి ఓయూ మను గడను దెబ్బ తీస్తు ందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, కేటీఆర్‌లు ఓయూను సందర్శించాలన్నారు. ఉద్దేశ పూర్వకం గానే ప్రభుత్వ ప్రయివేటు యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ, ప్రభుత్వ యూనివర్సిటీని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు.

ఇందిరమ్మ నగర్‌లో పర్యటించిన నాగేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్రంలో గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న దంచికొడుతున్నాయి. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 2వ వార్డు, ఇందిరమ్మనగర్ శ్రీలంకబస్తీలు జలమయమయ్యాయి. ఆ ప్రాంతాలను గురువారం రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ చైర్మెన్ గజ్జెల నాగేష్ పర్యటించారు. ఇళ్లలో నీరు చేరిన బాధితులను పరామర్శించారు. బస్తీల్లో నిలిచిన వర్షపు నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశించారు. వర్షాలు తగు ముఖం పట్టే వరక ఆ బస్తీల్లో నివసించేవారిని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందు కు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు అలాగే చెత్తచెదారులతో ఉన్న కలవట్లను కూడా సిబ్బందితో శుభ్రంచేయించారు. అధికారులు ప్రజలకు అందిబాటులో ఉండాలన్నారు.

బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



- ఎమ్మెల్యే ముఠాగోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా కార్య కర్తలు నాయకులు అంకిత భావంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గురువారం పార్శిగుట్టలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్ లో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి, ఓటర్ నమోదు విజయవంతానికి కృషిచేసిన ఆకుల అరుణ్ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను ఆకుల అరుణ్ కుమార్ సన్మానించి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని, నియోజకవర్గంలో సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకున్న లబ్దిదారు లను కలిసి పార్టీకి మద్దతుగా నిలవాలని కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహా, సీనియర్ నాయకుడు టి. సోమన్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్, వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, శ్రీధరాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని విస్మరించిన ప్రభుత్వం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ

నవతెలంగాణ-అడిక్‌మెట్



రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ పథకాన్ని నీరు కారుస్తుం దని, ఆ పథకాన్ని విస్మరించిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి వేముల రామకృష్ణ అన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, ఎంసీఏ పీజీ కోర్సులు చదివే విద్యార్థు లకి పూర్తి ఫీజు రీయిం బర్స్‌మెంట్ చెల్లించాలి అని డిమాండ్ చేస్తూ విద్యా నగర్ బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం ఐఐటీ, ఐఐఎం చదివే బీసీ విద్యార్థులకు మాత్రమే పూర్తి ఫీజులు చెల్లిస్తామని ప్రకటించడం సరైన వైఖరి కాదన్నారు. గత మూడు సంవత్సరాలుగా రూ.5000 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయా లన్నా రు.ఈ పథకాన్ని నీరుగారుస్తు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారన్నారు. బీసీ కాలేజ్, గురుకుల హాస్టల్స్‌కు ఒక్క సొంత భవనం కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెంకట్, మల్లేష్, భాస్కర్, వినోద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి అన్ని విధాలుగా ప్రభుత్వపరంగా వ్యక్తిగతంగా సహాయ సహకారాలు ఉంటా యని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని బా పునగర్, ఓవైసీ నగర్,సి బ్లాక్, పటేల్ నగర్ ప్రేమ్‌నగర్‌లో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి నాలా పరీవాహక ప్రాంతంలో పర్యటించి నాలాలో వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు నాలాలో ఉన్న చెత్తని మట్టికుప్పలను తీ యించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలు పడడంతో ఇదే బాపునగర్, సిబ్లాక్, ప్రేమ్ నగర్, పటేల్ నగర్‌లో నడుములోతు నీళ్లలో ప్రజలు పడ్డ అవస్థలను చూసినట్లు ఆమె తెలిపారు. నాలా పరీవాహక ప్రాంతంలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేయిస్తూ ఎమ్మెల్యే సహకారంతో నాలా వెడల్పు పనులను చేయిం చడం జరుగుతుందన్నారు. వర్షాలు తగ్గేవరకు డివిజన్ ప్రజలకు వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే తనకు సమాచారం అందించవలసిందిగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ సిబ్బంది పాష,శ్రీనివాస్,రేఖ, బీఆర్ఎస్ నాయకులు పాక నర్సింగ్ గంగపుత్ర,వంజరి నాగరాజు, హైమద్, స్థానిక బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

పద్మశాలీలకు సీట్ల కేటాయింపులో సముచిత స్థానం కల్పించాలి



- రాష్ట్ర పద్మశాలిసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామశ్రీనివాస్
- 13న కోరుట్లలో పద్మశాలి రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభ

నవతెలంగాణ-ముషీరాబాద్

రాబోయే ఎన్నికల్లో పద్మశాలీలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్ల కేటాయింపులో సముచితస్థానం కేటాయిం చాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామశ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం భోలకపూర్ డివిజన్ పద్మశాలికాలనీలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 13న కొరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామశ్రీనివాస్ మాట్లాడుతూ... రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పార్టీ 10 అసెంబ్లీ స్థానాలు, పార్లమెంటులో మూడు స్థానాలు, కౌన్సిల్లో 5స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న పద్మశాలీలు ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని సూచించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ రమేష్, పద్మశాలిసంఘం అధ్యక్షులు బింగి నవీన్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, సంఘం సీనియర్నాయకులు సంగిశెట్టి రాజుకు మార్, నేత శ్రీనివాస్, గుర్రం శంకర్, గంజి శ్రీనివాస్, రాజుకుమార్, రాపోలు రమేష్, శ్రీధర్రాజు, గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లు ఎక్కడ?

- డా.సి.రోహిన్‌రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్



రాష్ట్రంలో గత నాలుగైదు రోజు లుగా వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమం అయ్యాయని, కొన్ని ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నా యని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు డా.సిరోహిన్‌రెడ్డి అన్నారు. గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్‌లో స్ట్రీట్ నంబర్ 14లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రయినేజ్ నీళ్లు రహదారులపై, రోడ్లపైన నిలిచిపోయి ప్రజలు తీవ్ర మైన అవస్థలు పడుతు న్నారని, అధికారులుగాని స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక బీజేపీ కార్పొరేటర్,అలాగే మేయర్ పర్యటించక పోవడం దారుణమని ఇది బీఆర్ఎస్ పాలనకు నిదర్శ నమని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసి అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ మురు గు నీరు డ్రయినేజీ పనులకు చర్యలు చేపట్టే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ ఆర్థిక సహాయం అందించి వారికి నిత్యా వసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ పర్యటనలో హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు నయీం, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షులు గొల్ల్యల రాజు, సోమాజి గూడ డివిజన్ అధ్యక్షులు నరేష్, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమే ష్, ముఖ్య నాయకులు దిలీప్ రాజ్ కుమార్, బైండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన ముగ్గురికి జైలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పాతకక్షలతో హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు రంగారెడ్డి జిల్లాకోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. గురువారం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పనికుమార్, ఇన్‌స్పెక్టర్ ఏ.వీ.రంగాచారి తెలిపిన వివరాల మేరకు సెప్టెంబర్ 8, 2020లో మొహినాబాద్ మండల్, నాగిరెడ్డిగూడెంకు చెందిన బంటు సంతోష్, బంటు అరవింద్, బంటు శ్రీధర్ కలిసి స్థానికంగా నివాసముండే ఉప్పరి సుమన్‌ను చితకబాదారు. అడ్డుగా వచ్చిన సుమన్ సోదరుడు వినోద్‌పై సైతం దాడిచేశారు. పాత కక్షల నేపథ్యంలో ఇద్దరిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితులు మొహినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసుమోదైంది. ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన ఎస్ఐ జగదీశ్వర్ పక్కాగా సాక్ష్యాలను సేకరించి కోర్టులో సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన రంగారెడ్డి జిల్లా అదనపు ప్రిన్సిపల్ సీనియర్ కోర్టు న్యాయమూర్తి పి.అంజనే యులు.. ముగ్గురు నిందితులకు వేర్వేరుగా ఏడాది జైలుశిక్షతోపాటు రూ.1000ల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి, సమగ్ర మూల్యాంకనానికి 'శాలాసిద్ధి'

డీఈవో రోహిణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

శాలాసిద్ధి కార్యక్రమం పాఠశాల అభివృద్ధికి, సమగ్ర మూల్యాంకనానికి ఉపయోగపడుతుందని హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లి నృపతుంగ ఉన్నత పాఠశాలలో శాలాసిద్ధిపై జరిగిన రెండు రోజుల వర్క్‌షాప్‌కు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాఠశాల వివరాలు, గణాంకాలు సరైన రీతిలో నమోదు చేయాల్సిన అవశ్యకత గురించి తెలియజేశారు. ఉపాధ్యాయులందరూ అత్యంత ప్రతిభావంతులను, ఉన్న వనరులను ఉపయోగించుకుని బోధన అభ్యాసన కార్యక్రమాన్ని ఫలవంతం చేయాలన్నారు. వర్షాలను లెక్కచేయకుండా ఉపాధ్యాయుల శిక్షణకు హాజరైనందుకు అందరిన్ని ఆమె అభినందించారు. త్వరలో ఉపాధ్యాయులందరికి మండలస్థాయిలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులు ఉంటాయని, అందరికి మాడ్యుల్స్ అందజేస్తామని డీఈవో వివరించారు.

త్వరలో చెరువు అభివృద్ధి పనులు

- నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ వెల్లడి

నవతెలంగాణ-కంటోన్మెంట్



తిరుమలగిరిలోని చెరువును రూ.3.50 కోట్ల రూపాయలు ఖర్చులతో ఆధు నీకరించి సుందరీకరించినట్లు బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ వెల్లడించారు. పాలకమండలి సమావేశం అనంతరం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. చెరువు అభివృద్ధి కాకపోవటం వల్ల వచ్చే సమస్యలను అనేక మార్లు కేంద్రానికి సంబంధించిన అధికారులకు వినతి పత్రాలు ఫిర్యాదు చేశారు. 6వ వార్డులో అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చామని, వాటిని కూల్చి వేసేం దు కు అధికారులు నిబంధనలను అమలు జరుపుతు న్నారని వెల్లడించారు. ము ఖ్యంగా డ్రయినేజీ వ్యవస్థ కంటోన్మెంట్లో ఆధునికరించేందుకు వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా తాము నిర్ణయాలు అమలు జరుపుతున్నామన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన టీపీటీ బకాయిలను కోరుతున్నప్పటికీ ప్రభుత్వం చెల్లించటం లేదని మొండి వైఖరితో వ్యవహ రిస్తుందన్నారు. ప్రభుత్వం కంటోన్మెంట్‌పై వివక్ష చూపకుండా ఇవ్వవలసిన బకాయిలను మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

విరిగిన భారీ వృక్షం

తెగిపడ్డ విద్యుత్ తీగలు

తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-ముషీరాబాద్

పద్మశాలికాలనీలో గురువారం కురుస్తున్న వర్షాలకు ఉదయం భారీ వృక్షం వేర్లతో సహా విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఆ సమయంలో అటుగా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై వేళాడుతుండడంతో స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. సమాచారం మేరకు జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్న డీఆర్ఎఫ్ సిబ్బంది సమస్యను పరిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు తెగిపడ్డ విద్యుత్ తీగలను సరిచేశారు. విద్యుత్ తీగలు తెగిపోవడం వల్ల తెల్లవారు జాము 6గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ప్రభుత్వ ప్రతినిధులు, పాలకులు ఎక్కడ?



- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయరెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రభుత్వ ప్రతినిధులు, పాలకులు ఎక్కడున్నారని ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ఓల్డ్ సిబిఐ కోటర్స్ స్థానిక నాయకులతో కలిసి పర్యటించిన ఆమె మాట్లాడుతూ గత వారం నుండి కురుస్తున్న వర్షానికి ఒక మీటరు ఎత్తునా మురుగునీరు కాలనీలో చేరి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాధుడే కరువేయడం విమర్శించారు. ఫోన్లో జీహెచ్ఎంసి డిఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి 3మోటర్లు ఏర్పాటు చేయించి నీళ్లను పంపింగ్ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాన్ కుమార్ కుటుంబాన్ని యూనివర్సిటీ అధికారులు ఆదుకోవాలి

- అధ్యక్షులు, ఓయూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) టి.మహేందర్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ సి బ్లాక్‌లో హాస్టల్లో కిచెన్‌మేన్‌గా పని చేస్తున్న ఓయూ ఔట్ సోర్సింగ్ వర్కర్ జాన్‌కుమార్(35) ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన వారం రోజుల క్రితం లాలాపేట బ్రిడ్జిపై వస్తూ ప్రమాదవశాత్తు తలకు గాయమైంది. పలు ఆస్పత్రులలో చికిత్సలు చేయించుకున్నాడు. అనంతరం గురువారం గాంధీ ఆస్పత్రిలో శ్వాసకోశా సమస్యల వల్ల చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్ను మూశారు. ఓయూలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిం చుకునే జాన్‌కుమార్ లేకపోవడంతో కుటుంబం రోడ్డు మీద పడే ప్రమాదం ఉందని, వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించి, ఆ కుటుంబాన్ని ఆదు కోవాలని ఓయూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) అధ్య క్షులు, టి.మహేం దర్ అన్నారు. గాంధీ ఆస్పత్రిలో జాన్ భౌతికాయాన్ని సంద ర్శించి, అంత్యక్రియల నిమిత్తం నగదు అందజేశారు. యూని యన్ జనరల్ సెక్రెటరీ సీతారాం,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు శ్రీను,నాగరాజు,నరేష్,సహాయ కార్యదర్శులు శివ, లక్ష్మణ్,రాజు,పాల్గొన్నారు.

ఈఎఫ్ఐ ఫౌండేషన్ సలహా బోర్డు మెంబర్‌గా కరుణ గోపాల్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



ఈఎఫ్ఐ ఫౌండేషన్ సలహా బోర్డు మెంబర్‌గా ప్రముఖ అంతర్జాతీయ థాట్ లీడర్ కరుణ గోపాల్ నియమితులయ్యారని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మిమి బింద్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భాశయపు లోపలి మ్యూకస్ పొరను ఎండోమెట్రియం అంటారని, ఇది మహిళల ఋతుచక్రంకు సంబంధించిందని ఆమె తెలిపారు. స్త్రీలలో 10శాతం మందికి ఉండే ఈ సమస్య గురించి ఇప్పటి వరకు పరిశోధనలు జరగలేదన్నారు. ఈ సమస్యపై డాక్టర్లకు అవగాహన లేదన్నారు.కీ నోట్ స్పీకర్, బీజేపీ జాతీయ మహిళా విధానాల పరిశోధనా ఇంచార్జ్ కరుణ గోపాల్ సేవలు తమ ఫౌండేషన్‌కు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఋతు సంబం ధమైన మహిళల సమస్యల పరిష్కారానికి ఆమె కృషి చేస్తారని మిమి బింద్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈఎఫ్ఐ అడ్వైజరీ బోర్డులో ఉండడం తనకు ఎంతో సంతోషకరమన్నా రు. ఈఎఫ్ఐపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని, నివారణకు పరిశోధనలను విస్తృతం చేసేందుకు తన ఆలోచనలను పంచుకుంటానని కరుణ గోపాల్ తెలిపారు.

ఫ్యాషన్ పొల్యూషన్ తగ్గించేందుకు



అమ్మ సమాజ నిర్మాత అంటారు. అది నిజం చేస్తున్న భారతీయ మహిళలు ఎందరో ఉన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటుగా ఆర్థికంగా కూడా కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. వృత్తి, ఉద్యోగ వ్యాపార రంగాలలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అటువంటి మహిళలలో ప్రియాంక తాయి ఒకరు. 'కుల స్టూడియో' పేరుతో ఓ సంస్థ స్థాపించి అమ్మలకు ఉపాధి కల్పిస్తున్నారు. బట్టల వ్యర్థాలతో కొత్త ఆవిష్కరణలు చేస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ప్రియాంక పుట్టింది హైదరాబాద్. అయితే పెరిగింది ముంబై, వృత్తి విద్యలను అభ్యసించింది బెంగళూరులో. ఈమె ఒక ఫ్యాషన్ డిజైనర్. 2008లో ఓ సంస్థలో అపారల్ డిజైనర్‌గా తన ప్రొఫెషన్‌ను మొదలుపెట్టారు. 2011 నాటికి 'కుల స్టుడియో' పేరిట సొంత సంస్థను స్థాపించే స్థితికి ఎదిగారు. ఒక బిడ్డగా, భారత నౌకాదళ ఉన్నతాధికారికి భార్యగా, ఇద్దరు ఆడపిల్లల తల్లిగా, కోడలిగా తన బాధ్యతలను నిర్వహిస్తూనే 'కుల స్టూడియో' క్రియేటివ్ డైరెక్టర్‌గా తన సంస్థ ఎదుగుదల కోసం కృషి చేస్తూ తన గమనాన్ని సాగిస్తున్నారు ప్రియాంక.





మిగిలిన సంస్థలకు భిన్నంగా

'కుల స్టుడియో' మిగిలిన అన్ని ఫ్యాషన్ సంస్థలకు భిన్నమైన ఆలోచనతో మొదలు పెట్టారు. ఆర్థికంగా సంపన్నమైన కుటుంబంలో జన్మించినా పొదుపుపై చక్కని అవగాహన ఉన్న వ్యక్తి ఈమె. ఏదీ వృథా కారాదు అన్న ఆలోచనతో 'కుల స్టూడియో' మొదలు పెట్టారు. వినూత్న ఆలోచనతో అభివృద్ధి చెందిన ఆ సంస్థ 2021లో టాప్ 40 స్టార్టప్స్‌లో స్థానం దక్కించుకుంది. ఇది తనకెంతో గర్వకారణం అంటారు ఆమె. 'మనం కట్టుకునే బట్టలు మన ఆలోచనకు, మన నమ్మకాలకు, మన ఇష్టాఇష్టాలకు సంబంధించిన విషయాలు ఎవరికి నచ్చిన విధంగా, వారి శరీరాకృతికి తగినట్టు, అందుకు అనుగుణంగా బట్టలు తయారు చేయించి ఇవ్వడం మా ప్రత్యేకం' అని నమ్మకంగా చెప్తున్నారు ప్రియాంక.

వాతావరణ కాలుష్యంతో పాటు

టెక్స్టైల్ మిల్స్‌లో మిగిలి వృధాగా పడి ఉన్న వస్త్రాలను, నచ్చినా కట్టుకోవడానికి వీలులేక ఇంట్లో అనవసరంగా పడి ఉన్న వస్త్రాల నుండి ఆధునిక డిజైనర్, సాంప్రదాయ దుస్తులను తయారు చేయడం కుల స్టూడియో ఉద్దేశం. ఫ్యాషన్ పొల్యూషన్‌ను తగ్గించి బట్ట లైఫ్‌ను పెంచడం తన లక్ష్యంగా పెట్టుకున్నారు ఆమె. 'ఇలా వ్యర్థ పదార్థాల వల్ల జరిగే వాతావరణ కాలుష్యంతో పాటు ఇతర నష్టాలను కూడా తగ్గించగలం. అందుకే వ్యాపారంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నాను. నా భర్త, సంస్థ సభ్యులు నాకు ఎంతో సహాయ సహకారాలు అందిసున్నారు. లేకపోతే ఈ ప్రయాణం ఇంతకాలం కొనసాగేది కాదు' అంటున్నారు.

ట్రెండ్ మారుతూ ఉంటుంది

'కోవిడ్-19 వంటివి మనం ఇంతకు ముందు ఊహించలేని విధంగా సమాజాన్ని ప్రభావితం చేయగలవు. కాబట్టి ఇప్పటి నుండి 100 ఏండ్ల వరకు ఫ్యాషన్ అనేది మనం అంచనా వేసిన దానికంటే పూర్తి భిన్నంగా ఉండవచ్చు. మాస్కులు ధరించడం తప్పనిసరి అవుతుందని, అది ప్రపంచ వ్యాప్తంగా ప్రజల వార్డ్‌రోబ్ లలో ప్రధానమైనదిగా మారిపోతుందని ఎవరూ ఊహించలేదు. అయితే భవిష్యత్తులో మన దుస్తులు ఎలా ఉంటాయో మనం ఊహించగలం. దుస్తులు ధరించడంలో సాంకేతికత కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందని మనకు తెలుసు. ట్రెండ్‌లు నిరంతరం మారుతూ ఉంటాయి. సాంకేతికత పెరుగుతూనే ఉంటుంది. ఫ్యాషన్ పరిశ్రమ దుస్తులతో ప్రత్యేకమైన, బోల్డ్, టెక్-ఆధారిత ప్రభావాన్ని చూపుతుంది. గత పదేండ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా మహిళల శ్రామికశక్తి వేగంతో పెరుగుతోందని డేటా చెబుతోంది. ఆన్‌లైన్ వ్యాపారాలు చేస్తున్న మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అలాగే నిర్ణయాలు తీసుకునే విషయంలో కూడా స్వతంత్రంగా ఉంటున్నారు' అంటున్నారు ఆమె.

మహిళలకు అవగాహన ఎక్కువ

'స్త్రీలు స్వతహాగా నాయకులు. సామాజిక స్పృహ, విషయాల పట్ల అవగాహన రెట్టింపు వుంటుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మహిళా నాయకత్వం సంస్థలపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని నిరూపించబడింది. మహిళా నాయకత్వం ఉన్న కంపెనీలు లాభదాయకంగా, కొత్త ఆవిష్కరణలతో అభివృద్ధి చెందుతున్నాయి. టెక్నాలజీ సహకారంతో ఎక్కువ మంది మహిళలు ఫ్యాషన్ పరిశ్రమలో వ్యవస్థాపకలుగా అడుగులు వేస్తున్నారు. అందుకే ఫ్యాషన్ ఆవిష్కరణకు సాంకేతికత సాయంతో పనిచేసే మహిళలపై మనం శ్రద్ధ వహించాలి. చాలా మంది మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నేను చేసినట్టుగా మహిళా కస్టమర్ కోసం ఫ్యాషన్, టెక్నాలజీని మిళితం చేసే కొత్త వ్యవస్థాపక భావనలను రూపొందిస్తున్నారు' అంటూ ప్రియాంక తన అనుభవాలను పంచుకుంటున్నారు.

- బి. లావణ్య,
8184897897

అమ్మలకే ప్రాధాన్యం

ఎంత మంచి ఆలోచన అయినా ఈ వ్యాపారంలో అతి తక్కువ మంది మాత్రమే ఉన్నారు. దాంతో ఇన్వెస్టర్ల నమ్మకం సంపాదించడం, ఫండ్స్ ఏర్పాటు చేసుకోవడం ప్రియాంకకు మొదట్లో చాలా కష్టమయింది. ఎంతో ఓపికతో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు తన కుల స్టూడియో ద్వారా ఎంతో మంది మహిళలకు చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా తల్లులు అయిన తర్వాత తిరిగి ఉద్యోగం ప్రారంభించాలనుకుంటున్న మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ విధంగా మహిళా సాధికారతకు తన వంతు కృషి చేస్తున్నారు. అంతేకాదు సంస్థలో పని చేసే మహిళలకు తమకు అనుకూలమైన సమయంలో పని చేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. అలాగే మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక రెస్ట్ రూములు, వాళ్ళ పిల్లలకు క్రెచ్ కూడా ఏర్పాటు చేసి వారికి అన్ని సదుపాయాలను సమకూరుస్తున్నారు.

పాలిచ్చే తల్లులు కొన్ని ఆహారాలకు దూరంగా ఉండటం ఎంత ముఖ్యమో, కొన్ని తినడం కూడా అంతే ముఖ్యం. అందులో చెప్పకోవలసినది పైనాపిల్. ఇందులో చాలా ముఖ్యమైన పోషకాలు, డైటరీ ఫైబర్ బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఉంటాయి, ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి. ఈ పోషకాలలో చాలా వరకు తల్లి పాలలోకి వెళ్లి బిడ్డకు మేలు చేస్తాయి. ఇది హైడ్రేటింగ్ ఫ్రూట్ కూడా. పైనాపిల్ ఆమ్లంగా ఉంటుంది. సిట్రస్ కలిగి ఉండే ఆమ్ల పండ్లు శిశువు ఆరోగ్యానికి ఏ విధంగా సహాయపడతాయో చూద్దాం...



పాలిచ్చే తల్లులకు ప్రయోజనాలిచ్చే పైనాపిల్

పోషకాలు

పైనాపిల్‌లో విటమిన్ సి, పొటాషియం, ఫోలేట్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి పాలిచ్చే తల్లులకు మేలు చేస్తాయి. తల్లి పాల ద్వారా చిన్న మొత్తంలో కొన్ని విటమిన్లు, పోషకాలు బిడ్డకు అందుతాయి. కాబట్టి పోషకాల పరంగా పైనాపిల్ బెస్ట్.

డైటరీ ఫైబర్

పాలిచ్చే తల్లికి రోజుకు 34 గ్రాముల ఫైబర్ అవసరం. పైనాపిల్ ఫైబర్-రిచ్ ఫుడ్. చాలా మంది తల్లులు డెలివరీ తర్వాత మలబద్ధక సమస్యతో ఇబ్బంది పడతారు. కాబట్టి, పైనాపిల్ వారికి మంచి ఉపశమనం.

హైడ్రేషన్...

165 గ్రాముల పైనాపిల్ సుమారు 142 గ్రాముల నీటిని అందిస్తుంది. పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తిని పెంచడానికి నీరు అవసరం కాబట్టి, ఆహారంలో పైనాపిల్‌ను చేర్చుకోవడం మంచిది. నీటితో పాటు, పైనాపిల్ ప్రసవానంతర సమస్యలను పరిష్కరిస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలకు కూడా సహాయపడుతుంది.

కానీ పైనాపిల్‌తో సహా ఏదైనా ఆహారం తిన్న తర్వాత పాలిచ్చే తల్లులు బిడ్డపై అవి ఏ విధంగా ప్రభావం చూపుతాయో గమనించుకుంటూ ఉండాలి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే అటువంటి ఆహారానికి కొన్ని రోజుల పాటు దూరంగా ఉండటం ఉత్తమం.





ఇట్ల చేద్దాం

కిచెన్ క్యాబినెట్‌పై, హ్యాండిల్స్ దగ్గర జిడ్డు ఎంత శుభ్రం చేసినా ఎంతోకొంత పేరుకుపోయి ఉంటుంది. ఈ జిడ్డు పూర్తిగా వదలాలంటే బేకింగ్ సోడా తీసుకుని అందులో కొంచెం హైడ్రోజన్ పెరాక్సైడ్ వేసి శుభ్రం చేయాలి. ఇలా చేస్తే జిడ్డంతా వదిలి కొత్తదానిలా మెరిసిపోతుంది.

జమిలి ఎన్నికలు కష్టమే నిర్వహణకు అడ్డంకులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గత కొద్ది కాలంగా జమిలి ఎన్నికలపై దేశ వ్యాప్తంగా రకరకాలైన చర్చలు, ఊహాగానాలు నడుస్తున్న నేపథ్యంలో బుధవారం రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జమిలి ఎన్నికలు ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించడం కష్టమని అన్నారు. "ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అంత ఈజీ కాదు. ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల అనేక లాభాలు ఉన్నప్పటికీ అందుకు అనేక కీలక అవరోధాలు, అడ్డంకులు కూడా ఉన్నాయి. కనీసం ఐదు కీలక రాజ్యాంగ సవరణలు చేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలో పార్లమెంట్ ఉభయ సభల వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83, లోక్‌సభ రద్దు చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారాలకు సంబంధించిన ఆర్టికల్ 85, రాష్ట్ర శాసన సభల కాల వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172, రాష్ట్రాల శాసన సభలు రద్దు సంబంధించిన ఆర్టికల్ 174, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి సంబంధించిన ఆర్టికల్ 356ను సవరించాల్సి ఉంది. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయాన్ని పొందడం.

పాలనా వ్యవస్థలో ముఖ్యమైన సమాఖ్య నిర్మాణానికి సంబంధించి, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఏకాభిప్రాయం కూడా పొందడం అత్యవసరం. పెద్ద ఎత్తున అదనపు ఈవీఎంలు, వీవీప్యాట్ యం త్రాలు అవసరం. అందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. అయితే ఆ ఈవిఎంలు, వివిప్యాట్ యంత్రాలు 15 ఏండ్ల కంటే ఎక్కువ పనిచేయవు. ప్రతి 15 ఏండ్లకు ఒకసారి అంత పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయాలి. అంతా భారీ స్థాయిలో ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను కేవలం మూడు, నాలుగు సార్లు మాత్రమే ఉపయోగి ంచగలం. అదనంగా పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు అవసరం" అని తెలిపారు. "ఒకేసారి ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కేంద్ర సిబ్బంది, న్యాయ శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలన చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సహా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపింది. తదుపరి రోడ్ మ్యాప్ రూపకల్పన అంశం ప్రస్తుతం లా కమిషన్ పరిశీలనలో ఉంది" అని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు.

స్టాండింగ్ కమిటీ నుండి ప్రతిపక్షాల వాకౌట్

(మొదటిపేజీ తరువాయి)

ముందు బిల్లు ప్రతిని తమకు అందజేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశం నుంచి వాకౌట్ చేసిన వారిలో సీపీఐ (ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, టీఎంసీ ఎంపీలు మహువా మొయిత్రా, జవహర్ సిర్కార్, డీఎంకే ఎంపీ టి సుమతి, కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, టీడీపీ ఎంపీ జయదేవ్ గల్లా ఉన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఇచ్చిన నివేదికను బీజేపీ ఎంపీలు సరిగా పరిశీలించకుండానే ఆమోదించారని ప్రతిపక్ష ఎంపీలు తెలిపారు. సమావేశానికి కేవలం ఒక రోజు ముందే ముసాయిదా నివేదికను తమకు అందజేశారని, బిల్లును అధ్యయనం చేయడానికి తగినంత సమయం లభించలేదని చెప్పారు.

అయితే బిల్లులోని నిబంధనలపై కమిటీ ఇప్పటికే చర్చించిందని బీజేపీ ఎంపీలు పేర్కొన్నారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రతిపక్షాల ఆందోళన రాజకీయపరమైనది కాదనీ, ప్రభుత్వ తప్పుడు చర్యల గురించేనని అన్నారు. "మా వాదనలో వాస్తవాలను పట్టించుకోకుండా అధికార పార్టీ సభ్యులు ఓటింగ్ కోసం ఎందుకు పట్టుబడుతున్నారో అర్థం కావటం లేదు" అని బ్రిట్టాస్ చెప్పారు. ఈ సందర్భంగా తన అసమ్మతి నోట్‌ను కూడా కమిటీకి సమర్పించారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే మాట్లాడుతూ మెజార్టీ ఉంటే ఆమోదం పొందవచ్చునని అన్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుకు ఇటీవలే కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దీనిని ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

'ఇండియా వర్సెస్ మోడీ'

- పార్లమెంట్‌లో నినాదాల హోరు
- ఉభయ సభలు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంటును మణిపూర్ అంశం కుదిపేస్తోంది. మోడీ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు కూడా గురువారం నల్ల దుస్తులతో పార్లమెంటుకు హాజరై నిరసన తెలిపారు. మణిపూర్‌పై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడాల్సిందేనని పట్టుపట్టారు. హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన ఉభయ సభల్లోనూ కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతుండగానే కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రధాని మోడీ విదేశీ పర్యటనపై ప్రకటన చేశారు.

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టేందుకు ప్రయత్నించారు. మణిపూర్ అంశంపై ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేశారు. మోడీ మౌనాన్ని వీడి నోరు విప్పాలని నినాదాలు చేస్తుంటే బీజేపీ సభ్యులు ప్రతిగా 'మోడీ...మోడీ' అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రారంభమైన ఆరు నిమిషాల వ్యవధిలోనే స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. గందరగోళం మధ్యే బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఖనిజాల చట్టానికి సవరణ బిల్లును, వినియోగ వ్యవహారాల మంత్రి పీయుష్ గోయల్ జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభ సాయంత్రం మూడు గంటల వరకూ వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు 'మాకు న్యాయం కావాలి' అంటూ నినాదాలతో హెూరెత్తించారు. జన్ విశ్వాస్ బిల్లుపై బీజేపీ ఎంపీలు రాజేంద్ర అగర్వల్, వైసీపీ ఎంపీ భీశెట్టి సత్యవతి, బీఎస్పీ ఎంపీ మలూక్ నగర్ మాట్లాడిన తరువాత మూజువాణీ ఓటుతో ఆమోదించారు. అనంతరం సభ శుక్రవారం నాటికి వాయిదా పడింది.

రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

రాజ్యసభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేశారు. తొలుత సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ప్రయత్నించగా అధికార పక్ష సభ్యులు అడ్డుకున్నారు. దీనిని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొని, మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సినిమాటోగ్రఫీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేంద్రం మంత్రి చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. సినిమాటోగ్రఫీ బిల్లుపై బీజేడీ, బీజేపీ, అన్నా డీఎంకే, వైసీపీ, టీడీపీ, టీఎంసీ (ఎం) సభ్యులతో పాటు కేంద్ర మంత్రి రాందాస్ అథావలే మాట్లాడారు. బిల్లు మూజువాణీ ఓటుతో ఆమోదం పొందిన తర్వాత సభ శుక్రవారం నాటికి వాయిదా పడింది.

నినాదాల హోరు

మణిపూర్ హింసపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు, దానికి ప్రతిగా బీజేపీ సభ్యులు రాజ్యసభలో పోటాపోటీగా నినాదాలు చేశారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సభలో ప్రసంగిస్తున్న సమయంలో గందరగోళం చోటుచేసుకుంది. ప్రతిపక్షాలు 'ఇండియా...ఇండియా' అంటూ ప్రధానిని విమర్శిస్తూ నినాదాలు చేయగా అధికార పక్ష సభ్యులు 'మోడీ...మోడీ' అంటూ ప్రతి నినాదాలు చేశారు.

మణిపూర్‌కు ప్రతిపక్ష ఎంపీలు

- 29,30 తేదీల్లో పర్యటన



మణిపూర్‌లో అల్లర్లు ప్రారంభమై దాదాపు 85 రోజులు కావస్తున్నా హింస మాత్రం ఆగడం లేదు. దీనిపై ప్రధాని మోడీ మాట్లాడడం కానీ, ఆ రాష్ట్రంలో పర్యటించడం కానీ జరగలేదు. దీంతో ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు మణిపూర్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఈ నెల 29, 30 తేదీల్లో మణిపూర్‌లో ప్రతిపక్ష ఎంపీలు పర్యటించనున్నారు.

మూడేండ్లలో 20 సార్లు పెరిగిన గ్యాస్ ధర

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మూడేండ్లలో వంట గ్యాస్ ధర 20 సార్లు పెరిగింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 14.2 కేజీల వంట గ్యాస్ సిలిండర్ ధర 2020 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 1 వరకు మొత్తం 20 సార్లు పెరిగిందని తెలిపారు. 2020 ఏప్రిల్ 1న వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.714.5 ఉండగా, 2023 మార్చి 1 నాటికి రూ.1,102.50కి పెరిగిందని తెలిపారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 33,979 మంది విద్యార్థులు డ్రాపౌట్

ఐదేండ్లలో కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 33,979 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయినట్టు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. రాజ్యసభలో ఆయన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2019 నుంచి 2023 వరకు ఐదేళ్లలో దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో 17,454 మంది, ఐఐటిల్లో 8,139 మంది, ఎన్ఐటీల్లో 5,623 మంది, ఐఐఎస్ఈఆర్‌ల్లో 1,046 మంది, ఐఐఎంల్లో 858 మంది, ట్రిపుల్ ఐటీల్లో 803 మంది, ఎస్‌పీఏల్లో 56 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయినట్టు తెలిపారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీ

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జులై 20 నాటికి దేశంలోని కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 32 వేల పోస్టుల ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సెంట్రల్ యూనివర్సిటీల్లో 21,215 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీ

సెంట్రల్ యూనివర్సిటీల్లో 21,215 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 ఏప్రిల్ 1 నాటికి సెంట్రల్ యూనివర్శిటీల్లో 5,825 టీచింగ్, 15,390 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంలో 9,64,354 పోస్టులు ఖాళీ

కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, డిపార్టమెంట్‌ల్లో 9,64,354 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022 మార్చి 31 నాటికి మంత్రిత్వ శాఖలు, డిపార్టమెంట్‌ల్లో గ్రేడ్ ఎ పోస్టులు 30,606, గ్రేడ్ బి పోస్టులు 1,11,814, గ్రేడ్ సి పోస్టులు 8,21,934 ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల ప్రాణనష్టంతోపాటు, మూగ జీవాలు చనిపోయాయని వివరించారు. లోతట్టు కాలనీల ఇండ్లలోకి వరదనీరు చేరడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయంతో ప్రజలు వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని తెలిపారు. వరంగల్,భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, హైదరాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. ఇంకా అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరద ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలు, శ్రేణులకు ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రేకుల షెడ్లు, గుడిసెలు, పాకల్లో జీవిస్తున్న పేదలు నిరాశ్రయులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. పంట పొలాలు, రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని వివరించారు. వాటి వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. వాటిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వరదల వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణ, ఆస్తినష్టాలను అంచనావేసి నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో హెల్త్ డేటా

- సమాచారం ఉల్లంఘనలకు,సైబర్ దాడులకు గురయ్యే అవకాశం
- నిపుణులు, సామాజిక కార్యకర్తల హెచ్చరిక

న్యూఢిల్లీ : భారత్‌లోని ప్రజల ఆరోగ్య సమాచారం భద్రతపై నిపుణులు సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదమున్నదని వారు హెచ్చరించారు. సైబర్ దాడులకూ గురయ్యే అవకాశమున్నదని చెప్పారు. గతేడాది భారత్‌లో కోవిన్ వ్యాక్సిన్ పోర్టల్ నుంచి డేటా ఉల్లంఘనలపై వచ్చిన నివేదికలను ఈ సందర్భంగా వారు ఉటంకించారు. అయితే, కోవిన్ డేటా దుర్వినియోగం కాలేదని అధికారులు ఆ సమయంలో చెప్పారు. అయితే, గత నెలలో టెలిగ్రామ్ యాప్ ద్వారా కోవిన్ డేటా భారీ లీక్‌కు సంబంధించి ఒక ముఖ్య అధికారి వ్యక్తిగత సమాచారమే బహిర్గతం కావటం గమనార్హం. అయితే, ఈ లీక్ జరగలేదని, సమాచారం దుర్వినియోగం కాలేదని అధికారులు ఆ సమయంలో అధికారులు ఖండించారు. అధికారి సమారం బహిర్గతమైన తర్వాతి రోజే ఈ ఘటనతో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారని విశ్లేషకులు గుర్తు చేశారు. ప్రజల పేర్లు, ఆధార్ కార్డు సమాచారం, మొబైల్ నెంబర్లు, ఓటర్ ఐడీలు, పాస్‌పోర్టులు, లక్షలాది మంది ప్రజల కోవిడ్ వ్యాక్సినేషన్ స్థితి డేటా లీక్ భారత్‌లోని అతిపెద్ద సమాచార తస్కరణ అని నిపుణులు అభిప్రాయపడ్డారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలు కనీస స్థాయికి పెంచి, వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. గ్రామ పంచాయితీ కార్మికులు 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. వారికి నెలకు రూ.8,500మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. పారిశుధ్య కార్మికులకు రూ.16,500, ఆ పైన పని చేసే వారికి రూ. 19,000లు, మాత్రమేవేతనాలుగా చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ వేతనాలను అమలు చేసినా వారికి సంవత్సరానికి వచ్చేది రూ.1,98,000 మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,17,000 లుగా ఉన్నదంటూ అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వ పెద్దలు అనేక పర్యాయాలు ప్రస్తావించారని గుర్తు చేశారు. గ్రామ పంచాయితీ కార్మికుల కుటుంబాల్లో కనీసం నలుగురు సభ్యులుంటారని తెలిపారు. ఆ లెక్కన తలసరి ఆదాయం ప్రకారం ఆ కుటుంబం వాటా రూ.12,68,000లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కుటుంబ ఆదాయం తెలంగాణ తలసరి ఆదాయం (రూ.3,17,000) సమానంగా అయినా ఉండాలి కదా? పేర్కొన్నారు. అయినప్పటికీ వారు ఏడాదికి రెండు లక్షలు ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారని గుర్తుచేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలను పెంచి వారి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థలకు నేడు సెలవు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు శుక్రవారం ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అందుకు సంబంధించి తక్షణమే ఉత్తర్వులను జారీ చేయాలంటూ విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు విద్యాసంస్థలకు శుక్రవారం సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులను జారీ చేశారు. ఈనెల 20 నుంచి వరుసగా మూడు రోజులపాటు రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. సోమ, మంగళవారం మాత్రమే విద్యాసంస్థల్లో తరగతులను నిర్వహించారు. ఇప్పుడు మళ్లీ బుధవారం నుంచి శుక్రవారం వరకు సెలవులు ప్రకటించింది. శనివారం మొహర్రం సందర్భంగా సాధారణ సెలవు, రేపు ఆదివారం. దీంతో సోమవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకుంటాయి.



ముంచెత్తుతోంది..

(మొదటిపేజీ తరువాయి)

ముత్యందార జలపాతం సందర్శన కోసం వెళ్లిన 80 మందిని కాపాడారు. వెంకటాపూర్‌లో 24 గంటల్లో 65 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి-పరకాల ప్రధాన రహదారిపై మొరంచపల్లి వాగు సుమారు 15 అడుగుల ఎత్తులో ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం జలదిగ్బంధమైంది. సీఎం ఆదేశాలతో ప్రమాదంలో ఉన్నవారిని హెలికాప్టర్ ద్వారా తరలించారు. వర్షాలపై సీఎం అధికారులతో సమీక్ష జరిపారు. ఆయా జిల్లాలకు ప్రత్యేక అధి కారులను నియమిస్తూ సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు.

సురక్షిత ప్రాంతాలకు విద్యార్థులు

- కరీంనగర్ శివారులోని రేకూర్తి గురుకుల హాస్టల్, సైదాపూర్ మండలం మోడల్‌స్కూల్, రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ కస్తూరిబా పాఠశాల భవనాలు జలదిగ్బంధం కావడంతో పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉమ్మడి కరీంనగర్‌లోని నాలుగు జిల్లాల కలెక్టర్లు ట్రోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నారు.

గన్నేరువరం మండల కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుతో కరీంనగర్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రంగి మండల కేంద్రంలో వేములవాడ కోరుట్ల వెళ్లే రహదారిపై నందివాగు ప్రవాహంతో మండల కేంద్రానికి దారులు మూసుకుపోయాయి. వీర్నపల్లి మండలంలో వాగులు పొంగిపొర్లుతుండటంతో 16 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. జగిత్యాల జిలా వెల్గటూర్ మండల పరిధిలోని వెల్గటూర్ - రాజక్కపల్లి గ్రామాల మధ్య ఉన్న పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మెగా కంపెనీకి చెందిన ట్యాంకర్ వాగులో చిక్కుకుంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శివారు కాలనీల వారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

తెరుచుకున్న శ్రీరాంసాగర్, నిజాంసాగర్

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. పలు చెరువులకు గండ్లు పడ్డాయి. ఇండ్లు కూలాయి. నందిపేట్ మండలంలో చేపలవేటకు వెళ్లి ఒకరు గల్లంతయ్యారు.



నిజామాబాద్ జిల్లాల్లో 14 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ మహారాష్ట్ర నుంచి భారీగా వరద వస్తుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా నదులుతో పాటు గ్రామాల సమీపంలోని వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. తలమడుగు మండలం కోడద్- హస్నాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు గ్రామాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోథ్ మండలం ధనోర(బి) గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో ఆ గ్రామం జలదిగ్బంధనంలో చిక్కుక్కుంది. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ త్రివేణి సంగమం చెరువు మత్తడి పోయడంతో ఆదిలాబాద్-ఉట్నూర్ ప్రధాన రహదారి తెగిపోయింది. మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ చెర్వులో నీట మునిగి నర్సింహులు అనే యువకుడు చనిపోయాడు. పెద్దశంకరంపేటలో స్కూల్ భవనం కూలింది.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత




ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 7.32లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. అదేస్థాయిలో ప్రాజెక్టు 38గేట్లు ఎత్తి దిగువకు 6.69లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మానేరు నదిపై ఉన్న అప్పర్‌మానేరు డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి అలుగుదూకుతోంది. మధ్యమానేరు ప్రాజెక్టులోకి 26,700 క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువమానేరు ప్రాజెక్టులోకి మోయ తుమ్మెద నుంచి వరద వస్తుండటంతో ఒక్కరోజులోనే నిండుకుండలా మారింది.

యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలకేంద్రంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సిల్క్‌నగర్, పెద్దమ్మవాడ, బీసీకాలనీల్లో నీళ్ల చేరాయి. ఈదులవాగు, రత్నాల వాగు, పర్రెకాలువలు పొంగిపొర్లుతున్నాయి. కొలనుపాక గ్రామ సమీపంలో ఉన్న పితమరం వాగు ప్రవాహంతో సిద్దిపేటకు రాకపోకలు బంద్ అయ్యాయి. కేజీబీవీ పాఠశాలను వరదనీరు చుట్టుముట్టడంతో పిల్లలను ఇంటికి పంపించారు. నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు 8 గేట్లను ఎత్తారు.

ప్రాణనష్టం జరగకుండా చూడండి: కేటీఆర్

హుస్సేన్‌సాగర్ వద్ద వరద ఉధృతి పరిశీలన

మరో రెండు గేట్ల ద్వారా జంట జలాశయాల నీరు విడుదల



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. అన్ని పట్టణాల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వర్షాలను కూడా రాజకీయం చేయడం సరికాదని, చేతనైతే సహాయక చర్యల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు మంత్రి సూచించారు. గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్ తదితర అధికారులతో కలిసి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ వరద పరిస్థితిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వర్షకాలం ప్రారంభానికి ముందే నాలాల్లో పూడిక తీశామని చెప్పారు. చెరువుల్లోనూ తక్కువ నీటిమట్టం ఉండేలా జాగ్రత్తలు తీసుకు న్నామని తెలిపారు. ఈసారి నాలా డెవలప్ మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వల్ల వరద ప్రభావం కొంత తగ్గిందన్నారు. భారీ వర్షా లపై ముఖ్యమంత్రి ఎప్పటి కప్పుడూ సమీక్షిస్తున్నారని, శిథిల భవ నాల నుంచి జనాలను వెంటనే తరలిం చాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డుతో పాటు ఇతర శాఖల ఉన్నతాధి కారులతోపాటు క్షేత్రస్థా యిలో సిబ్బంది వరకు అందరూ పనిచేస్తు న్నారన్నారు. వర్షంతో నగ రంలో ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవు తున్నదని, వర్షాలు తగ్గాక కబ్జాలపై దృష్టిసారిస్తా మన్నారు. అవసరమైతే వాటిని కూల్చేస్తామని తెలిపారు.

భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా ప్రతిపక్షాలు చిల్లర విమర్శలు చేయొద్దని సూచించారు. ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తూ తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో 14 బ్రిడ్జిలు మంజూరు చేశామన్నారు. ముసారంబాగ్ వద్ద మూసీనదిపై ఉన్న బ్రిడ్జిని కేటీఆర్ పరిశీలించారు. బ్రిడ్జి వద్ద ప్రవాహం పెరిగినా.. ప్రస్తుతం ప్రమాదం ఏమీ లేదన్నారు. మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలావుండగా వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని, అవసరమైతే శుక్రవారం తాను కూడా వెళ్తానని కేటీఆర్ తెలిపారు.

జీహెచ్‌ఎంసీ పూర్తిస్థాయిలో సంసిద్ధం: తలసాని

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డితో కలిసి మంత్రి జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎస్‌ఎన్‌డీపీ కార్యక్రమం కింద 36 నాలాల అభివృద్ధి పనులు చేపట్టగా, 30 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 6 పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. ప్రజలు అత్యవసర సేవలకు జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్ (040-21111111, 9000113667)కు కాల్ చేయాలని కోరారు. హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోపై ఎప్పటికప్పుడూ అధికారులు పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్టు వివరించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 455 టీంలు పని చేస్తున్నాయని చెప్పారు.

వరద బాధిత జిల్లాలకు స్పెషల్ అధికారుల నియామకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు వరద బాధిత జిల్లాలకు ఐఏఎస్ అధికారులను స్పెషలాఫీసర్లుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నియమించారు. ఈ మేరకు గురువారం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

- ములుగు జిల్లా - కృష్ణ ఆదిత్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సభ్య కార్యదర్శి
- భూపాల పల్లి - పి గౌతమ్, సెర్ప్ సీఈఓ
- నిర్మల్ - ముషారఫ్ అలీ, ఎక్సయిజ్ శాఖ, కమిషనర్
- మంచిర్యాల - భారతి హెూలికేరి, మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్పెషల్ సెక్రెటరీ
- పెద్దపల్లి - సంగీత సత్యనారాయణ
- అసిఫాబాద్ - హన్మంత రావు, పంచాయితీరాజ్ శాఖ కమిషనర్


చిరంజీవి

కిడ్నాప్‌ల సూత్రధారి ఎవరు?

చిరంజీవి తాజాగా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను గురువారం రామ్ చరణ్ లాంచ్ చేశారు.

కోల్‌కతాలో చాలా మంది యువతులు కిడ్నాప్ అవుతారు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, కిడ్నాప్‌ల వెనుక ఉన్న సూత్రధారిని పోలీసులు కనుగొనలేకపోతారు. అప్పుడు భోళా శంకర్.. నేరస్థుడిని పట్టుకోవడానికి, అమ్మాయిలను రక్షించడానికి వస్తాడు. సీరియస్‌గా ప్రారంభమైన కథనం ఒకదాని తర్వాత ఒక ప్రధాన పాత్రల ప్రవేశంతో వినోదాత్మకంగా మారుతుంది. చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించి తన మాస్ పవర్‌ను మరోసారి చూపించారు. యాక్షన్‌తో పాటు వినోదాత్మక సన్నివేశాలలో కూడా ఎక్స్‌ట్రార్డినరిగా ఉన్నారు. తమన్నా లాయర్‌గా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్‌గా, సుశాంత్ ఆమె బాయ్ ఫ్రెండ్‌గా కనిపించారు. వెన్నెల కిషోర్ భోళా సీనియర్‌గా కనిపించడం నవ్వులు పూయించింది. ట్రైలర్‌లో సూచించినట్లుగా ఇదొక ఒక మెగా-మాస్ యాక్షన్ ఎంటర్టైనర్. ఈ సినిమా మాస్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ని కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు దర్శకుడు మెహర్ రమేష్. డడ్లీ సినిమాటోగ్రఫీ అత్యున్నతంగా ఉంది. మహతి స్వర సాగర్ తన సంగీతంతో విజువల్స్‌ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లారు. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. నిర్మాణ ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్ డైలాగ్స్: తిరుపతి మామిడాల, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్.

నవచిత్రం

వరుణ్‌తేజ్ మట్కా మొదలైంది

వరుణ్ తేజ్ తన 14వ చిత్రాన్ని 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో చేస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'మట్కా' టైటిల్‌తో ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో టీమ్, పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో గ్రాండ్‌గా ఆరంభమైంది. సురేష్ బాబు, చిత్ర నిర్మాతలు ప్రొసీడింగ్స్ ప్రారంభించేందుకు దర్శకుడికి స్క్రిప్టును అందజేశారు. ముహూర్తం షాట్‌కు దర్శకుడు మారుతి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దిల్ రాజు గౌరవ దర్శకత్వం వహించారు.


విజయేందర్ రెడ్డి, మీనాక్షి చౌదరి, వరుణ్‌తేజ్, సి.వి.మోహన్, కరుణ కుమార్

టైటిల్ పోస్టర్‌ను హరీష్ శంకర్ లాంచ్ చేశారు. 'మట్కా'అనే ఆసక్తికరమైన టైటిల్, పోస్టర్ ప్రత్యేకంగా ఆకట్టుకునేలా డిజైన్ చేశారు. 'మట్కా' అనేది ఒకరకమైన జూదం. 1958-1982 మధ్య జరిగే ఈ కథ యావత్ దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్నారు. కథ వైజాగ్ నేపథ్యంలో జరుగుతుంది.1958 నుంచి 82 వరకు సాగే కథలో వరుణ్ తేజ్‌ని నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో చూడబోతున్నాం. వరుణ్ తేజ్‌కు జోడిగా నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి ఎంపికయ్యారు. ఈ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌లో నోరా ఫతేహి ఒక ప్రత్యేక పాటలో కూడా అలరించనున్నారు. నవీన్ చంద్ర, కన్నడ కిషోర్ ఇతర ముఖ్య తారాగణం.


ఊహించని ట్విస్టులతో సాగే సినిమా


సంపత్‌నంది, సందీప్ మాధవ్, క్యాథరిన్

'ఓదెల రైల్వే స్టేషన్' చిత్ర దర్శకుడు అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. క్యాథరిన్ హీరోయిన్‌గా, సందీప్ మాధవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్‌లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సంపత్ నంది క్లాప్ నివ్వగా, నిర్మాత సి.కల్యాణ్ స్విచ్చాన్ చేశారు. ప్రసన్నకుమార్, జెమిని కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,'నా 'ఓదెల రైల్వేస్టేషన్'కు పదిరెట్లు అద్భుతంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. 'స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా ఇది. సరికొత్త యాక్షన్ థ్రిల్లర్' అని హీరోయిన్ క్యాథరిన్ చెప్పారు. హీరో సందీప్ మాధవ్ మాట్లాడుతూ,'ఇందులోని ప్రతి సన్నివేశం, అలాగే ట్విస్టులు ఎవరూ ఊహించలేరు. ఇందులో పోలీస్‌ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నా' అని అన్నారు. చిత్ర సమర్పకుడు సోమ విజయప్రకాష్, నిర్మాతల్లో ఒకరైన పల్లి కేశవరావు మాట్లాడుతూ,' చిత్రీకరణ పూర్తయ్యే వరకు కంటిన్యూ షెడ్యూల్ ఉంటుంది. అందరి ఊహలకు భిన్నంగా ఉండే సినిమా ఇది' అని తెలిపారు.

సరికొత్త కాన్సెప్ట్

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించారు. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈనెల 29న రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా ఇందులో ముఖ్య పాత్ర పోషించిన బ్రహ్మాజీ మీడియాతో మాట్లాడుతూ, "మిస్టర్ ప్రెగ్నెంట్' సినిమా చిత్రీకరణ టైంలోనే నిర్మాత అప్పిరెడ్డి ఈ కథ, కాన్సెప్ట్ గురించి చెప్పారు. ఓ కొత్త దర్శకుడు కథ చెప్పాడు విని, సలహా చెప్పండి అని అన్నారు. కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. బాగుందని చెప్పాను. ఇందులో ఓల్డ్ సిటీలో ఉండే విడాకుల స్పెషలిస్ట్ లాయర్‌గా ఇందులో కనిపిస్తాను. ఉర్దూ, తెలుగు మిక్స్ చేసి మాట్లాడే క్యారెక్టర్. మా అబ్బాయి సంజయ్ డాగ్ లవర్ అవ్వడంతో కాన్సెప్ట్‌కు ఈజీగా కనెక్ట్ అయ్యాడు. 'పుష్ప' పార్ట్ 2 చిత్రీకరణ జరుగుతున్నప్పుడు బన్నీ మా ట్రైలర్‌ను చూసి ప్రశంసించారు. ఇందులో నాకు, సప్తగిరికి మధ్య ఉండే సీన్లు పోటాపోటీగా ఉంటాయి. జడ్జిగా ఫిష్ వెంకట్ కనిపించడం హైలెట్. దీనికి భీమ్స్ అదిరిపోయే సంగీతాన్ని ఇచ్చారు. మంచి మాస్, మెలోడీ పాటలు ఇచ్చారు. మ్యూజికల్ హిట్ అవుతుంది. ప్రస్తుతం 'గుంటూరు కారం', 'సలార్', 'భగవంత్ కేసరి', 'ఊరి పేరు భైరవకోన', నాగ శౌర్యతో ఓ సినిమా.. ఇలా చాలానే ఉన్నాయి' అని చెప్పారు.


బ్రహ్మాజీ

బస్తీ నేపథ్యంలో పేక మేడలు

'నా పేరు శివ', 'అందగారం' చిత్రాల ఫేం వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పేక మేడలు'. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రాకేశ్ వర్రే దీన్ని నిర్మిస్తున్నారు. బుధవారం ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వక్సేన్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రాకేశ్ యాక్టర్‌గా నటిస్తూనే నిర్మాతగా కూడా మారడం ఆనందంగా ఉంది. ఈ చిత్ర హీరో వినోద్ కళ్లతో నటిస్తాడు. ఈ సినిమా పోస్టర్స్, టీజర్ అద్భుతంగా ఉంది. మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నా' అని అన్నారు. 'ఈ 'పేక మేడలు' కథ నచ్చి నేను హీరోగా కాకుండా నిర్మాతగా ఈ సినిమా మొదలుపెట్టా. హైదరాబాద్‌లోని ఓ బస్తీలో సాగే కథ ఇది. ఈ చిత్రానికి వినోద్, అనూష యాప్ట్. వాళ్లిద్దరిమీదే సినిమా నడుస్తుంది. మంచి కమిట్‌మెంట్ ఉన్న హీరో విశ్వక్‌సేన్ చేతుల మీదుగా టీజర్ లాంచ్ అవ్వడం ఆనందంగా ఉంది' అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. దర్శకుడు నీలగిరి మాట్లాడుతూ,'అనీస్ కురువిళ్లా దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. అప్పుడే ఈ కథ నా మనసులో మెదిలింది. బస్తీ లైఫ్ ఎలా ఉంటుంది. అక్కడ ఎవరు పేక మేడలు కడతారు అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం చేశాం. ప్రతి ఒక్కరికీ జీవితంలో ఎదురయ్యే కథ ఇది. ఇలాంటి కథ బయటకు వెళ్తే బజ్ క్రియేట్ అవుతుందని నమ్మి చేశాం' అని తెలిపారు. ''ఈ చిత్రంలో నేను చేసిన పాత్ర ఎప్పటికీ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమా జర్నీ బ్యూటిఫుల్‌గా సాగింది' అని హీరో వినోద్ చెప్పారు. హీరోయిన్ అనుష మట్లాడుతూ,' ఇంత మంచి సినిమాలో అవకాశం రావడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఈ చిత్రానికి సహ నిర్మాత: వరుణ్ బోర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : కేతన్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: అనూష బోర, డి ఓ పి: హరిచరణ్.కె, సంగీతం: స్మరన్, ఎడిటర్: సృజన అడుసుమిల్లి - హంజా అలీ, స్క్రీన్ ప్లే : హంజా అలీ -శ్రీనివాస్ ఇట్టం-నీలగిరి మామిళ్ళ, డైలాగ్స్ - లిరిక్స్ : భార్గవ కార్తీక్.


హీరో విశ్వక్‌సేన్‌తో 'పేక మేడలు' చిత్ర బృందం

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఆకాశంతో పోటీ పడుతూ...

ఆసియా, ఆఫ్రికా దేశాలలో బియ్యం ధరలు పైపైకి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వ నిషేధమే కారణం

న్యూఢిల్లీ : దేశంలో పెరుగుతున్న ధరలను నియంత్రించే పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బియ్యం ఎగుమతులపై నిషేధం విధించడంతో ఆసియా, ఆఫ్రికా దేశాలలో దాని ధరలు ఆకాశంతో పోటీ పడుతూ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇప్పటికే వివిధ దేశాలలోని ఆహార మార్కెట్లు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. గోరుచుట్టుపై రోకటిపోటులా ఇప్పుడు భారత్ నుండి దిగుమతులు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రస్తుతానికి ధరలు పెరగడం అనివార్యమని, ఏ మేరకు పెరుగుతాయో చూడాల్సి ఉంటుందని థాయ్ బియ్యం ఎగుమతి దారుల సంఘం గౌరవాధ్యక్షుడు చూకియత్ ఆపస్‌వాంగ్సే చెప్పారు. ధరలు ఒక్కసారిగా పెరుగుతాయని, దశల వారీగా పెరగడం ఉండదని ఆయన తెలిపారు.

ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రజలకు బియ్యం ప్రధానమైన ఆహారం. దీని ధరలు పెరిగితే ద్రవ్యోల్బణ ఒత్తిడులు మరింత అధికమవుతాయి. కొనుగోలుదారుల దిగుమతి బిల్లులు తడిసిమోపెడవుతాయి. దేశంలో పెరుగుతున్న ధరలకు కళ్లెం వేసేందుకు బాసుమతి మినహా మిగిలిన బియ్యం రకాల ఎగుమతులపై భారత్ ఆంక్షలు విధించింది. అయితే ఎల్‌నినో కారణంగా వ్యవసాయ సరఫరాలపై పడుతున్న ప్రభావం, యూరప్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు ఆయా దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. భారతదేశం విధించిన నిషేధాన్ని ఈ పరిణామాల నేపథ్యంలో చూడాల్సిన అవసరం ఉన్నదని హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎమిరిటస్ పీటర్ టిమ్మర్ తెలిపారు. వీటితో పాటు ఆందోళన కలిగించే అనేక ఇతర అంశాలు కూడా ఉన్నాయని, వాటి కారణంగా ఆసియాలో బియ్యం ధరలు చాలా వేగంగా అదుపు తప్పుతాయని ఆయన హెచ్చరించారు.

అభ్యర్థనలు వస్తే...

ప్రస్తుతానికి ఇతర దేశాల నుండి అభ్యర్థనలు వస్తే వాటి ఆహార భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకొని బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు భారత్ అనుమతిస్తోంది. బాసుమతి బియ్యం, ఉడకబెట్టిన బియ్యం ఎగుమతులపై ఎలాంటి ఆంక్షలు లేవు. భారత్ నిషేధ ప్రభావం ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఏ మేరకు ఉంటుందన్న విషయం ఆంక్షల కాలపరిమితి పైన, ఆయా దేశాలు దౌత్య మార్గాల ద్వారా బియ్యం కొనుగోలుకు చేసుకునే ఏర్పాట్ల పైన ఆధారపడి ఉంటుంది.

ధరలు పెంచనున్న వియత్నాం, థాయ్



వియత్నాం నుంచి కూడా బియ్యం ఎగుమతులు అధికంగానే జరుగుతాయి. ఇప్పటికే ఆ దేశం టన్ను తెల్ల బియ్యాన్ని (5శాతం) 600 డాలర్లకు విక్రయిస్తోంది. థాయ్‌లాండ్ కూడా ధర పెంచే అవకాశం ఉంది. థాయ్ ప్రభుత్వం ప్రస్తుతం టన్ను బియ్యానికి 534 డాలర్లు వసూలు చేస్తోంది. భారత్ తీసుకున్న తాజా నిర్ణయంతో సుమారు 30 నుంచి 40శాతం వరకూ బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. వర్షపాతంలో అసమానతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఇతర ఆహార ధాన్యాల ఎగుమతులపై కూడా ఆంక్షలు విధించే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ విధించిన ఆంక్షలు చైనా, మలేసియా, ఫిలిప్పీన్స్, ఇండొనేషియా, ఆఫ్రికా దేశాలకు బియ్యం రవాణాపై ప్రభావం చూపుతాయి.

ఇథనాల్ తయారీ కోసం ఎఫ్‌సీఐ బియ్యం

- రాష్ట్రాలకు బియ్యం అమ్మకాలపై నిషేధం

బహిరంగ మార్కెట్‌లో ఎఫ్‌సీఐ నుంచి రాష్ట్రాలకు బియ్యం అమ్మకాలపై నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం, ఇథనాల్‌ను ఉత్పత్తి చేసే డిస్టిలరీలకు మాత్రం సరఫరాలు పెంచింది. జూన్‌లో ఇథనాల్ తయారీ కోసం 2.77 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. మూడేండ్ల కంటే తక్కువ వ్యవధిలోనే డిస్టిలరీలకు మొత్తం 24 లక్షల టన్నుల బియ్యాన్ని విక్రయించారు. ఎఫ్‌సీఐ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం జూన్‌లో డిస్టిలరీలకు 2,77,419.98 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయగా గత సంవత్సరం అదే నెలలో సరఫరా చేసింది కేవలం 87,778.81 మెట్రిక్ టన్నులు మాత్రమే. అంటే గత సంవత్సరంతో పోలిస్తే ఏకంగా 216% వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మేలో ఇథనాల్ ఉత్పత్తి కోసం 2.95 లక్షల టన్నుల బియ్యం విక్రయించారు.

2020-21 నుండి ఎఫ్‌సీఐ తన వద్ద ఉన్న బియ్యం మిగులు నిల్వలను ఇథనాల్ ఉత్పత్తి కోసం డిస్టిలరీలకు విక్రయిస్తోంది. ఇటీవలి కాలంలో సరఫరాలు గణనీయంగా పెరిగాయి. 2022-23 ఇథనాల్ సంవత్సరంలో 32 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని విక్రయించాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకోవడంతో రాబోయే కాలంలో సరఫరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. డిసెంబర్ 1 - తదుపరి సంవత్సరం నవంబర్ 31 మధ్య ఉన్న కాలాన్ని ఇథనాల్ సంవత్సరంగా వ్యవహరిస్తారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం బహిరంగ మార్కెట్ అమ్మకాల పథకం కింద ఎఫ్‌సీఐ బియ్యాన్ని క్వింటాలుకు రూ.2,250 చొప్పున డిస్టిలరీలకు విక్రయించాలని 2020 మార్చిలో కేంద్రం నిర్ణయించింది. అదే సంవత్సరం డిసెంబర్‌లో రేటును రూ.2,000కు తగ్గించింది. అప్పటి నుండీ అదే ధరకు సరఫరా చేస్తోంది.

సేకరణ, నిల్వ ఖర్చులతో పోలిస్తే ఇథనాల్ కోసం అమ్మే బియ్యం ధర చాలా తక్కువగానే ఉంటోంది. 2020 నుండి బియ్యం విక్రయాల ద్వారా ఎఫ్‌సీఐకి రూ.4,844 కోట్ల ఆదాయం లభించింది. బహిరంగ మార్కెట్‌లో తమకు బియ్యాన్ని విక్రయించాలని కర్నాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు సహా పలు రాష్ట్రాలు కోరినప్పటికీ కేంద్రం అంగీకరించలేదు. జూన్ 13 నుండి బహిరంగ మార్కెట్‌లో రాష్ట్రాలకు బియ్యం, గోధుమల విక్రయాలను నిలిపివేసింది.

'ప్లాట్‌ఫారం' కార్మికులకు సంక్షేమ పథకాలు

- కార్మిక శాఖకు పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ : 'ప్లాట్‌ఫారాల'పై ఉపాధి పొందుతున్న కార్మికులు, యాప్‌ల ఆధారంగా పనిచేస్తున్న ఉద్యోగుల కోసం సంక్షేమ పథకాలను రూపొందించి, తక్షణమే అమలు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు సూచించింది. దేశంలో పనిచేస్తున్న కార్మికులలో 90% మంది అసంఘటిత రంగంలోని వారేనని గుర్తు చేస్తూ వారికి పెన్షన్, ఆరోగ్య బీమా, సిక్ లీవులు వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలేవీ ఉండవని తెలిపింది. 2022లో నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 2020-21లో 77 లక్షల మంది 'ప్లాట్‌ఫారం' కార్మికులు ఉన్నారని, 2029-30 నాటికి ఈ సంఖ్య 2.35 కోట్లకు చేరవచ్చునని వివరించింది. యాప్ ఆధారిత ఉద్యోగులు, ప్లాట్‌ఫారం కార్మికులు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్, ఇతర నిబంధనల చట్టం పరిధిలోకి రారని కమిటీ తన నివేదికనలో తెలియజేసింది. అందువల్ల వీరి కోసం ప్రత్యేకించి సంక్షేమ పథకాన్ని రూపొందించాలని సిఫార్సు చేసింది.

'ప్లాట్‌ఫారం కార్మికులను సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి తేవాలని నిబంధనలు చెబుతున్నప్పటికీ చట్టప్రకారం వాటిని నోటిఫై చేయకపోవడంతో నేటి వరకూ అమలు సాధ్యం కాలేదు. కార్మిక నిబంధనల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది' అని మార్చిలో సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది. కాగా ఈ నెల 21న సమర్పించిన తాజా నివేదికలో...పథకాన్ని రూపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్మిక శాఖ నుండి ఎలాంటి స్పందన లేదని తెలిపింది. తీసుకున్న చర్యలు, ఆ దిశగా జరిగిన పురోగతిని గురించి తెలుసుకోవాలని కమిటీ భావిస్తోందని నివేదిక తెలియజేసింది.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలి

- ఎన్‌పీడీసీఎల్ ఎమ్‌డీ అన్నమనేని గోపాల్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) పరిధిలోని 17 జిల్లాల్లో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయటానికి వీలుగా చర్యలు చేపట్టామని ఆ సంస్థ చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల కరెంటు సరఫరాకు అంతరాయం కలిగినా సాధ్య మైనంతవరకు లోడ్ మానిటరింగ్‌లో సత్వర చర్యలు తీసుకోవడానికి 16 సర్కిళ్ళలోని ఎస్‌ఈలతో మాట్లాడామని తెలిపారు. 20 సబ్ స్టేషన్లలోకి నీళ్ళు వచ్చి చేరాయనీ, బ్రేక్ డౌన్ అయిన ఫీడర్లలో 38ఫీడర్లను సరిదిద్దామని తెలిపారు. కొన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. 1208 పోళ్లు, 62 డిటీఆర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. వాటికి వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని పేర్కొన్నారు. వర్షాలు తగ్గు ముఖం పట్టగానే మిగిలిన గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. కరెంట్ లేని గ్రామాల్లో కూడా విద్యుత్ సిబ్బంది సరఫరా అందించటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. చెట్లు విరిగి లైన్లు తెగిపడిన వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఎట్టిపరిస్థితిల్లో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని సూచించారు. ఇంట్లో విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలనీ, తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు. 1800 425 0028, 1912 కు సంప్రదించాలని సూచించారు.

అమిత్ షా పర్యటన వాయిదా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఈ నెల 29న తలపెట్టిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఒక ప్రకటన విడుదల చేశారు. 29న రాష్ట్రంలోని మేధావులు, తెలంగాణ ఉద్యమ కారులు, కవులు, కళాకారులు, ఆయా రంగాల ప్రముఖులతో బీజేపీ సమావేశం నిర్వహించాలని భావించింది. ఆ కార్యక్రమానికి అమిత్‌షా ముఖ్య అతిథిగా వస్తారని ప్రకటించింది. కానీ, వర్షాల నేపథ్యంలో అమిత్ పర్యటన వాయిదా పడింది.

రైళ్ల పునరుద్ధరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి-కాజీపేట స్టేషన్ల మధ్య ట్రాక్‌ను పునరుద్ధరించారు. రైళ్ల రాకపోకలకు అనుమతించారు. దీంతో ఎర్నాకులం-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఈ మార్గంలో పయనించినట్టు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

నైజర్‌లో కుట్ర ప్రయత్నాన్ని ఖండించిన యూఎన్ చీఫ్

ఐక్యరాజ్య సమితి : నైజర్‌లో కుట్ర ప్రయత్నాన్ని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. "నైజర్‌లో పరిస్థితులను గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రజాస్వామ్య పాలనకు, శాంతి సుస్థిరతలకు విఘాతం కలిగించేందుకు బలప్రయోగంతో అధికారాన్ని హస్తగతం చేసుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు" అని ఆ ప్రకటన పేర్కొంది. సంయమనం పాటించాల్సిందిగా ఆయన సంబంధిత పక్షాలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థకు రక్షణ కల్పించాల్సి వుందన్నారు. నైజర్ ప్రభుత్వానికి, ప్రజలకు ఐక్యరాజ్య సమితి బాసటగా వుంటుందన్నారు. పశ్చిమాఫ్రికా దేశమైన నైజర్‌లో అధ్యక్ష గార్డు విభాగానికి చెందిన సైనికులు అధ్యక్షుడిని బుధవారం ఆయన ప్యాలెస్‌లో చుట్టుముట్టి దిగ్బంధించారు. దేశాధ్యక్షుడు మహ్మద్ బజూమ్ ప్రస్తుతం తన భార్యతో కలిసి రాజధాని నియామీలో తన నివాస భవనంలోనే బందీగా వున్నారని ఆ ప్రకటన పేర్కొంది. అధ్యక్ష గార్డు విభాగం అధిపతితో జరిగిన చర్చలు విఫలమవడంతో ఆయనను బందీ చేశారు. గత కొన్ని సంవత్సరాల కాలంలో నైజర్ పొరుగు దేశాలైన మాలి, బుర్కినా ఫాసోల్లో సైనిక కుట్రలు జరిగాయి. పెరుగుతున్న జిహాదీ చొరబాట్లతో మొత్తంగా ఈ ప్రాంతమంతా అస్థిరమైంది.

పాలస్తీనియన్ల ప్రయోజనాలకు మద్దతు

- అబ్బాస్, హనియేలతో సమావేశమైన ఎర్డోగన్

అంకారా : టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డోగన్ బుధవారం పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్, హమస్ నేత ఇస్మాయిల్ హనియేలతో సమావేశమయ్యారు. మంగళవారం అబ్బాస్‌తో విడిగా ఎర్డోగన్ చర్చలు జరిపారు. పాలస్తీనా ప్రయోజనాలకు టర్కీ మద్దతునిస్తుందని ఎర్డోగన్ చెప్పారు. పాలస్తీనియన్ల సంక్షేమానికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. సమావేశం అనంతరం ఇక్కడ జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనా వర్గాలన్నీ ఒక్క తాటిపైకి రావాలని, అప్పుడే వారి ప్రయోజనాలు నెరవేరుతాయని అన్నారు. ఈ క్రమంలో పాలస్తీనియన్ల ఐక్యత, సామరస్య ధోరణి చాలా కీలకమైనవని అన్నారు. పాలస్తీనియన్ల సమస్య పరిష్కారంలో అంతర్జాతీయ సమాజం ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి భాగస్వామ్యం కావాలని ఎర్డోగన్ నొక్కి చెప్పారు.

కలాంకు బీఆర్‌ఎస్ నేతల నివాళి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయటంలో కీలక పాత్ర పోషించిన మిసైల్ సృష్టికర్త ,మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని బీఆర్‌ఎస్‌పీ అధ్యక్షులు తోట చంద్రశేఖర్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారాస నాయకుడు షేక్ ఖాజావలి మాట్లాడుతూ పేదరికంలో పుట్టిన కలాం ఎంతో పట్టుదలతో ఉన్నత చదువులు చదివి అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అధిరోహించారని కొనియాడారు. కలాం స్ఫూర్తితో యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

వనమా వినతిని తోసిపుచ్చిన హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని తాను ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. తన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేసేలా ఆదేశాలివ్వాలంటూ వనమా దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తును న్యాయస్థానం కొట్టివేసింది. 25న ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదలకు కారణాలులేవని జస్టిస్ రాధారాణి తీర్పు వెలువరించారు. తీర్పు కాపీ అందుబాటులోకి వచ్చిందనీ, దానిపై అప్పీల్ దాఖలు చేసుకోవచ్చుననీ, ఈ దశలో తీర్పు అమలును నిలిపివేయలేమని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినట్టు తేలిన తర్వాత కూడా ఉపశమనం ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని ప్రతివాదులుగా ఉన్న జలగం వెంకట్రావు ఇతరుల న్యాయవాదులు వాదించారు. ఈ క్రమంలో తీర్పు అమలును నిలుపుదల చేయడానికి వనమా వద్ద ఎలాంటి బలమైన కారణం లేదంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

జస్టిస్ సామ్ కోషి ప్రమాణం

తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఉదయం 10 గంటలకు హైకోర్టు ఫస్ట్ హాల్‌లో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఛత్తీస్‌గడ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే.

మాజీ సైనికుడి భార్యకు ఊరట

దేశ సరిహద్దుల్లో సేవలు అందించిన మాజీ సైనికుడికి ఇచ్చిన ఐదేకరాల భూమిలో రెండు ఎకరాలను చెత్త డంపింగ్ యార్డు కోసం కేటాయిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు విస్మయాన్ని వ్యక్తం చేసింది. ఆ ఉత్తర్వులను యథాతథస్థితిలో ఉంచాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్ ఇతర ప్రతివాదుల్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెల 23కి వాయిదా వేస్తూ జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. చైనా, పాకిస్తాన్ యుద్ధాల్లో హైదరాబాద్‌కు చెందిన వీజీ విఠల్ భారత వైమానిక (ఎయిర్ ఫోర్స్) విభాగం తరఫున పాల్గొన్నారు. 1974లో యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలోని సర్వే నెంబర్ 64/1లో 5 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అందులో 2 ఎకరాలను డంపింగ్ యార్డ్‌కు కేటాయిస్తూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై ఆయన భార్య వి.అరుణాబాయి వేసిన కేసులో హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్స్ జారీ చేసింది.

ట్రస్ట్‌బోర్డు వివాదంపై..

హనుమకొండ జిల్లా ఐనవోలులోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి వంశ పారంపర్య ట్రస్ట్ బోర్డు వివాదాన్ని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ఫుల్ బెంచ్‌కు హైకోర్టు నివేదించింది. అలాగే బోర్డు నియామక ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ ధర్మకర్తృత్వ సంస్థల చట్టం ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసే అధికారం విషయంలో ఇదే కోర్టులోని డివిజన్ బెంచ్‌లు వేర్వేరుగా తీర్పులు ఇచ్చాయి. దీంతో ఈ పిటిషన్‌లో విచారణను కోర్టు ఫుల్ బెంచ్‌కు అప్పగించింది. మల్లికార్జునస్వామి ఆలయానికి ట్రస్ట్ బోర్డు సభ్యులుగా 14 మందిని నియమించడాన్ని సవాల్ చేస్తూ శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని సింగిల్ జడ్జి కొట్టివేశారు. దీనిపై శ్రీనివాసులు అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. వాదనలను విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది. ఆలయ నిర్వహణ బాధ్యతలను అధికారులకు అప్పగించింది.

నీటి వనరుల్ని కాపాడాలి

భావితరాల మనుగడకు నీటి వనరులు ముఖ్యమని హైకోర్టు అభిప్రాయపడింది. వీటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బఫర్ జోన్ల పరిధిలో ఏవిధమైన నిర్మాణాలు చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది.

జోరువానలోనూ బతుకు పోరు

- కలెక్టరేట్ల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా
- భారీ వర్షంలోనే నిరసన
- ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరిక

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం కోసం 22 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేశారు. జోరు వానలోనూ గురువారం కలెక్టరేట్లను ముట్టడించారు. వర్షంలోనే కూర్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా తమ గోడు వినకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ & ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మహిపాల్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీరికి కేవీపీఎస్, గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కలెక్టర్ నారాయణకు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారించకుండా వారిని అధికారులు బెదిరించడం సరికాదన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు అన్ని మండలాల నుంచి కార్మికులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి బయటకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మొదట మున్సిపల్ ఆఫీసు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. వర్షం కురుస్తున్నా గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి ఎర్రజెండా చేతపట్టి కదం తొక్కారు. ధర్నా నేపథ్యంలో కార్యాలయ గేట్లను మూసేయడంతో వానలోనే కార్మికులు ధర్నా చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జేఏసీ నాయకత్వంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌ను ముట్టడించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. యాదాద్రిభువనగిరి, నల్లగొండ కలెక్టరేట్లను వేలాది మంది కార్మికులు ముట్టడించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు, కొప్పర్లు పట్టుకుని ధర్నాలో పాల్గొన్నారు.



మనోవేదనతో కార్మికుడు మృతి

నవతెలంగాణ-బయ్యారం

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పంప్ ఆపరేటర్ బయ్య కృష్ణ(45) మృతిచెందారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కృష్ణ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నాలుగు రోజులుగా వర్షంలో తడుస్తూనే సమ్మెలో కూర్చున్నాడు. తమ హక్కులను సాధించుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని కుటుంబీకులతో చెబుతూ ఉండేవాడు. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కృష్ణ మృతిచెందారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం ఆలోచించి మరో కార్మికుడు బలి అవ్వకముందే గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉక్రెయిన్ యుద్ధంలో మృత్యుహేళను దాస్తున్న న్యూయార్క్ టైమ్స్

న్యూయార్క్ : రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ చేస్తున్న "వసంతకాల ప్రతిదాడి" నిర్ణయాత్మక మూలమలుపుగా ఉంటుందని న్యూయార్క్ టైమ్స్ జనవరి నుంచి అనేక వ్యాసాలను ప్రచురించింది. అయితే ఆరు వారాలుగా కొనసాగుతున్న ఈ "వసంతకాల ప్రతిదాడి" రష్యా రక్షణ రేఖలను ఏమాత్రం కదిలించలేకపోయింది. ఈ ప్రయత్నంలో అనేక వేలమంది ఉక్రెయిన్ సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఈ సందర్భంగా న్యూయార్క్ టైమ్స్ ఉక్రెయిన్ సైన్యం దుస్థితిని గురించి ఒక వ్యాసాన్ని ప్రచురించింది. ఉక్రెయిన్ "వసంతకాల ప్రతిదాడి"పైన టైమ్స్ ప్రచురించిన వ్యాసం శీర్షిక: "కుచించుకుపోతున్న సైన్యం, నమ్మటానికి వీలులేని ఆయుధాలు: తూర్పులో ఉక్రెయిన్ ఎదుర్కొంటున్న అడ్డంకులు". ఈ శీర్షికకు "భయానక అనిశ్చితి" అనే ఉపశీర్షికను టైమ్స్ జోడించింది.

యుద్ధంలో ఉక్రెయిన్ కొనసాగిస్తున్న "వసంతకాల ప్రతిదాడి" దారుణంగా విఫలమైందనీ, ఈ దాడిలో ఉక్రెయిన్ సైన్యం పెద్ద ఎత్తున్న హతులయ్యారని, అలా హతులయిన వారి స్థానంలో వయసు మీరిన వారిని పంపి బలవంతంగా యుద్ధం చేయిస్తున్నారని ఈ వ్యాసంలో న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఇదే కాకుండా ఇంకా చాలానే రాసింది. కొన్ని యూనిట్లలో సైనికులందరూ మరణించటమో, గాయపడటమో జరిగింది. ఆ తరువాత అదే యూనిట్‌లో చేరిన కొత్తవాళ్ళు కూడా అంతకుముందువలే మరణించటమో, గాయపడటమో జరిగింది. అలాగే ఉక్రెయిన్‌కు అందించిన మందుగుండు చాలావరకూ పాతది. పాత పేలుడు పదార్థాలు మిస్ఫైర్ కావటమో, యాదృశ్చికంగా పేలి సైనికులను గాయపరచటమో జరుగుతుంటుంది. అలాగే యువకులైన సైనికులు యుద్ధంలో మరణిస్తే వారి స్థానంలో వయసుమీరిన వారిని పంపటమంటే ఉక్రెయిన్ సైన్యంలో యువకులు అందుబాటులో లేరని అర్థం చేసుకోవలసి ఉంటుందని ఆ వ్యాసంలో పేర్కొనటం జరిగింది. ఇవే విషయాలను ఒక జర్నలిస్టు గనుక రిపోర్ట్ చేసివుంటే ఈ అంశాలలో ప్రతిదీ ఒక 'స్కూప్' అయి ట్విట్టర్‌కు ఎక్కివుండేదే. కానీ న్యూయార్క్ టైమ్స్ ఎంచుకున్న మార్గం వేరు. ఇంతటి ప్రాధాన్యతగల విషయాలను ఎక్కడో లోపల ప్రచురించి, ఆ తరువాత ఆన్ లైన్ నుంచి న్యూయార్క్ టైమ్స్ తీసివేసింది. అయితే ఈ విషయాలను సమాధి చేస్తే చాలదు. చెరిపి వెయ్యాలనే ఆలోచన టైమ్స్ ది. ఈ వ్యాసాన్ని తూర్పు కాలమానం ప్రకారం



ఉదయం 5.32గంటలకు ఆర్కైవ్.ఆర్గ్ కాపీ చేసింది. ఆ తరువాత 24గంటల్లో ఎటువంటి వివరణ ఇవ్వకుండా ఆ వ్యాసంలోని మూడు ముఖ్య విషయాలను పూర్తిగా తుడిచివేయడం జరిగింది. యుద్ధంలో ఉక్రెయిన్ ఒక దేశంగాను, ప్రజలుగాను సర్వనాశనం అవుతున్న స్థితిని అమెరికా ప్రజలకు తెలియకుండా చేయటమే లక్ష్యంగా అమెరికా మీడియా పనిచేస్తోంది. కేవలం ఒక నెల క్రితమే న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్టు, బ్రెట్ స్టీఫెన్స్ ఉక్రెయిన్ "వసంతకాల ప్రతిదాడి"తో రష్యా చిత్తుచిత్తుగా ఓడిపోతుందని రాశాడు. అలాగే వాషింగ్టన్ పోస్టు కాలమిస్టు, మ్యాక్స్ బూట్ ఉక్రెయిన్ అప్రతిహతంగా ముందుకు సాగుతుందని రాశాడు. కానీ వాస్తవం వేరేగా ఉంది. దుర్భేద్యమైన రష్యా రక్షణ వలయాలను ఛేదించే ప్రయత్నంలో మొదటి ప్రపంచ యుద్ధం తరహాలో సైనిక దళాలకు దళాలే తుడిచిపెట్టుకు పోయాయి. అలా హతులైన వారి స్థానంలో వచ్చిన కొత్త రిక్రూట్లు కూడా హతం అయ్యారు. అమెరికా మిలిటరీ, ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ ను నడుపుతున్న యుద్ధోన్మాదులకు, వారి తొత్తులుగా మారిన ఉక్రెయిన్ పాలకులకు ప్రజల ప్రాణాలు మందుగుండుతో సమానం. ఈ మానవ హననం అమెరికా ప్రపంచాధిపత్య పతనంతో ముడిబడి ఉంది. మరో మహాయుద్ధానికి దారితీస్తుందేమోననే భయం మానవాళిని కలవరపెడుతోంది.

సైనిక సహకారంపై రష్యా, ఉత్తర కొరియా చర్చలు

- రష్యా రక్షణ మంత్రి షోయిగుతో కిమ్ భేటీ

సియోల్ : సైనిక సహకారం, ప్రాంతీయ భద్రతా వాతావరణం అంశాలపై చర్చించేందుకు రష్యా రక్షణ మంత్రి సెర్గి షోయిగుతో ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ సమావేశమయ్యారు. కొరియా యుద్ధం ముగియడానికి దారి తీసిన యుద్ధ విరమణ సంధి 70వ వార్షికోత్సవాన్ని ఉత్తర కొరియా జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. రాజధాని ప్యాంగాంగ్‌లో బుధవారం కిమ్, షోయిగు చర్చలు జరిపారని ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ తెలిపింది. జాతీయ రక్షణ, భద్రతా రంగాల్లో పరస్పర ఆందోళన కలిగించే అంశాలపై, అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా వాతావరణానికి సంబంధించిన అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిపింది. అయితే ఆ అంశాలు ఏమిటనేది నిర్దిష్టంగా వెల్లడించలేదు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతకం చేసిన సుహృద్భావ లేఖను కిమ్‌కు షోయిగు అందచేశారు. చర్చించిన మిలటరీ అంశాలు కూడా ఏమిటనేది తెలియరాలేదు. 1953 జులై 27న ఉభయ కొరియాల మధ్య సాంకేతికంగా యుద్ధం ముగిసింది. ఉత్తర కొరియా దీన్ని విజయంగా భావిస్తుంది. ఉత్తర కొరియా సముపార్జించి కొత్త ఆయుధాలను చూపించేందుకు ఆయుధ ఎగ్జిబిషన్‌కు షోయిగును కిమ్ తీసుకెళ్ళారు. ఉత్తర కొరియా సైనిక పాటవాన్ని విస్తరించేందుకు రూపొందిస్తున్న జాతీయ ప్రణాళికల గురించి ఆయనకు తెలియచేశారు. లాంచర్ ట్రక్కులపై పెట్టిన పెద్ద క్షిపణుల వరుసకు సమీపంలో ఇద్దరు నడుస్తున్న ఫోటోలు బయటకు వచ్చాయి. ఉత్తర కొరియా ఇప్పటివరకు బహిరంగంగా ప్రకటించని కొత్త నిఘా డ్రోన్‌లు, దాడి జరిపే డ్రోన్‌ల ముందు నుండి ఇరువురు నేతలు నడిచారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంలో రష్యా వైపే ఉత్తర కొరియా వుంది. ఉక్రెయిన్‌లో యుద్ధం కోసం ఉత్తర కొరియా ఆయుధాలను సమకూరుస్తోందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆరోపించారు.

బిజినెస్

ఎల్ఐసీ నుంచి కొత్త జీవన్ కిరణ్ ప్లాన్

కనీసం రూ.15 లక్షల బీమా హామీ
ప్రీమియం సొమ్ము మొత్తం వాపస్
సింగిల్ ప్రీమియంను ఎంచుకోవచ్చు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) కొత్తగా జీవన్ కిరణ్ పేరుతో టర్మ్ పాలసీని ఆవిష్కరించింది. ఇది నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ వ్యక్తిగత పొదుపు, జీవిత బీమా పాలసీ అని ఆ సంస్థ వెల్లడించింది. మెచ్యూరిటీ కాలం పూర్తయిన తర్వాత మొత్తం ప్రీమియం వెనక్కు ఇవ్వనున్నట్టు తెలిపింది. జీవన్ కిరణ్ (ప్లాన్ 870) ఇతర వివరాలు.. 18-65 ఏండ్ల లోపు వారు ఈ ప్లాన్ తీసుకోవడానికి అర్హులు. పాలసీ కాలంలో ఏం జరిగిన పాలసీదారు కుటుంబసభ్యులకు బీమా మొత్తాన్ని చెల్లిస్తుంది. సాధారణ టర్మ్ పాలసీల్లో ప్రీమియం మొత్తం వెనక్కు చెల్లించడం ఉండదు.. కానీ ఈ ప్లాన్ కింద పాలసీ కాలంలో బీమా హామీతో పాటు మెచ్యూరిటీ సమయంలో ప్రీమియం సొమ్ము వాపస్ చేస్తుంది. కనీస పాలసీ మెచ్యూరిటీ గడువు 28 ఏండ్లు కాగా, గరిష్టంగా 80 ఏండ్లు టెన్యూర్ ఉంటుంది. 10 ఏండ్ల నుంచి 40 ఏండ్ల టర్మ్‌తో ఈ ప్లాన్ లభిస్తుంది. కనీసం రూ.15 లక్షల బీమా హామీతో ఈ పాలసీ కొనవచ్చు. గరిష్టంగా ఎంత మొత్తం పాలసీ అయినా తీసుకోవచ్చు. కనీస ప్రీమియం రూ.3000 చెల్లించాల్సి ఉంటుంది. సింగిల్ ప్రీమియం రూ.30 వేలుగా నిర్ణయించింది. ఏడాదికోసారి గానీ, రెండు సార్లు గానీ ప్రీమియం మొత్తం చెల్లించవచ్చు. ఈ ప్లాన్‌లో పాలసీదారుడు జీవించి ఉంటే మెచ్యూరిటీ అనంతరం ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. అధిక ప్రీమియంలు, రైడర్లకు చెల్లించిన మొత్తాలు, పన్నులను ఇందులోంచి మినహాయిస్తారు. మెచ్యూరిటీ తేదీ తర్వాత బీమా కవరేజీ రద్దవుతుంది. ఒకవేళ పాలసీ టర్మ్ ప్రారంభమయ్యాక కవరేజీ సమయంలో పాలసీదారుడు మరణిస్తే.. హామీ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు చెల్లిస్తారు. ఇది ఒకేసారి గానీ, ఐదేండ్ల పాటు లేదా ఆరు నెలలకోసారి, మూడు నెలలకోసారి, నెలకోసారి గానీ విడతల వారీగా గానీ చెల్లిస్తుంది. ఈ విషయమై పాలసీదారు ప్రత్యేకంగా ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. రెగ్యులర్ ప్రీమియంపై ఏడు రెట్ల బెనిఫిట్ లభిస్తుంది. సింగిల్ ప్రీమియంపై 125 శాతం బెనిఫిట్ అందుతుంది. ఆత్మహత్య మినహా ప్రమాదవశాత్తు మరణంతోపాటు అన్ని రకాల మరణాలకూ ఈ ప్లాన్ కవరేజీ లభిస్తుంది. ఈ పాలసీని దగ్గరలోని ఏజెంట్‌ను లేదా ఎల్ఐసి వెబ్‌సైట్‌లోనూ కొనుగోలు చేయడానికి అవకాశం ఉంది.

అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోమారు కీలక వడ్డీ రేట్లను పెంచింది. వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచి గత 22 ఏండ్లలో ఎప్పుడూ లేనంతగా 5.50 శాతానికి చేర్చుతూ.. జులై 26న నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణంపై పోరాటం సాగుతుందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ తెలిపారు. వరుసగా వడ్డీ రేట్ల పెంచుతూ.. రెండు దశాబ్దాల గరిష్టానికి చేర్చడంతో అమెరికాలో ఆర్థిక సంక్షోభం ముదురుతుందనడానికి సంకేతాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మారుతి డ్రైవింగ్ స్కూల్‌లో 20 లక్షల మందికి శిక్షణ

న్యూఢిల్లీ : మారుతి సుజుకి తమ డ్రైవింగ్ స్కూల్స్‌లో ఇప్పటి వరకు 20 లక్షల మందికి డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి.. నూతన మైలురాయిని చేరినట్టు ఆ సంస్థ తెలిపింది. దేశంలోని 230 పైగా నగరాల్లోని 520 పైగా మారుతి సుజుకి డ్రైవింగ్ స్కూళ్లలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తుందని పేర్కొంది. 2005లో తొలిసారి డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించినట్టు పేర్కొంది. తొమ్మిది భాషల్లోనూ శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించింది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ సేవల విస్తరణ

బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ సర్వీసుల్లో సర్దుబాటు



బెంగళూరు : విమానయాన రంగంలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తమ పలు సేవల్లో సర్దుబాట్లు చేస్తున్నట్టు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) గ్రూప్ వెల్లడించింది. ఎస్ఐఏ, స్కూట్ తమ సామర్థ్యం, నెట్‌వర్క్ మార్పుల్లో భాగంగా బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ సేవలను పునర్నిర్మిస్తున్నట్టు పేర్కొంది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ ఆమోదాలకు లోబడి మార్పులు చేసినట్టు తెలిపింది. 2023 నవంబర్ 5 నుంచి సింగపూర్ - చెన్నయ్ మధ్య రోజువారీ సేవలను స్కూట్ ప్రారంభిస్తున్నట్టు పేర్కొంది. ఫలితంగా సింగపూర్, చెన్నయ్ మధ్య ఎస్ఐఏ గ్రూప్ కార్యకలాపాలు వారానికి 17 సార్ల నుంచి వారానికి 21 సార్ల వరకు పెరుగుతాయని తెలిపింది. 2023 అక్టోబర్ 29 నుంచి సింగపూర్, హైదరాబాద్ మధ్య స్కూట్ రోజువారీ సేవలను అందుబాటులోకి తేనుందని.. రెండు నగరాల మధ్య రాకపోకలను వారానికి ఏడు సార్ల నుండి 12 సార్లకు క్రమంగా పెంచనుందని వెల్లడించింది.

లారస్ ల్యాబ్స్‌కు రూ.28 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో లారస్ ల్యాబ్స్ లాభాలు 88.8 శాతం పతనమై రూ.28.40 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.252.5 కోట్ల లాభాలు నమోదయ్యాయి. ఇదే సమయంలో రూ.1,539 కోట్ల రెవెన్యూ ఆర్జించగా.. గడిచిన క్యూ1లో 23.2 శాతం తగ్గి రూ.1,181.8 కోట్లుగా చోటు చేసుకుంది.

కార్యకలాపాల బలోపేతంపై వోకార్డ్ దృష్టి

Saving Lives 55 years WOCKHARDT | LiFE WiNS

హైదరాబాద్ : అంతర్జాతీయ ఔషధ, బయోటెక్నాలజీ కంపెనీ అయిన వోకార్డ్ లిమిటెడ్ తన వ్యాపార కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇందుకోసం కీలక వ్యూహాత్మక చొరవలను తీసుకోనున్నట్లు పేర్కొంది. అమెరికా వ్యాపార పునర్నిర్మాణం, బ్రిటన్‌లో వ్యాక్సిన్ తయారీ కోసం సీరంతో వ్యాక్సిన్ ఒప్పందం, వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నోవెల్ యాంటీబయాటిక్స్ రీసెర్చ్ వంటి అంశాలపై కంపెనీ దృష్టి సారించినట్లు వెల్లడించింది. 2023 నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 7 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు పేర్కొంది. తన అమెరికా కార్యకలాపాల పునర్నిర్మాణంలో, కంపెనీ మోర్టన్ గ్రోవ్‌లోని తన ఉత్పత్తి కేంద్రాన్ని మూసేసి, సైట్‌ను కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు బదిలీ చేయడం ద్వారా ఏడాదికి 12 మిలియన్ డాలర్లు ఆదా చేయాలని నిర్దేశించుకున్నట్టు పేర్కొంది.

వికలాంగులపై వివక్ష

వారి జనాభా సమాచారాన్ని 'నిటి ఆయోగ్'లో చేర్చాలి

- వారిలో బహుమితీయ పేదరికం అధికం
- పలు అంశాల్లో వెనకబడి ఉన్న వైనం
- నిపుణులు, విశ్లేషకుల సూచన

న్యూఢిల్లీ : భారత్‌లోని వికలాంగులపై వివక్ష కొనసాగుతున్నదనీ, వారు ఇతర పేదవారి కంటే అధికంగా అనేక రంగాల్లో వెనకబడి ఉన్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. భారతదేశ పేదరికాన్ని 24.9 శాతం నుంచి 15 శాతానికి తగ్గించినట్టు నిటి ఆయోగ్ ఇటీవల తన నివేదికలో పేర్కొన్నది. ఇది ద్రవ్యపరమైన అంశాలకు అతీతంగా పేదరికాన్ని అర్థం చేసుకునేందుకు సానుకూల దశను సూచిస్తుందని నిపుణులు తెలిపారు. అయితే, వికలాంగుల విషయం పైనా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిటి ఆయోగ్ నివేదికలో వికలాంగుల జనాభాకు సంబంధించిన సమాచారాన్ని చేర్చాలను సూచిస్తున్నారు. వైకల్యం లేనివారితో పోలిస్తే వికలాంగ సభ్యులు ఉన్న కుటుంబాలు బహుమితీయ పేదరికాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయని అనేక అధ్యయనాల సమాచారాన్ని, నివేదికలను వారు గుర్తు చేస్తున్నారు. వైకల్యాన్ని నిర్వచించటమంటే పేదరికాన్ని నిర్వచించినంత సవాలుగా ఉంటుందనీ, వికలాంగులు పేదరికానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని విశ్లేషకులు, నిపుణులు నమ్ముతున్నారు. అయితే, పేదరికాన్ని కొలిచే విధానం తరచుగా వారి ప్రత్యేక సవాళ్లు, అవసరాలను విస్మరిస్తుందనీ, పేదరిక సూచీలో వీరి అంశాలు కనబడకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశ జాతీయ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు అనే మూడు సమానమైన పరిమాణాలను కలిగి ఉంటుంది. వీటిని మొత్తం 12 సూచికలు సూచిస్తాయి. భారతదేశంలో పేదరికాన్ని చర్చించడానికి బహుమితీయ సూచికను ఉపయోగించడం ఒక విధానం. అయితే, నివేదిక పరిమిత ఆరోగ్య సూచికలు, పోషకాహారం, పిల్లలు, కౌమార మరణాలు, ప్రసూతి ఆరోగ్యం వంటివి పేదరికంపై వైకల్యం ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోవటం ఆందోళనకరమని నిపుణులు అంటున్నారు.

వికలాంగ వ్యక్తి కుటుంబం వారి జీవితకాలంలో పునరావృతమయ్యే వైద్య వ్యయాన్ని ఎదుర్కొంటుంది. మొత్తం 12 సూచికలను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తుంది. అయినప్పటికీ, వైకల్యం అనే పదం మొత్తం నివేదికలో ప్రసూతి ఆరోగ్యం, పుట్టుకతో వచ్చే వైకల్యాలకు సంబంధించిన నివారణ సందర్భంలో మాత్రమే ఉపయోగించబడింది. వైకల్యం, ఆరోగ్య ఖర్చుల దీర్ఘకాలిక, పునరావృత ప్రభావం, ఇతర అంశాలను విస్మరించటం అనేది ఎంపీఐలోని అన్ని ఇతర సూచికలను ప్రభావితం చేస్తుందని నిపుణులు తెలిపారు.

ఉదాహరణకు, విద్యా కోణంలో చూస్తే.. వైకల్యం ఉన్న వ్యక్తికి అందుబాటులో ఉన్న పాఠశాలలు లేకపోవడంతో పాఠశాల హాజరు తక్కువగా ఉండవచ్చు లేదా పాఠశాల హాజరు ఉండకపోవచ్చు.

ఇది 'పాఠశాల హాజరు' సూచికను ప్రభావితం చేస్తుంది. మరోవైపు, ఆటిజంతో బాధపడుతున్న పిల్లవాడు ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావచ్చు కానీ 'పాఠశాల సంవత్సరాల' సూచికలో 'కోల్పోయిన' అని వర్గీకరించబడదు. కానీ పిల్లవాడు అవసరమైన స్థాయి విద్యను విజయవంతంగా సాధించాడని దీని అర్థం కాదు అని నిపుణులు విశ్లేషకులు తెలిపారు."పేదరికంపై వైకల్యం ప్రభావం అటువంటి సందర్భాలలో కనిపించదు. స్థిరమైన జీవనోపాధి సూచికను చేర్చడం వికలాంగ సంఘం ఎదుర్కొంటున్న సవాళ్లను హైలైట్ చేస్తుంది" అని నిపుణులు చెప్పారు.

మేఘాలయ సీఎం కార్యాలయంపై దాడి కేసులో 20 మంది అరెస్టు

- వీరిలో ఇద్దరు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు

షిల్లాంగ్ : పశ్చిమ గారో హిల్స్ జిల్లాలోని తురా పట్టణంలో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా కార్యాలయంపై సోమవారం రాత్రి జరిగిన దాడిలో ప్రమేయం ఉన్న 20 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు ఉన్నారు. వారిని బెలీనా ఎం మరక్, దిల్చే చ్ మరక్ లుగా గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడి పోలీసు అధికారులు తెలిపారు. తురాలోని మినీ సెక్రెటేరియట్‌పై ఒక గుంపు రాళ్లు రువ్వి, పోలీసు వాహనానికి నిప్పుపెట్టింది. రెండు ఫైర్ టెండర్లను ధ్వంసం చేసింది. ఆ తర్వాత జరిగిన దాడిలో ఐదుగురు పోలీసు అధికారులు గాయపడ్డారు. దాడి జరిగిన సమయంలో తురాను రాష్ట్ర శీతాకాల రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరాహారదీక్ష చేస్తున్న గారో కమ్యూనిటీకి చెందిన పౌర సమాజ సంఘాలతో సంగ్మా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం, రాష్ట్ర రాజధాని షిల్లాంగ్ తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో ఉంది.కాగా, ఆందోళనకారుల దాడిలో కనీసం 21 వాహనాలు ధ్వంసమయ్యాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గుంపును ప్రేరేపించిన ఇద్దరు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతల కోసం కూడా పోలీసులు వెతుకుతున్నారని సదరు అధికారి చెప్పారు. గాయపడిన పోలీసులకు సీఎం రూ.50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

రూ. ఏడు లక్షల కోట్లు అప్పు చేసిన ఎపి ప్రభుత్వం

- కేంద్రానికి పురందేశ్వరి ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి విమర్శించారు. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కేంద్ర మంత్రి మురళీధరన్‌తో కలిసి పురందేశ్వరి భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల మళ్లింపు వంటి రాష్ట్ర ఆర్థిక సమస్యలపై ఫిర్యాదు చేశారు.

అమెరికా నిషేధంతో దినార్ పతనం

ఇరాక్‌లో సెంట్రల్ బ్యాంకుల ఎదుట ప్రజల నిరసన ప్రదర్శనలు



బాగ్దాద్ : స్థానిక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇరాక్‌తో పాటు పలు సెంట్రల్ బ్యాంకుల ఎదుట ప్రజలు బుధవారం భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 2021 నుండి భారీ ఆందోళనలు చేపడుతున్న 'తువార్ తిష్రీన్ (అక్టోబర్ రివల్యూషనరీస్)' నేతత్వంలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. 14 ఇరాక్ బ్యాంకులను అమెరికా బ్లాక్ లిస్ట్‌లో చేర్చడంతో ఇరాక్‌లో ఒక్కసారిగా దినార్ విలువ పడిపోయింది. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ 14 బ్యాంకులు ఓ ప్రకటన విడుదల చేశాయి.

అమెరికా విధించిన నిషేధం కేవలం డాలర్ ధరపై మాత్రమే ప్రభావం చూపదని, విదేశీ నిధుల ప్రవాహంపై కూడా పరిమితిని విధిస్తుందని బాగ్దాద్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్ యజమాని హైదర్ అల్ శర్మ తెలిపారు. అమెరికా విధించిన నిషేధంతో పలు ప్రతికూల పరిణామాలను ఎదుర్కోవలసి వుంటుందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకుల నష్టాన్ని పూడ్చేందుకు, బ్యాంకులు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు, ఇరాక్‌లోని బ్యాంకింగ్ రంగాన్ని సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఆడిట్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాజకీయ ఉద్రిక్తతలతో బ్యాంకులకు సంబంధం లేదని, బ్యాంకులన్నీ స్వతంత్ర సంస్థలేనని అన్నారు.

ఇరాన్‌కు నిధులను మళ్లించడంతో పాటు మనీలాండరింగ్‌కి పాల్పడ్డాయన్న ఆరోపణలతో ప్రైవేట్ బ్యాంకులను దినార్‌తో డాలర్ల మారకంపై అమెరికా నిషేధం విధించింది. గతంలోని బ్యాంకులతో పాటు తాజాగా ఎనిమిది బ్యాంకులపై అమెరికా ఆంక్షలు విధించింది.

ఇరాక్‌లోని 72 బ్యాంకులలో సుమారు మూడో వంతు బ్లాక్‌లిస్ట్‌లో చేర్చినట్టు ఇద్దరు ఇరాక్ సెంట్రల్ బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో మార్కెట్‌లో మారకపు రేటు అధికమైంది. గడిచిన రెండు రోజుల్లో డాలర్‌కి 1,470గా ఉండే దినార్ మారకం... డాలర్‌కి 1,570 దినార్‌లకు చేరింది. కొందరు వ్యాపారులు సెంట్రల్ బ్యాంక్ వంటి అధికారిక ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించకుండా బ్లాక్ మార్కెట్‌లో కరెన్సీ మారకాన్ని చేపడుతున్నారని సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అలి-అల్-అల్లాక్ పేర్కొన్నారు. డాలర్‌తో దినార్‌ను స్థిరీకరించే చర్యలపై చర్చించేందుకు తాను గత ఆదివారం ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్ - సుదానీతో సమావేశమయ్యానని చెప్పారు.

విదేశీ జైళ్లలో 8,300 మంది భారత ఖైదీలు

న్యూఢిల్లీ : విదేశీ జైళ్లలో 8,300 మంది భారత ఖైదీలు మగ్గుతున్నారని విదేశాంగశాఖ వెల్లడించింది. ఇందులో యుఎఇ, సౌదీ అరేబియా, కువైట్ తదితర గల్ఫ్ దేశాల్లోనే ఎక్కువ మంది ఉన్నారని తెలిపింది. విదేశాల్లోని భారత ఖైదీల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని విదేశాంగశాఖ సహాయ మంత్రి వి మురళీధరన్ చెప్పారు. ఈ ఖైదీలను విడుదల చేసి, స్వదేశానికి రప్పించేందుకు అక్కడి ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ, యుఎఇలోని జైళ్లలో 4,630 మంది భారత ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నట్టు కేంద్రం తెలిపింది. ఇందులో అత్యధికంగా యుఎఇలో 1,611 మంది, సౌదీలో 1,461, ఖతార్‌లో 690 మంది ఖైదీలు ఉన్నట్టు పేర్కొన్నది.

ఐఫోన్ కోసం కన్నకొడుకునే అమ్మేశారు !

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌కు చెందిన దంపతులు ఐఫోన్ కొనేందుకు కన్నకొడుకునే అమ్మేశారు. రీల్స్ చేసేందుకు ఎనిమిది నెలల పసికందును విక్రయించారు. నిందితులను కోల్‌కతాకు చెందిన జయదేవ్, సతిగా పోలీసులు గుర్తించారు. వీరికి ఏడేళ్ల కూతురు కూడా ఉంది. గత శనివారం కుమారుడిని విక్రయించిన ఆ దంపతులు.. అనంతరం ఖరీదైన ఐఫోన్‌ను కొనుగోలు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి రీల్స్ చేశారు. అయితే రోజు గడవడమే కష్టంగా ఉండే ఆ దంపతుల చేతుల్లో ఖరీదైన ఐఫోన్ ఉండటం, కుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానమొచ్చింది.

భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదలశాఖ అప్రమత్తం : రజత్‌కుమార్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ అప్రమత్తంగా ఉందని ఆ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. కడెం ప్రాజెక్టులో రెండు గేట్లు మొరాయించాయనీ, వాటికి వెంటనే మరమ్మతులు చేసి పునరుద్ధరించినట్ల చెప్పారు. డ్యామ్ ఎత్తు 700 అడుగులు కాగా, 702 అడుగుల మేర నీటి ప్రవాహం ఉందని అన్నారు. గతేడాది 706 అడుగుల మేర నీరు ప్రవహించిందనీ, ఎలాంటి ఇబ్బంది జరగలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు.

మిషన్ కాకతీయ ఫలితాలు కనిపిస్తున్నయ్..

బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం 8 గంటల వరకు ములుగులో అత్యధికంగా 650 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంత పెద్ద మొత్తంలో వర్షాపాతం నమోదవడం ఇదే తొలిసారని రజత్‌కుమార్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్‌లో అత్యధిక వర్షపాతం నమోదైందనీ, నీటిపారుదల శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నదని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయనీ, మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల పూడికతీతతో ఇంత భారీ వర్షాలు, వరదలతో పెద్దగా గండ్లు పడడం లేదన్నారు. ఇంత పెద్ద ఎత్తున వరదలు వచ్చిన కేవలం 100లోపు చెరువులు మాత్రమే గండ్లు పడ్డాయని తెలిపారు. గోదావరి నదిలో వరద ఎక్కువగా ఉందనీ, జిల్లా కేంద్రాల్లో నీటిపారుదల శాఖ ప్రత్యేకంగా ఇంజినీర్లను నియమించినట్టు వివరించారు. కడెంలో వరద ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. రాబోయే కొద్దిగంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్యామ్‌లపైకి వెళ్లి సెల్ఫీ తీసుకోవద్దని సూచించారు.

భద్రాచలం వద్ద ఉధృతంగా గోదావరి

భద్రాచలం దగ్గర గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నదని రజత్‌కుమార్ తెలిపారు. అక్కడ సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల్లోని నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచామన్నారు. సైనికులను అక్కడ అందుబాటులో ఉంచుతామనీ, సాయంత్రం భద్రాచలానికి రెండు హెలికాప్టర్లు పంపున్నట్టు చెప్పారు.

గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటేయాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ

అమరావతి : విశాఖ స్టీలు ప్లాంటును కేంద్రం ఇప్పటి వరకూ ప్రైవేటీకరించలేకపోయిందని ఇప్పుడు అదానీని, గంగవరం పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు రాకుండా అడ్డుకుంటూ నష్టాలబాట పట్టిస్తోందని సీఐటీయూ ఏపీ రాష్ట్ర కమిటీ పేర్కొంది. గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటేయాలని కోరింది. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. మూడు రోజుల నుంచి వెయ్యి కోట్ల విలువగల కోకింగ్ కోల్‌ను గంగవరం పోర్టులోకి రాకుండా అదానీ కంపెనీ ఆపేసిందని, రూ.71 లక్షలు విశాఖ ప్లాంటు డేమరేజ్ కట్టిందని తెలిపారు. పోర్టులో ఉన్న కోల్‌ను కూడా కన్వేయర్ బెల్టు రిపేరు పేరుతో సరఫరా నిలిపేసిందని, పోర్టును అదానీ స్వాధీనం చేసుకున్న తరువాత రవాణా ఛార్జీలు విపరీతంగా పెంచిందని వివరించారు. రూ.51 కోట్ల బకాయి ఉన్నారనే నెపంతో ప్లాంటు ఉత్పత్తిని దెబ్బతీయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం, అదానీ కలిసి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. స్టీలు ప్లాంటు భూములు 1,100 ఎకరాలు అదానీ పోర్టుకు ప్రభుత్వం అప్పగించిందని, విశాఖకు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటపాడు మండలంలో పనికిరాని ప్రభుత్వ భూములు స్టీలుప్లాంటుకు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి గంగవరం పోర్టులో ఉన్న 10.54 శాతం వాటాను మోడీ ఒత్తిడితో కారుచౌకగా పోర్టు యాజమాన్యానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బదిలీ చేశారని అన్నారు. ఇప్పటికీ పోర్టుకు స్టీలు ప్లాంటే నీటిని సరఫరా చేస్తోందని, అయినా ప్లాంటును దెబ్బతీసే విధంగా అదానీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉత్పత్తిని దెబ్బతీసి కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని, రెండున్నరేళ్ల నుంచి ఉత్పత్తిని 40 శాతం తగ్గించారని, ఫలితంగా ఏడాదికి రూ.3,900 కోట్లు ప్లాంటుకు నష్టాలు వచ్చాయని అన్నారు. ఇప్పుడు పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు రాకుండా అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004లో సుదీర్ఘ పోరాటం తరువాత 590 మంది గంగవరం, దిమ్మపాలెం గ్రామాల నుండి నిర్వాసితులను యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులుగా తీసుకుందని, వారికి ఇప్పటికీ రూ.14 వేల జీతం ఇస్తున్నారని తెలిపారు. పర్మినెంటు చేయాలని 22 రోజుల నుండి పోరాడుతున్నా పోర్టు యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని అన్నారు. గత వారం నుండి స్టీలు ప్లాంటులో తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయని, రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ దెబ్బతింటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నట్లు నటిస్తోందని విమర్శించారు.

అదానీ కంపెనీతో మాట్లాడే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో గంగవరం పోర్టును ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

- కాలువల నిర్వహణ కూడా చేయలేని ప్రభుత్వం :టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి : సాగునీటి రంగానికి సిఎం జగన్ తీరని ద్రోహం చేశారని, రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అటకెక్కించారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. సాగునీటి రంగం, ప్రాజెక్టుల నిర్మాణంపై సమాధానం చెప్పాలని, లేదంటే అధికారంలో కొనసాగే అర్హత లేదని అన్నారు. కోస్తాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుల వారీ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు చేసిన ఖర్చులు, వాటి స్థితిగతుల గురించి వివరించారు. కోస్తాంధ్ర ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వం రూ.21,442 కోట్లు ఖర్చు చేసిందని, వైసిపి నాలుగేళ్లలో కేవలం రూ.4,375 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. తాము 23 ప్రాజెక్టులు పూర్తిచేసి 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామన్నారు. వైసిపి నాలుగేళ్లలో ఒక్క ప్రాజెక్టూ పూర్తిచేయలేదని విమర్శించారు. వంశధార ఫేజ్-2 నిర్మాణంపై గడువు పెంచడం, తేదీలు మార్చి ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిపాటి మిగిలిన తోటపల్లి బ్యారేజీ నిర్మాణ పనులను ప్రభుత్వం పూర్తిచేయలేపోయిందని, రూ.56 కోట్ల ప్రజల సొమ్మును నీళ్లపాలు చేసిందని విమర్శించారు. బిల్లులు నిలిపేయడంతో మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కాంట్రాక్టరు పనులు ఆపేసి వెళ్లిపోయారని తెలిపారు. తారకరామ తీర్థ సాగర్ రిజర్వాయరులో పెరిగిన పిచ్చిచెట్లను తొలగించలేకపోయారని, హిరమండల పనులను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పలేని దుస్థితి నెలకొందని అన్నారు. పురుషోత్తమ పట్నం ప్రాజెక్టులో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ట్రిబ్యునళ్ల ముందు నిలిపి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. తాటిపూడి ఆయకట్టు పనులను నిలిపేసి తూర్పుగోదావరి జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర లిఫ్ట్ బిల్లులు ఇవ్వకుండా పనులు ఆపారని, చింతలపూడి లిఫ్ట్‌కు నిధులు లేవని భూసేకరణ నిలిపేశారని వివరించారు. పులిచింతల ప్రాజెక్టు గేట్లకు గ్రీజు కూడా రాయలేక గేట్లు కొట్టుకుపోయేలా ప్రభుత్వం చేసిందన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో ఒక టన్నెల్ తాము పూర్తిచేశామని, నీళ్లిచ్చే సమయానికి ఈ ప్రభుత్వం పనులన్నీ ఆపేసిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో తవ్విన మట్టిని శ్రీశైలం కొండల్లో పోస్తున్నారని, దీనివల్ల ప్రాజెక్టులో సిల్ట్ పెరిగి నష్టం ఎక్కువ జరుగుతుందని వివరించారు. గుండ్లకమ్మ రిజర్వాయరు నిర్వహణను పట్టించుకోకపోవడంతో గేట్లు కొట్టుకుపోయాయని, అడ్డగోలుగా ఇసుక తవ్వేయడంతో మొత్తం ప్రాజెక్టు ప్రమాదంలో పడే పరిస్థితి ఉందన్నారు. కృష్ణా డెల్టా ఆధునీకరణ ఆపేయడంతో ఇప్పటికీ లక్షల ఎకరాల్లో నీటి ఎద్దడి ఉందని, ప్రాజెక్టుల్లో గుర్రపుడెక్క తీయడం లేదని విమర్శించారు. ఇరిగేషన్ మంత్రి సొంత నియోజకవర్గం సత్తెనపల్లిలో రైతులే చందాలు వేసుకుని కాలువలు బాగుచేసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. గోదావరి డెల్టాలో గేట్లు సరిగ్గా లేవని, అన్నీ లీకవుతున్నాయని, కొన్ని గేట్లు తుప్పుపట్టాయని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా ఫ్లడ్ నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో పంటపొలాలు నీళ్లపాలవుతున్నాయని అన్నారు. రాయలసీమకు 300 టిఎంసిలు తరలించే గొప్ప ప్రాజెక్టు గోదావరి-పెన్నా నదుల అనుసంధానాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పినట్లు ఐదు నెలల్లో ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షల్లో కట్టుకథలు చెప్పారని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా నాలుగేళ్లలో రూ.40 వేలకోట్లు దోచుకున్నారని, వీటితో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులూ పూర్తిచేసి మొత్తం భూములకు నీళ్లు ఇవ్వొచ్చని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాజెక్టులకు నిర్దిష్ట గడువు విధించి పూర్తిచేస్తామని చెప్పారు.

సీనియర్ ఐపీఎస్‌ల నేతృత్వంలో ఫ్లడ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు

- 2900 మందిని వరదల నుంచి కాపాడిన పోలీసులు
- 24 గంటల పాటు వరదలను సమీక్షిస్తున్నాం : డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏర్పడ్డ భారీ వరదలను సమీక్షించి ప్రజలను రక్షించడానికి గానూ రాష్ట్ర స్థాయిలో ఫ్లడ్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ అంజనీ కుమార్ గురువారం తెలిపారు. ఈ మానిటరింగ్‌సెల్‌ను అదనపు డీజీలు శివధర్ రెడ్డి, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్‌లు స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత 24 గంటల్లో ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు వరద ముంపు ప్రాంతాల నుంచి 2900 మందిని నీట మునగకుండా రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ఆయన చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరాంచ గ్రామం పూర్తిగా వరద నీటితో మునిగిపోవటంతో అక్కడి గ్రామస్తులను పూర్తిగా ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా సహాయ శిబిరాలకు చేర్చామనీ, ఇందుకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లను కూడా ఉపయోగించామని అంజనీ కుమార్ వివరించారు. కాగా, రాగల 24 గంటల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం తాజాగా హెచ్చరించిన నేపథ్యంలో అన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లు మరింత జాగరూకతతో మెలగాలని ఆయన ఆదేశించారు. భద్రాచలం, ములుగు, అదిలాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రదేశాలు, గ్రామాల గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని రెండు రీజియన్ల ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, షానావాజ్ ఖాసీం లు సేకరిస్తూ వరద బాధితులను ఆదుకోవటానికి తగిన చర్యలను చేపడుతున్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని మూసి పరివాహక ప్రాంతంలో సైతం పర్యవేక్షణాధికారుల సంఖ్యను పెంచి ముంపునకు గురయ్యే ప్రాంతం నుంచి ప్రజలను తరలిస్తున్నట్టు ఆయన వివరించారు. వరద ప్రాంతాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారీ కార్యాలయం నుంచి అందుతున్న ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేస్తున్నామని డీజీపీ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో భద్రాచలంలో పెరుగుతున్న గోదావరి నీటి మట్టాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని ముంపునకు గురయ్యే ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను చేపట్టినట్టు చెప్పారు. కాగా, భారీ వర్షాల కారణంగా ప్రజలెవరు కూడా విద్యుత్ స్తంభాలను తాకటం కానీ, రోడ్లపై పడి ఉన్న వైర్లను కానీ తాకటం వంటివి చేయొద్దని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ఉత్తర తెలంగాణలో విద్యుత్ స్తంభాలను తాకిన కారణంగా ఇద్దరు వ్యక్తులు ప్రాణాలను కోల్పోయారని ఆయన చెప్పారు.

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన సహాయక చర్యల్లో 18 బోట్లు : డీజీ వై. నాగిరెడ్డి

భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలను రక్షించటానికి గానూ ఉత్తర, దక్షిణ తెలంగాణా జిల్లాల్లో మొత్తం 18 పడవలు సహాయక చర్యలకు రంగంలోకి దిగి పని చేస్తున్నాయని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) వై. నాగిరెడ్డి తెలిపారు. సుశిక్షితులైన క్రూ సిబ్బంది కూడా ముగ్గురు నుంచి నలుగురి వరకు ఈ పడవలలో పని చేస్తున్నారని చెప్పారు. అలాగే, వరదల్లో చిక్కుకొని కొట్టుకుపోయే బాధితులను కాపాడటానికి 148కి పైగా గత ఈతగాళ్లు కూడా ప్రమాద ప్రాంతాల్లో పని చేస్తున్నారని ఆయన తెలిపారు.